భారత
కమ్యూనిస్టు
పార్టీ
(మార్క్సిస్టు)

అధ్యయన బృందం నివేదిక

# వ్యవసాయక వర్గాలు

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

# 1. ఉపోద్ఘాతం

1. అధ్యయన బృందాలు చేయవలసిన పనియేమంటే, 'వ్యవసాయక వర్గాల గురించీ, వాటిలో చోటుచేసుకున్న మార్పుల గురించీ', నివేదికను సమర్పించటం. 'సరళీకరణ కాలం నాటినుంచీ సామాజిక–ఆర్థిక పరిస్థితులలో సంభవించిన మార్పులను అవగాహన చేసుకునేందుకై శాస్త్రీయ అధ్యయనాన్ని సాగించాలన్న' కేంద్ర కమిటీ నిర్ణయించిన పూర్వరంగంలో యీ అధ్యయన బృందాన్ని ఏర్పాటు చేయటం జరిగింది. నయా ఉదారవాద విధానాల ప్రభావాన్నీ, వివిధ వర్గాలలో చోటుచేసుకుంటున్న మార్పులు, వాటిలోపలి తారతమ్యాల గురించి కూడా అధ్యయన బృందం చూడవలసి వుంటుంది. ఈ మార్పులు మన వ్యూహాలపైనా, నినాదాలపైనా, వుద్యమాభివృద్ధిపైనా ప్రభావాన్ని చూపగలవు.
2. భారతదేశంలో వ్యవసాయ సమస్య యొక్క ప్రాధాన్యత కేవలం భారతదేశ ప్రజలలో దాదాపుగా 70 శాతం మంది గ్రామీణ ప్రాంతాలలో నివసిసున్నారన్న వాస్తవంపై మాత్రమే కాకుండా (ఇది ప్రధానమైన కారణమే) జనతా ప్రజాతంత్ర విప్లవానికి వ్యవసాయ సమస్య ఇరుసువంటిదన్న వాస్తవంపై కూడా ఆధారపడి వున్నది. అంతేకాక, జనతా ప్రజాతంత్ర దశ కొనసాగినంత కాలం దాని ప్రాధాన్యత నిలిచే వుంటుంది.
3. ఏదియేమైనప్పటికీ, గత రెండు దశాబ్దాల పైనుంచి గ్రామీణ ప్రాంతాలలో వేగమూ, సంక్లిష్టమూ అయిన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ మార్పులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థపైనా, సమాజంపైనా రకరకాలుగా గట్టి ప్రభావాన్ని చూపుతున్నాయి. భారతదేశంలో ప్రపంచీకరణ శకానికీ, అలానే సరళీకరణ, తదనంతర దశలకూ మధ్య ఎడతెగని కొనసాగింపు కన్పిస్తున్నప్పటికీ, 1991 నుంచీ భారతదేశ గ్రామీణ ప్రాంతాలలో రాజ్యవ్యవస్థ

అనుసరిస్తున్న వర్గ విధానాలు విలక్షణమైన సరికొత్త మార్పులతో కూడుకుని వున్నాయి.

4. మొత్తంమీద నూతన విధాన సరళిని యీ విధంగా గుర్తించవచ్చు.....

* భూసంస్కరణలను వెనుకపట్టు పట్టించటం, చట్టం ద్వారా వ్యవసాయ భూముల స్వాధీనాన్ని వేగిరం చేయటం,
* ఎరువులు తదితరాల ధరలను, వ్యవసాయోత్పత్తుల ధరలను నియంత్రించే విధానాలలో మార్పులు,
* గ్రామీణ ప్రాంతాలలో భౌగోళిక, సామాజిక రంగాలకు చెందిన మౌలిక సదుపాయాలకు ప్రభుత్వ వ్యయంలో కోతపెట్టటం,
* వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌కు, నిల్వలకు సంబంధించిన ప్రభుత్వ సౌకర్యాలను ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేయటం,
* సామాజిక – అభివృద్ధి బ్యాంకింగ్ యొక్క వ్యవస్థాగత చట్రాన్ని బలహీన పరచటం,
* వ్యవసాయోత్పత్తుల వాణిజ్యంలో ఆంక్షల సడలింపు, వ్యవసాయోత్పత్తుల దిగుమతులపై నిబంధనల తొలగింపు,
* నిల్వలకు, మార్కెటింగ్‌కు సంబంధించిన ప్రభుత్వ సదుపాయాలను బలహీనపరచటం,
* ప్రజాపంపిణీ వ్యవస్థపై కోతవిధింపు,
* జాతీయ వృక్ష, జీవ సంపద పరిరక్షణకు వుద్దేశించిన పరిశోధన, విస్తరణ, యంత్రాంగాలకు సంబంధించిన జాతీయ వ్యవస్థలను తొత్తడం చేయడం.

5. మొత్తం మీద 1991 నుంచి చూసినట్లయితే యీ విధాన క్రమంలో సాపేక్షకంగా ద్రవ్యరూపంలో పెట్టుబడుల అదుపులేని రాకపోకలు కీలకమైన అంశంగా వున్నాయి. మొత్తంగా వ్యయం తగ్గింపు ద్వారానే ద్రవ్యలోటును తగ్గించటంపైనే దృష్టిని కేంద్రీకరించటమే యీ విధానంలో ప్రధానమైన అంశం. ఈ నిర్బంధ విధానానికి అర్థమేమంటే వ్యవసాయంపైనా, రైతులపైనా దాడులు చేయటం, వారికిస్తున్న మద్దతును కుదించటం.

## 2. *వ్యవసాయ రంగంలో వుత్పాదక శక్తులు*

6. వ్యవసాయ సంబంధాలను మరింతగా పరిశీలించటానికి ముందు, మనం సరళీకరణ అనంతర దశలో వుత్పాదక శక్తుల అభివృద్ధిలోని కొన్ని అంశాలను చూద్దాము.

7. ద్రవ్యోల్బణాన్ని పెంచే నయా వుదారవాద సంస్కరణలు ఉత్పాదక శక్తుల పురోగతిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. అయితే, యీ ప్రభావం పంటలకు, దశలకు, ప్రాంతాలకు సంబంధించి ఏకరూపంగా వుండదు. ఉత్పాదక శక్తుల వృద్ధిలో మందగమనం 1991–2004 మధ్య కాలంలోను, ప్రత్యేకించి 1997–2004 మధ్యనా మనకు స్పష్టంగా కన్పిస్తుంది. మద్దతు ధరలు, రుణ సౌకర్యం, పరిశోధనలు, సేవల విస్తరణ, వ్యవసాయ సంబంధిత మౌలిక సదుపాయాలలో (సేద్యపు నీటి సౌకర్యాలు, గిడ్డంగులు, ఎరువులు, విత్తనాల వుత్పత్తితో సహా) ప్రభుత్వ పెట్టుబడులలో తీవ్రమైన కోతవున్నది. ప్రపంచ వాణిజ్య సంస్థతో ఒప్పందం, విశ్వవ్యాప్తంగా ముడి వస్తువుల ధరల పతనం వంటివి కూడా తమ ప్రభావాన్ని చూపాయి. 2004–05 నుంచి 2008–09 మధ్య కాలంలో చూసినట్లయితే వుత్పాదక శక్తులు సాపేక్షకంగా పురోగమించటంతోపాటు, తదనంతర కాలంలో కొంతమేరకు బలపడటంతో 2004 తరువాత మనకొక విభిన్నమైన దృశ్యం కనపడుతుంది.

8. ప్రధానమైన పంటల్లో ఉత్పాదన. దిగుబడుల (నిర్దిష్ట పరిమాణంగల భూమికి) పెరుగుదలలోనూ, అదేవిధంగా యాంత్రీకరణ పెరుగుదలలోనూ యీ ధోరణులు ప్రతిబింబించాయి. ప్రధానమైన పంటలకు సంబంధించి ఉత్పాదన, దిగుబడుల పెరుగుదలను 1981–1991 మధ్యకాలానికీ, 1991–2010 మధ్య కాలానికి పోల్చి చూసినట్లయితే అధికంగానే కనపడుతుంది. అయితే ప్రత్తిపంట యిందుకు మినహాయింపు. 1994–5 నుంచి 2004–5 మధ్య నడిచిన దశాబ్ద కాలంలో వ్యవసాయ పంటల వార్షిక పెరుగుదల రేటు 0.6 శాతం వున్నది. కాగా, ఆహారేతర పంటల దిగుబడిలో 0.1 శాతం వున్నది. ఆహార పంటలలో వార్షిక పెరుగుదల 0.7 శాతం వున్నది. 1997–2004 మధ్య కాలంలో ప్రత్తి మినహా మిగిలిన ప్రధాన పంటలలో ఎరువులు తదితరాల వినియోగమూ, దిగుబడుల పెరుగుదల రేట్లు మందగించాయి (అయినప్పటికీ సానుకూలమైన ధోరణి). ఏదియేమైనప్పటికీ, వ్యవసాయంలో యాంత్రీకరణలో నికరమైన పెరుగుదల వున్నది. ప్రత్తి, తృణ ధాన్యాలు కాకుండా యితరమైనవి – అంటే, పప్పు ధాన్యాలు, నూనెగింజలు, వుద్యానవన వుత్పత్తులు– వృద్ధిని సాధించాయి. 2004–05 నుంచి 2011–12 మధ్య కాలంలో దిగుబడులలో పెరుగుదల వున్నది. మొత్తంమీద కలగలపు చిహ్నాలు కన్పించాయి. 2004 తరువాత చోటుచేసుకున్న పునరుద్ధరణకు అనేక అంశాలు తోడ్పడ్డాయి. వీటిల్లో మొదటిది, సేద్యపు సౌకర్యాలు, యితర వ్యవసాయ సంబంధిత మౌలిక

సదుపాయలలో ప్రభుత్వ పెట్టుబడుల పెరుగుదలకాగా, రెండవది, కనీసం కొన్ని పంటలకైనా మంచి మద్దతు ధరను కల్పించటం (కొంతమంది పేద, మధ్య తరగతి రైతులు పెట్టే పెట్టుబడులకు తగ్గట్లుగా లేనప్పటికీ), మూడవది యాంత్రీకరణకూ, రుణసౌకర్యానికి ఎక్కువ వీలు కల్పించటం, అయితే వీటివల్ల ప్రధానంగా భూస్వాములు, బడా పెట్టుబడిదారీ రైతులు, ధనిక రైతులతోపాటు, దేశ, విదేశీ కార్పొరేట్ పెట్టుబడులు లాభపడ్డాయి.

9. ఆ రకంగా వ్యవసాయంలో తిరిగి పుంజుకున్న పురోగతి అత్యంత అసమాన క్రమంతో కూడుకుని వున్నది. వ్యవసాయకులలో అత్యధిక భాగం, అంటే ప్రధానంగా పేద, మధ్య తరగతి రైతులు, గ్రామీణ శ్రామికులు పొందిన లాభం అతిస్వల్పం, నిజమైన అర్థంలో చూసినపుడు తరచుగా నష్టపోయారు. పైగా యిది ప్రభుత్వ మద్దతుపై ఆధారపడి వున్నది, కాని, యీ మద్దతు లభించడం కష్టం. 2009 నుంచి వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు క్షీణించిన కారణంగా కోలుకోవటం అన్నది అతిస్వల్పంగానే వున్నది. దీనితోపాటు 2011 నుంచి అమలు చేసిన పొదుపు చర్యలతో వుత్పాదక శక్తుల పురోగతి మందగించింది. దేశ, విదేశీ గుత్త పెట్టుబడి సంస్థలు బలపడ్డాయి.

10. ఉత్పాదక శక్తుల పెరుగుదలకు సంబంధించి పైన పేర్కొన్న మూడు అంశాలను యిక్కడ చెప్పుకోవలసి వుంది. మొదటిదేమంటే, నయా ఉదారవాద క్రమంలో ఉత్పాదక శక్తులు పడుతూ లేస్తూనైనా నిలబడవలసి వుంది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడులు ఉత్పాదక శక్తుల పురోగతిని అసాధ్యం (లేదా దాదాపుగా అసాధ్యం) చేస్తాయనుకోవడం సరికాదు. రెండవదేమంటే, నయా ఉదారవాదం కింద ఉత్పాదక శక్తుల అభివృద్ధి అత్యంత అసమాన స్వభావాన్ని, అలానే దుర్బలత్వాన్నీ కలిగి వుంటుందన్న విషయాన్ని మనం తప్పని సరిగా గుర్తించాలి.

11. మూడవదేమంటే, అత్యధికభాగం వ్యవసాయక, గ్రామీణ ప్రజానీకం కష్టాలు కొనసాగుతూనే వుంటాయి, పెద్దయెత్తున కొనసాగుతున్న రైతుల ఆత్మహత్యల్లో వీటిని మనం చూడవచ్చు, నయా ఉదారవాదం పెరుగుదల యొక్క అనివార్య ఫలితమిది. 1997 నుంచి 2012 వరకు నడచిన కాలంలో దాదాపు 2,75,000 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

### *3. అసమాన అభివృద్ధి-ప్రాంతీయ వైవిధ్యం*

12. గ్రామీణ భారతంలోని ఉత్పత్తి సంబంధాల విషయానికివస్తే వ్యవసాయ రంగంలోనూ, గ్రామీణ ప్రాంతాలలోని వ్యవసాయేతర ఆర్థిక వ్యవస్థలోనూ పెట్టుబడిదారీ సంబంధాల పరివ్యాప్తి ప్రధానమైన ధోరణిగా వున్నది. అదేసమయంలో వ్యవసాయ సంబంధాలు జాతీయ, ప్రాంతీయ, స్థానిక వైవిధ్యాలతో కూడుకుని వున్నాయి. అలానే, ఉత్పత్తి, మారకాలకు సంబంధించిన పెట్టుబడిదారీ సంబంధాల పెరుగుదలలో అత్యంత అసమాన సంబంధాలు నెలకొన్నాయి. వ్యవసాయంలోకి, గ్రామీణ సమాజంలోకి పెట్టుబడిదారీ విధానం అనేక విధాలుగా చొచ్చుకు వస్తుందనటానికి భారతదేశం సజీవ తార్కాణంగా నిలచి వున్నది.

13. 'వాస్తవాల నుండి నిజాలు' అన్న సూత్రం వ్యవసాయ రంగం గురించి మార్క్సిజం చేసే అధ్యయనానికి ప్రామాణికమైన గీటురాయిగా వుంటుంది. మొత్తంగా సమాజం కోసం ఆర్థిక ధోరణుల గురించి, వ్యవసాయ రంగంలో ధోరణుల గురించీ మనం అధ్యయనం చేసేటపుడు మన అవగాహన తప్పనిసరిగా స్థానిక పరిస్థితులపైనా, వ్యవసాయ రూపాలపైనా ఆధారపడి రూపుదిద్దుకోవాలి. స్థానిక పరిస్థితుల గురించి యీ రకమైన సూక్ష్మగ్రాహత్వం --కృషి విజ్ఞానశాస్త్రం, పర్యావరణ పరిస్థితులకు, సేద్యపు విధానాలు, స్థానిక సంబంధాలకు, భూమి కౌల చరిత్రకు, వైయక్తిక క్షేత్రాల గురించిన లెనిన్ చెప్పిన స్థాయి, నమూనా - కొన్ని ప్రాంతాలలో పెట్టుబడిదారీ వ్యవస్థ మిగిలిన ప్రాంతాల కంటే బలంగా ఉండడం వలన ఉత్పత్తిశక్తులలోని అభివృద్ధిలో తేడాలు వలన మాత్రమే వ్యవసాయ సంబంధాలలో వ్యత్యాసాలేర్పడవు; వ్యవసాయ సంబంధాల గురించి మన అవగాహనకు రూపాన్నిస్తుంది. వ్యవసాయ సంబంధాలలోని వ్యత్యాసాలు కేవలం కొన్ని ప్రాంతాలను ఎక్కువగానో, తక్కువగానో యితరమైన వాటికన్నా 'పెట్టుబడి' దారీ వ్యవస్థ వైపుకు నడిపించే వుత్పాదక శక్తుల అభివృద్ధిలోని వ్యత్యాసాలు మాత్రమేకాదు; "పెట్టుబడిదారీ పరిణామ క్రమంలో లెక్కలేనన్ని రకాల కలయికలకు అవకాశాలున్నాయి. లెనిన్ చెప్పినట్లుగా వ్యవసాయంలో పెట్టుబడిదారీ అభివృద్ధిలోని కీలకాంశం, "అనంతమైన భిన్నత్వంతో కూడిన సంయోజనల యొక్క ఏదోఒక తరహా పెట్టుబడి పరిణామం సాధ్యం". ఈ సూత్రీకరణ ప్రాచీన రష్యా (లేదా ప్రాచీన చైనా) విషయంలో వాస్తవమయ్యేటట్లయితే

వెనుకబడిన భావజాలంతో నడిచే భౌతిక శక్తులున్న భారతదేశ విషయంలో కూడా యిది నిజమే అవుతుంది. ప్రాదేశిక వైవిధ్యం నుంచి తలయెత్తే 'ప్రత్యేక, సంక్లిష్ట సమస్యలకు' ఒకస్థాయి చేరుతుంది.

### *4. గ్రామీణ ప్రాంతాలలో వర్గాలు, వర్గ వ్యత్యాసాలు*

### *ప్రవేశిక*

14. వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ అభివృద్ధి ప్రాతిపదికపై తలయెత్తే వర్గాల స్వభావాన్ని గుర్తించటమే వ్యవసాయ సమస్యకు యిచ్చే మార్క్సిస్టు నిర్వచనానికి కీలకంగా వుంటుంది. దీనికి సంబంధించి మన కర్తవ్యం రెండు విధాలుగా వుంటుంది. ఒకవైపున గ్రామసీమల్లో వర్గాలను గుర్తించేటందుకుగాను నిర్దిష్టమైన సాధారణ సైద్ధాంతిక వర్గీకరణలను, గీటురాళ్ళను నెలకొల్పడం; మరోవైపున, వర్గాలను యథాతథంగా గుర్తించటం, అంటే, వేర్వేరు ప్రాంతాలలోనూ స్థలాల్లోనూ నెలకొనివున్న నిర్దిష్ట వ్యవసాయ–ఆర్థిక, సామాజిక పరిస్థితులలో గుర్తించటం.

15. గ్రామీణ ప్రాంతాలలో వర్గాలను వేరుచేసి చూడటానికి సంప్రదాయకంగా వినియోగించే మూడు విధాలైన గీటురాళ్ళు ఏవంటే: ఉత్పత్తి సాధనాలపై (ప్రత్యేకించి భూమిమాత్రమే కాదు) యాజమాన్యత, అదుపును కలిగివుండే కుటుంబాలు; కుటుంబశ్రమ, కూలిశ్రమ యొక్క (ప్రత్యేకించి వ్యవసాయంలో ఉత్పత్తిక్రమం గురించి మాత్రమేకాదు) విభిన్న రూపాలు; ఇది ఒక పని సంవత్సరకాలంలో ఒక కుటుంబం చేయగల అదనపు వుత్పత్తి. ఈ అంశాలన్నీ కాలక్రమంలో స్థల, కాలాల్లో జరిగిన మార్పులతో పాటు మారి గ్రామాల్లోనూ, వెలుపలా వున్న పరిస్థితులను ప్రభావితం చేశాయి.

#### *భూస్వాములు, బడా ధనిక రైతులు*

#### *సామాజిక–ఆర్థిక లక్షణాలు*

16. గ్రామాలలో పాలక వర్గాల యొక్కా, రాజ్యం యొక్కా వర్గాధికారానికి యీ వర్గమే ప్రధానాధారంగా వున్నది.

17. భారతదేశంలోని అత్యధిక గ్రామాల్లో భూస్వామ్య కుటుంబాలే – ప్రస్తుతం దాదాపుగా పెట్టుబడిదారీ భూస్వాములు– అధిక భూమిని, అదికూడా సారవంతమైన భూమిని కలిగివున్నాయి. ఈ కుటుంబాలకు చెందిన వారెవరూ ప్రధానమైన సేద్యపు కార్యకలాపాలలో పాల్గొనరు. వారి భూమిని నిర్దిష్టమైన కౌలుకు లేదా పాలుకు కౌలుదారులే సాగుచేస్తారు, లేదా కూలీలచేత

సాగుచేయిస్తారు. సర్వసాధారణంగా భూస్వామ్య కుటుంబాలే గ్రామాల్లో భూకేంద్రీకరణ వ్యవస్థలో గతం నుండి ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.

18. గ్రామీణ భారతంలో సరికొత్తగా, రెండో పాలకవర్గ భాగస్వామి చేరింది. రెండవదీ, సరికొత్తదీయైన పాలకవర్గ భాగస్వామి వున్నది. బడా పెట్టుబడిదారీ రైతులు కూడా భూమిపై జరిగే ప్రధానమైన సేద్యపు కార్యకలాపాలలో పాల్గొనరు. వీరికీ, భూస్వాములకూ మధ్య ప్రధానమైన వ్యత్యాసం ఏమిటంటే వీరు సంప్రదాయక భూస్వామ్య వర్గానికి చెందరు. వీరిలో కొందరు ధనిక రైతుల నుండి, లేదా, యీనాడుగానీ, గత తరాల్లోగానీ ప్రధానమైన సేద్యపు కార్యకలాపాలలో పాల్గొనే సంప్రదాయం కలిగిన మధ్య తరగతి రైతు కుటుంబాల నుంచి వచ్చిన వారున్నారు. స్వాతంత్ర్యానంతరం వునికిలోకి వచ్చిన వ్యవసాయ, గ్రామీణ విధానాలతో యీ తరహా కుటుంబాలు లబ్ధిపొందాయి. వ్యవసాయం ద్వారా లేదా యితర కార్యకలాపాల ద్వారా (వడ్డీ వ్యాపారం, వేతన వుద్యోగం, వ్యాపార, వాణిజ్యాలు) సంపాదించుకున్న అదనపు ఆదాయాన్ని భూమిపై పెట్టుబడిగా పెట్టారు. వ్యవసాయమే వారి ప్రధాన కార్యకలాపంగా మారింది, అలానే వారి ఆర్థిక శక్తికి ప్రాతిపదికగా మారింది. ఆ విధంగా, భూస్వామ్య వర్గానికి వారసత్వంగా సక్రమించిన భూమి, హోదా పునాదికాగా, పెట్టుబడిదారీ రైతు వర్గానికి ప్రత్యేకించి హరిత విప్లవం తరువాత ఉత్పాదక శక్తుల అభివృద్ధీ, పెట్టుబడి సంచయనం పునాదిగా మారాయి.

19. మొత్తంమీద యీ తరహా పెట్టుబడిదారీ రైతులు 'మధ్యతరగతి' లేదా 'వ్యవసాయ' కులాలకు (లేదా సంప్రదాయక పెత్తందారీ కులాలకు) చెందుతారు. అయితే ఆచారంగా వస్తున్న నిచ్చెనమెట్ల సమాజంలో వీరి స్థాయి సంప్రదాయక పెత్తందారీ, లేదా, ఆచారబద్ధంగా వస్తున్న 'ఉన్నత' కులాలకు సమానం కాకపోవచ్చు. కాగా, బడా పెట్టుబడిదారీ రైతులు సామాజిక, రాజకీయ రంగాల్లో ఆధిపత్య స్థానంలో పాతుకుపోయి వున్నారు.

20. పెద్ద భూస్వాములనే మేము 'బడా పెట్టుబడిదారీ రైతులు' అని వర్గీకరిస్తున్నాము. వీరి స్వాధీనంలోని భూఖండాలు కూడా భూస్వాములకున్నట్లుగానే వుంటాయి. అలానే వారి ఆదాయాలు, ఉత్పత్తి సాధనాలు, తదితర ఆస్తులపై యాజమాన్యం కూడా వుంటుంది. ఈ తరగతి భూస్వాములతో కలసిపోయే క్రమంలో (లేదా నిజానికి కలసినపుడు) వారితో

కలసి గ్రామసీమల్లో ప్రధానమైన దోపిడీ వర్గంగా వుంటుంది.

అయినప్పటికీ అదనపు విలువను హస్తగతం చేసుకోవటంలోనూ, సంచయనం చేయటంలోనూ భూస్వాములకూ వీరికీ మధ్య వ్యత్యాసం వుంటుంది. వీరి చారిత్రక పరిణామం కూడా వేరుగా వున్నది. కాగా ప్రస్తుతం గ్రామీణ ప్రాంతంలో రాజ్యవ్యవస్థకు వీరు మూలస్తంభంగా వున్నారు.

21. భూస్వాముల, బడా పెట్టుబడిదారీ రైతుల అధికారానికి భూమిపై యాజమాన్యమే పునాది లేదా ప్రాతిపదికగా వున్నప్పటికీ, వారి అధీనంలో వున్నది కేవలం భూమిమాత్రమే కాదు, అలానే వారి సంపదకూ అది మాత్రమే ప్రధాన వనరు కాదు. పలువురు భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులు లాభకరమైన పలు కార్యకలాపాలను చేపడుతున్నారు. ఇందుకు వుదాహరణగా వడ్డీ వ్యాపారం, ధాన్యపు మిల్లులు, పాల కేంద్రాలు, ఆహార ధాన్యాల వ్యాపారం, తోటలు-అడవుల పెంపకం, వస్తుతయారీ, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం, సినిమా థియేటర్లు, పెట్రోలు బంక్‌లు, వసతి గృహాలు, రవాణా, వ్యవసాయ యంత్రాల అమ్మకం, అద్దెకు యివ్వటం, లాభకరమైన విద్యాసంస్థలు (యీ తరగతి ఆదాయానికీ, సామాజిక పెత్తనానికీ విద్యాసంస్థలు బాగా వుపయోగపడుతున్నాయి) తదితరమైన వాటిని చెప్పవచ్చు. ఈ తరహా కుటుంబాలు పాలనా వ్యవస్థలోకి (పంచాయతీ రాజ్ సంస్థలు, శాసనసభలు, ఉన్నతాధికార, పోలీసు, న్యాయ యంత్రాంగంలోకి) ప్రవేశించాలని కోరుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోనూ, బస్తీలలోనూ రాజకీయాధికారాన్ని కలిగివుండటం యీ తరగతి లక్షణం. పాలక వర్గాల రాజకీయ పార్టీలకు గ్రామాల్లో యీ తరగతే ప్రధాన కారకంగా వున్నది.

22. ఈ వర్గం గ్రామాలలో అనేక విధాలుగా ప్రత్యక్ష దోపిడీ చేస్తుంటుంది. వేతనాలు, కౌళ్ళు, వడ్డీలు, ధాన్యం నిల్వలు, వ్యాపారం వంటి కార్యకలాపాలను వీరు చేపడుతుంటారు. భూమిపై యాజమాన్యంతో పాటుగా గ్రామస్థాయిలో పాలక వ్యవస్థ యంత్రాంగంపై పట్టుకలిగి వుంటారు. రుణాలు, ఉన్నత విద్య, సంఘటిత రంగంలో ఉద్యోగాలు వంటి వాటిలో వీరిదే పైచేయిగా వుంటుంది. గ్రామాలలో పేదలకు వుద్దేశించిన వాటితోసహా ప్రభుత్వ పథకాలన్నిటిపైనా వీరి పెత్తనం వుంటుంది. తరచుగా వీటిని తమకోసం వుపయోగించుకుంటారు.

23. భూస్వాములు, బడా పెట్టుబడిదారీ రైతులు కేవలం ఆర్థికపరమైన ఆధిపత్యాన్ని కలిగి వుండటమేకాక, గ్రామాలలో సంప్రదాయక, ఆధునిక సామాజిక,

రాజకీయ స్థానాలను కూడా కైవసం చేసుకుంటారు. 'భూస్వామ్యవాదం కేవలం ఆర్థిక తరహాయైనదేకాక, సామాజిక, రాజకీయ తరహాకు చెందినదని', ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ చెప్పిన మాటలను గుర్తుచేసుకోవాలి.

24. గ్రామీణ భారతంలో భూమిపైనా యితర వ్యవసాయ సంబంధమైన ఆస్తులపైనా, వ్యవసాయ–వ్యవసాయేతర రాబడులపైనా, ఆదాయాలపైనా కేంద్రీకరణ పెరుగుతున్నట్లు క్షేత్ర అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. వివిధ గ్రామాల్లో వ్యవసాయ అధ్యయనాల సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం (ఆరు రాష్ట్రాల్లో, అంటే, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర సర్వే వివరాలను యిక్కడ క్రోడీకరించటం జరుగుతుంది) జరిపిన సర్వే వివరాల ప్రకారం గ్రామంలోని మొత్తం ఆస్తులలో ఎగువన వున్న 5 శాతం కుటుంబాల వాటా 40 నుంచి 60 శాతం వుండగా, దిగువన వున్న 50 కుటుంబాల వాటా 1 నుంచి 15 శాతం వరకు వున్నది. నేషనల్ శాంపుల్ సర్వే (ఎన్ఎస్ఎస్) సేకరించిన వివరాల ప్రకారం భూమి పంపిణీలో విపరీతమైన అసమానతలు వున్నట్లు అర్థమవుతున్నది. అంతేకాక 1960–61మధ్య, అలానే యిటీవలి వివరాల ప్రకారం యీ అసమానతలు మరింత పెరుగుతున్నాయని తెలుస్తున్నది. ఆరు రాష్ట్రాలలోని 13 గ్రామాలలో వివరాలు సేకరించగా, అందులోని 9 గ్రామాల్లో మొత్తం గ్రామ కుటుంబాల్లోని 5 శాతం స్వాధీనంలో 40 నుంచి 54 శాతం వుండగా, దిగువన వున్న 50 శాతం కుటుంబాల చేతిలో 0 నుంచి 6 శాతం వరకు భూమి వున్నది. మిగిలిన నాలుగు గ్రామాల్లో 20 నుంచి 35 శాతం భూమి 5 శాతం కుటుంబాల చేతుల్లో వుండగా, 50 శాతం కుటుంబాల చేతుల్లో 10 నుంచి 18 శాతం భూమి వున్నది.

25. 1970ల నుంచి వ్యవసాయ భూముల ధరలు అనేక రెట్లు పెరిగాయి. దీనితోపాటే, ధనిక రైతుల నికర ఆదాయాలు కూడా పెరిగాయి.

26. భారతదేశపు గ్రామాలలో భూస్వాములు, బడా పెట్టుబడిదారీ రైతులు అత్యధికమూ, అత్యుత్తమూ అయిన భూమిని సొంతంగా కలిగి వుండటమేకాక, ఉత్పత్తిస్థాయినీ, వైయక్తిక బడా భూఖండాల విస్తీర్ణాన్నీ పెంచివేశారు. బడా భూస్వాములు వందల వేల ఎకరాల భూములను కలిగి వుండటం గతకాలపు చారిత్రక దృశ్యం. దేశంలోని వివిధ ప్రాంతాలలో భూయాజమాన్యం విషయంలో తేడాపాడాలు వుండవచ్చు. బడా పెట్టుబడిదారీ రైతులు, భూస్వాములు

ప్రధానమైన దోపిడీ వర్గంగా వున్నప్పటికీ గమనించవలసిన విషయం ఏమంటే, ప్రతి ఒక్క గ్రామంలోనూ యీ వర్గం యొక్క ప్రత్యక్ష ప్రాతినిథ్యం వుండక పోవచ్చు.

27. భూస్వామ్య, బడా పెట్టుబడిదారీ రైతువర్గం యొక్క ఆర్థిక, రాజకీయ, సామాజిక ఆధిపత్యం గురించి ఎలాంటి సందేహమూ వుండనవసరం లేదు. ఇదే సమయంలో పెట్టుబడిదారీ విధానం పురోగమిస్తూ, సంపన్నులకు (మరో కొసన పేదలకు) సరికొత్త ఆదాయ మార్గాలు ఏర్పడటంతో ఆర్థిక శక్తిలో భూమి అంతకంతకు ప్రాధాన్యతను కోల్పోయింది. ఇలాంటి పరిస్థితిలో రైతులను, కాయకష్టం చేసే శ్రామికులను భూస్వామ్య వర్గం పలురకాలుగా సాగించిన ఒకప్పటి అణచివేత, వారిపై అన్నివిధాలుగా సాగించిన పెత్తనమూ బలహీనపడింది. అదేవిధంగా గ్రామాలలో భూస్వాములపైనా, బడా పెట్టుబడిదారీ రైతులపైనా రోజువారీగా సాగుదారులు, శ్రామికులు ఆధారపడటం తగ్గింది.

28. సాగుదారులపైనా, శ్రామికులపైనా భూస్వాములు, బడా పెట్టుబడిదారీ రైతులు సాగించే ప్రత్యక్ష, గ్రామస్థాయి ఆర్థిక, సామాజిక–రాజకీయ దోపిడీలో ప్రాంతీయ తారతమ్యాలు అపారంగా వున్నాయి. ప్రతిచోటా పల్లె ప్రజలు గ్రామంలోని సంపన్నులపై వేర్వేరు విధాలుగా ఆధారపడి వున్నారు. దోపిడీదారునికీ, దోపిడీకి గురయ్యే వానికీ మధ్య పలురకాలైన సంబంధాలు కొనసాగుతున్నాయి. ఏదియెలా వున్నప్పటికీ, గ్రామస్థాయిలో దోపిడీ, అణచివేతా రకరకాలుగా వున్నది. పెద్దగా బయటకు కనిపించదు. ఉదాహరణకు, బీహార్‌లో భూమిహార్–భూస్వామ్య వర్గాల ఆధిపత్యం వున్న మాండ్యా లేదా కోల్హాపూర్, లేదా, విదర్భ ప్రాంతం, ముఖ్యంగా శ్రీగంగాసాగర్ జిల్లాలో యీ పరిస్థితి కనిపిస్తుంది.

29. భూస్వామ్య వర్గాన్ని కూలదోయాలన్నదే రైతు, గ్రామీణ శ్రామిక వుద్యమాల ఉమ్మడి వ్యూహాత్మక డిమాండుగా వున్నది. ప్రజలను భూస్వామ్య వర్గం చేసే ప్రత్యక్ష దోపిడీ, అణచివేత అనేక రూపాలలో సాగుతున్నది. కనుకనే, నిర్దిష్టమైన స్థానిక పరిస్థితులను గమనంలోకి తీసుకున్న తరువాతనే భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా మన ప్రజా సంఘాలు తమ డిమాండ్లనూ, వుద్యమాలను రూపొందించుకోవాలి. ప్రత్యేకించి భూమి పునఃపంపిణీకి సంబంధించిన డిమాండ్లను యిలా తయారుచేసుకోవాలి. నిర్దిష్ట ప్రాంతాలలో భూమిని

స్వాధీనం చేసుకోవటం గురించి కూడా ఆలోచించాలి.

30. గ్రామాలలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ విస్తృతమైన ఆర్థిక కార్యకలాపాలపైనా, వ్యవస్థలపైనా అదుపు కారణంగా భూస్వామ్య, బడా పెట్టుబడిదారీ రైతుల పెత్తనమూ, ఆధిపత్యమూ పుట్టుకు వచ్చినందున (కేవలం గ్రామాన్ని పునాదిగా చేసుకున్న దోపిడీపైన మాత్రమే కాదు) ఒక్క భూమి విషయంగా మాత్రమే వీరిపై వుద్యమించలేము. భూస్వాములను వారి భూముల నుండి తొలగించటం కోసం రైతులను, వ్యవసాయ శ్రామికులను సంఘటితపరచడంలో వున్న యిబ్బందులేమిటో కిసాన్, వ్యవసాయ శ్రామిక వుద్యమాలలో పాల్గొనే కార్యకర్తలకు చక్కగా తెలుసు. భూసమస్య యొక్క ప్రాధాన్యాన్నీ, సమగ్ర భూసంస్కరణల యొక్క అవసరాన్నీ మనం గుర్తిస్తూనే అదే సమయంలో సీలింగ్ పరిమితి దాటిన భూములను గుర్తించి వాటిని పునః పంపిణీ చేయాలని డిమాండు చేస్తున్నాము, నిజానికి రకరకాల కారణాలరీత్యా యీనాడు అనేక ప్రాంతాలలో యీ డిమాండు వాస్తవరూపం దాల్చలేదు.

31. ఈ విషయాన్ని పునరుద్ఘాటించినట్లయితే, గ్రామీణ జనాభాలో 5 శాతంగా వున్న భూస్వాముల, బడా పెట్టుబడిదారీ రైతుల అధికారాన్ని భగ్నం చేయకుండా ప్రజల అభివృద్ధికి అవసరమైన ప్రాథమిక కర్తవ్యాలను పూర్తి చేయలేము, అలానే, వర్గ, కుల, స్త్రీ పురుష భేదాలతోపాటు యితర రూపాలలో కొనసాగుతున్న సామాజిక అణచివేతనూ, సామాజిక–ఆర్థిక వెనుకబాటుతనాన్నీ తొలగించలేము. ఇదే సమయంలో ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి, అదేమంటే, ప్రతి గ్రామంలోనూ (లేదా పలు గ్రామాల్లో) ఎగువున వున్న 5 శాతం భూస్వాముల భూమిని యిప్పటికిప్పుడే గుంజకునేలా ప్రోత్సహించడం కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే, యీ తరహా వర్గ శత్రువుతో ఎలా పోరాడాలన్న విషయమై తాజాగా ఆలోచించాల్సి వుంది.

### *కాయకష్టం చేసే శ్రామికులు, సామాజిక–ఆర్థిక లక్షణాలు*

32. మరోవైపున వ్యవసాయ ఉత్పత్తి క్రమంలో పాల్గొనే శ్రమజీవులున్నారు. ఇతరుల భూముల్లో కూలికి పని చేయడం ద్వారా వీరు ఆదాయాన్ని పొందుతారు.

33. గ్రామీణ శ్రామికులు పల్లెటూళ్ళలో వ్యవసాయ, వ్యవసాయేతర కార్యకలాపాల్లో పాల్గొంటారు. మగవాళ్ళు పొలాల్లోనూ, రహదారుల పనుల్లోనూ పనిచేస్తుంటారు. ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ, వ్యవసాయేతర పనుల కోసం వలస పోతుంటారు. స్త్రీల విషయానికి వస్తే ఉపాధి కోసం చేసే పనులు పరిమితంగానే

వుంటాయి. వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలలో పురుషులకున్నన్ని పనులు వీరికి వుండవు. సాధారణంగా వ్యవసాయేతర పనుల్లో స్త్రీలు ఇటుక రాయి తయారు చేయడంలోనూ, నిర్మాణ రంగంలోనూ పాల్గొంటారు. ఇవి ప్రత్యేకించి స్త్రీలపని కానప్పటికీ పనుల కోసం వలస వెళ్ళినపుడు పురుషులతో పాటు స్త్రీలు కూడా పాల్గొంటారు.

34. గ్రామీణ భారతంలో వ్యవసాయ కార్మికులను వ్యవసాయేతర కార్మికుల నుంచి వేరు చేయటం యింకెంతో కాలం సాధ్యం కాదు. ప్రస్తుతం వీరిని గతంలోవలె వ్యవసాయ లేదా వ్యవసాయేతర కార్మికులనికాక 'గ్రామీణ సమాజంలోని చిల్లరమల్లర శ్రామికులని పిలుస్తున్నారు.'

35. మొత్తంమీద కాయకష్టం చేసేవారు అనేక రకాలైన పనులు చేస్తున్నారు. ఇందుకుగాను వీటికి సంబంధించిన నైపుణ్యం కావాల్సి వుంటుంది. ఎక్కువ భాగం శ్రామికులు రోజువారీ కూలికి పనిచేస్తుంటారు. వార్షిక వేతనంపై పనిచేసే వారుకూడా కొందరున్నారు. ఇలాంటివారు నెలసరి వేతనంపై వ్యవసాయ, వ్యవసాయేతర పనులతోపాటు ఇంటి పనులు కూడా చేస్తుంటారు (సాధారణంగా ఏడాదికింతని మాట్లాడుకుంటారు).

36. శారీరక శ్రమచేసే వారు యితర ఆదాయ మార్గాలను కూడా కలిగి వున్నారు. ఉదాహరణకు పశువుల పెంపకం, చిల్లర వ్యాపారం, ఇంటిపని, ప్రైవేటు రంగంలో కొద్దిపాటి కూలికి పనులు చేయటం వంటివాటిని చెప్పవచ్చు.

37. చారిత్రక కారణాలరీత్యా పలు ప్రాంతాలలో నివసిస్తున్న దళిత కుటుంబాలలో అత్యధికం, లేదా, అతిపెద్ద భాగం, అదేవిధంగా, యితర ప్రాంతాలకు చెందిన అణగారిన కులాలకు చెందిన కుటుంబీకులు కాయకష్టం చేసే శ్రామికుల వర్గానికి చెందుతారు. గ్రామీణ వృత్తుల్లో శారీరక శ్రమ అనేది చివరాఖరున వున్నందున గ్రామీణ సమాజంలో కాయకష్టం చేసేవారిలో మిశ్రమ కులాలకు చెందినవారు వుంటారు.

38. ఈనాడు కాయకష్టం చేసే అనేకులు భూమిలేనివారే. అటు భూయాజమాన్యం నుంచి చారిత్రక వెలి, యిటు ఆధునిక వ్యత్యాసాలు యిందుకు కారణం. శారీరక శ్రమచేసే వారు కూడా సొంతదారులుగానో లేదా కౌలుదారులుగానో చిన్నచిన్న కమతాలను, తోటలను సాగుచేస్తే చేయవచ్చు. కాగా యీ తరహా వ్యవసాయ కార్మికులకూ, రైతుల్లోని పేదలకు మధ్య విభజన రేఖగీయటం తరచుగా కష్టమవుతుంది. సిరి వంటి శ్రామికులు కూడా వున్నారు.

ఉదాహరణకు హర్యానా లేదా రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లాలో యిలాంటి వారున్నారు. వీరు పాలుదారులుగానూ, దీర్ఘకాల శ్రామికులుగానూ వుంటారు. భూమిలేని కాయకష్టం చేసే శ్రామికులు రకరకాలుగా వుంటారు. మొత్తంమీద చూసినట్లయితే జనాభా సాంద్రత తక్కువగా వున్న మెట్టప్రాంతాలలోకన్నా జనాభా సాంద్రత ఎక్కువగావున్న అత్యధికంగా సాగువున్న ప్రాంతాలలో భూమిలేని శ్రామికులు అధికంగా వున్నారు (ఆసక్తికరమైన విషయమేమంటే యీ సాధారణ నియమానికి కొన్ని మినహాయింపులు వుండటం).

*గ్రామీణ ఉపాధి*

39. శ్రామిక కుటుంబాల ఆదాయాలు వారి పనిదినాల సంఖ్యపైనా, వారికి లభించే కూలిపైనా ఆధారపడి వుంటాయి. వ్యవసాయ కార్మికుల జీవితాలను మనం పరిశీలించినట్లయితే వారి ఉపాధి చాలా తక్కువని తెలుస్తుంది. గ్రామీణ ప్రాంతాలలోని పనిదినాలను అధికారిక సమాచారం చాలా ఎక్కువగా అంచనా వేసింది. కనుక గ్రామాలవారీగా తీసిన సర్వేలపై మనం ఆధారపడవలసి వుంటుంది. వ్యవసాయ అధ్యయనాల సంస్థ యిటీవల జరిపిన సర్వే ప్రకారం వ్యవసాయ రంగంలో గ్రామీణ శ్రామికుల వార్షిక పనిదినాల సగటు సంఖ్య మూడుమాసాలకు మించివుండటం లేదని అర్థమవుతున్నది. మగవాళ్ళతో పోల్చుకుంటే ఆడవాళ్ళ పనిదినాలు మరింత తక్కువగా వుంటున్నాయి. వీరి పనిదినాలు సగటున ఏడాదికి 70 రోజులకన్నా ఎక్కువగా వుండటం లేదు. అయితే, దేశం మొత్తంమీద చూసినపుడు యీ సంఖ్యలు వేర్వేరుగా వుంటున్నాయి. నాలుగు రాష్ట్రాల్లోని (ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర) 9 గ్రామాల్లో సర్వే చేయగా ఒక్కొక్క వ్యవసాయ కార్మికుడు వ్యవసాయ, వ్యవసాయేతర పనిదినాల సంఖ్య రేవసిలో (సికార్ జిల్లా, రాజస్థాన్) 105 రోజులుగానూ, మహత్వార్‌లో (బిజనోర్ జిల్లా, ఉత్తరప్రదేశ్) 185రోజులు, అనంతవరంలో (గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్) మగవారికి 65 రోజులు, నిమిషర్‌గావ్‌లో (కొల్హాపూర్ జిల్లా, మహారాష్ట్ర) స్త్రీలకు 120 రోజులుగానూ వున్నాయి.

40. గ్రామీణ భారతంలో ప్రభుత్వం యొక్క నిర్ణయాత్మక జోక్యంలేని తరుణంలో సరిపడినన్ని పనిదినాలను కల్పించటంలో మార్కెట్ శక్తులు విఫలమవుతున్నాయి. ఒకవేళ ప్రభుత్వ జోక్యం వున్నప్పటికీ అది నామమాత్రంగానే వుంటున్నది.

41. వ్యవసాయ రంగంలో సాగుపద్ధతుల్లో వచ్చిన అనేక మార్పుల కారణంగా శ్రామికులకు డిమాండు తగ్గుతున్నది. అత్యధిక భాగం ఆహార పంటల సాగులో యంత్రాల ప్రవేశంతో పురుష కార్మికులకు పనితగ్గిపోయింది. కలుపు మందుల వాడకం కారణంగా స్త్రీ కార్మికులకు కూడా పనులు తగ్గాయి.

42. వ్యవసాయ రంగంలో సాగునీటివంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ పెట్టుబడులు ఏమాత్రం చాలక పోవటంతో సేద్యంలో ఉపాధి అవకాశాల పెరుగుదల వుండటం లేదు. సాగునీటి సౌకర్యాలు వున్నట్లయితే బహుళ పంటలు పండించటానికి అవకాశాలు వుంటాయి, తత్కారణంగా పనిదినాలు పెరుగుతాయి. ఉపరితల సాగునీటి సౌకర్యాలలోనూ, భూగర్భ జలవనరుల సౌకర్యాలకు పెట్టుబడులు చాలినంత లేనట్లయితే ఉపాధి అవకాశాలు పూర్తిగా పతనం కానప్పటికీ స్తంభించి పోతాయి.

43. గ్రామీణ భారత వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలను పెంచాలంటే వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడులను గణనీయంగా పెంచాలి.

44. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయేతర రంగాలలో ఉపాధి అవకాశాలు చాలినంతగా లేవు. యీ పనుల్లో వైవిధ్యం కూడా తక్కువే. కొద్దిపాటిగా వున్న అవకాశాలు కూడా ఆడవాళ్ళకన్నా మగవాళ్ళకే ఎక్కువగా వుంటాయి.

45. గ్రామప్రాంతాల్లో ఉపాధి పెరుగుదల మందంగా వున్నందున వ్యవసాయ కార్మిక కుటుంబాలు, ప్రత్యేకించి దళితులకు, ఆదివాసీలకు చెందిన కుటుంబాలు వున్నత స్థితికి చేరే అవకాశాలు అత్యంత తక్కువగా వున్నాయి. గ్రామాల నుంచి సమీప పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయంటే అందుకు ప్రధాన కారణం గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలలో ఉపాధి అవకాశాలు చాలినంతగా లేకపోవటమే.

46. రైతులు కార్మికులుగా మారటం, కాయకష్టం చేసే శ్రామికులలో ఉపాధి సంక్షోభం వంటివి గ్రామీణ భారతంలో మహిళా కార్మికులపై ప్రభావాన్ని చూపుతున్నది.

47. స్త్రీ, పురుషుల మధ్య ప్రస్తుతం వున్న శ్రమవిభజన కారణంగా స్త్రీలకు అందుబాటులో వున్న పనికి తీవ్రమైన పరిమితులు ఏర్పడ్డాయి. పురుషులకు అందుబాటులో వున్న పనికి యిది కొద్దిగా మాత్రమే విభిన్నమైనది. మొత్తంమీద చూసినట్లయితే స్త్రీల పనిదినాలు తగ్గుతున్నాయి. మగవాళ్ళకు లభిస్తున్న పనిదినాలకన్న వీరి పనిదినాలు చాలా తక్కువగా వున్నాయి. గ్రామీణ

ఉపాధిలో తగ్గుదల, సాపేక్షకంగా చూసినట్లయితే ఎక్కువ భాగం పంటలలో (ప్రత్తివంటివి మినహాయింపు) ఆడవాళ్ళకు డిమాండు తగ్గటంతో మగవాళ్ళపైకన్నా ఆడవాళ్ళపై ఎక్కువ ప్రభావం పడింది. వ్యవసాయేతర రంగంలో కూడా మగవాళ్ళకన్నా స్త్రీలకే ఎక్కువగా అవకాశాలు తగ్గిపోయాయి.

48. గ్రామీణ జీవితంలోని యితర అంశాలవలెనే వ్యవసాయ–ఆర్థిక, వ్యవసాయ–పర్యావరణ ప్రాంతాలలో సైతం మహిళల ఉపాధి రకరకాలుగా వున్నది.

49. కొన్ని ప్రాంతాలలో పురుషులకు వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి లభిస్తున్నది. వలసలతో కూడుకున్న పనులు కూడా వీటిలో వున్నాయి. దీనివల్ల మహిళలకు (పిల్లలు) రైతు క్షేత్రాలలో కుటుంబం మొత్తం వెట్టిచాకిరి చేయవలసి వస్తుంది, అలానే గ్రామీణ ప్రాంతాలలో కూలిపని చేయవలసి వస్తున్నది (ఇందుకు వుదాహరణలు యిటీవలి గ్రామ అధ్యయనం సందర్భంగా బీహార్‌లోని పశ్చిమ చంపారన్ జిల్లా, రాజస్థాన్‌లోని సికార్ జిల్లాలో లభించాయి). ఇటువంటిచోట్ల స్త్రీల శ్రమ పలురూపాలు దాలుస్తున్నది. శ్రమజీవుల్లో ఆడవాళ్ళు అధికంగా వుంటున్నారు. వీరిలో కూడా కాయకష్టం చేసే స్త్రీలే ఎక్కువగా వుంటున్నారు. యాంత్రీకరణ పెరిగిన కొన్ని ప్రాంతాలలో కాంట్రాక్టు పనులు ఎక్కువయ్యాయి. ఇలాంటి వాటిల్లో యింతకుముందు ఆడవాళ్ళు ఎక్కువగా వున్నప్పటికీ ప్రస్తుతం మగవాళ్ళు ఎక్కువగా వుంటున్నారు.

50. గ్రామసీమల్లోని ఉపాధి స్థితిగతుల గురించి ప్రధానమైన, స్వయంసిద్ధ విధాన నిర్ధారణ పుట్టుకు వచ్చింది. అది సాపేక్షకంగా చూస్తే వ్యవసాయపరంగా అభివృద్ధి చెందిన గ్రామమైనప్పటికీ, లేదా, కరువు పరిస్థితి వున్నదైనప్పటికీ, ఒక ఏడాదిలో శ్రమజీవి యొక్క దీర్ఘకాలిక ఉపాధిరహిత కాలాన్ని పూడ్చాలంటే ప్రభుత్వ సహాయంతో వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలలో పనిదినాలను కల్పించాల్సి వుంటుంది.

51. గ్రామప్రాంతాల్లో ప్రభుత్వ ఉపాధి కల్పనా పథకాలు అమలులో వున్నప్పటికీ గ్రామసీమల్లోని ఉపాధి సంక్షోభాన్ని తొలగించటానికి యివి తగినట్లుగా లేవు. మనం యీ పేరాలోనూ తదుపరి వచ్చేదానిలోనూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని ప్రధానాంశాలను చూద్దాము. మొట్టమొదటిదేమంటే, గ్రామాల్లోని భూస్వామ్య, ధనిక రైతుల దాడికి యీ పథకం ప్రధాన లక్ష్యంగా మారింది. పలు రాష్ట్రాల్లో యీ పథకం కింద

నిర్ణయించిన వేతనాలు చట్టబద్దమైన కనీస వేతనాలకన్నా తక్కువగా వున్నాయి. అయినప్పటికీ, ఉపాధి పథకం కింద వేతనాలను పెంచరాదన్న గ్రామీణ ధనికుల డిమాండుకు ప్రభుత్వం తలొగ్గుతున్నది. రెండవదేమంటే, ఆర్థికంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న మొండివైఖరి యీ పథక లక్ష్యాలు నీరుగారటానికి దారితీస్తున్నది. దరహంమీద చూసినట్లయితే చాలా సంవత్సరాలుగా యీ పథకానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గుతున్నాయి. భారతదేశం మొత్తంమీద 2014 జూలైలో చెల్లింపులు చేయకుండా మిగిలివున్న మొత్తం రూ.4500 కోట్లు వున్నది. 2010-11 నుంచి 2013-14 మధ్య ఉపాధి పథకం కింద ఒక్కొక్క కుటుంబానికి లభించిన వార్షిక సగటు పనిదినాలు 43 నుంచి 46 వరకు వున్నాయి. మూడవదేమంటే, ఉపాధి పథకం కింద ఉపాధికి చట్టబద్దమైన హామీని తొలగించాలని రాజస్థాన్ ముఖ్యమంత్రి ప్రకటించారు. దీనిని కేవలం ఒక పథకంగా మాత్రమే వుంచాలని ఆ ప్రభుత్వ వుద్దేశం. ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాలకు మాత్రమే యీ పథకాన్ని వర్తింప చేయాలని ప్రభుత్వం కోరుతున్నట్లుగా యిటీవలి నివేదికలు తెలియచేస్తున్నాయి. ఇలా చేయటమంటే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని వుల్లంఘించడమే అవుతుంది.

52. మన ప్రజా సంఘాలు ఉపాధిహామీ పథకాన్ని పటిష్టపరచటానికి కృషిచేయాలి. ప్రతి ఒక్క శ్రామికునికి (అంటే కుటుంబానికి కాకుండా శ్రామికులకు) కనీసం 100 పనిదినాలు వుండేలా చొరవ తీసుకోవాలి. అలానే వేతన చెల్లింపులకు సంబంధించిన అన్ని క్లాజులూ అమలయ్యేలా కృషిచేయాలి. వేతన చెల్లింపుల్లో జరిగే జాప్యానికి నష్టపరిహారం చెల్లించాలి. వేతన బకాయిలను చెల్లింపుల కోసం తక్షణమే నిధులను అందుబాటులోకి తీసుకురావాలి. ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దటానికిగాను ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలను ఎప్పటికప్పుడు సవరిస్తూ వుండాలి. ప్రతి రాష్ట్రంలోనూ కనీస వేతనాలు తగ్గిపోకుండా చూడాలి.

### *గ్రామీణ ప్రాంతాల్లో వేతన రేట్లు*

53. గ్రామీణ భారతంలోని వేతన రేట్లలో వున్న నాలుగు స్వభావాలను మనమిక్కడ చూద్దాము. మొట్టమొదటి విషయం ఏమంటే, గ్రామీణ ప్రాంతాల్లోని వేతన రేట్లు చాలా తక్కువగా వున్నాయి. ఈ విషయాన్ని చాలా తేలికగా చూపవచ్చు. పదేహేడు గ్రామాల వివరాలను విశ్లేషించగా, అందులో అధిక భాగం గ్రామాలలో ఐదుగురితో కూడిన కుటుంబం (ఒక పురుష కార్మికుడు, ఒక మహిళా కార్మికురాలు వీరిపై ఆధారపడిన ముగ్గురు) ప్రస్తుత ధరవరల ప్రకారం

రోజుకు డాలర్‌తో సమానమైన ఆదాయాన్ని పొందాలంటే 600 రోజులకు పైగా పని చేయవలసి వుంటుంది. ఉత్తరప్రదేశ్‌లోని బిజ్‌నోర్ జిల్లాలోని హార్వేలి గ్రామంలో యిరువురు పనిచేసే వాళ్ళతో కూడిన కుటుంబం 626 రోజులకు పైగా పనిచేయవలసి వుంటుంది. మరోవిధంగా చెప్పాలంటే వేతన రేట్లు పెరగనట్లయితే కాయకష్టం చేసే శ్రమజీవులతో కూడిన కుటుంబాలు దారిద్ర్య రేఖను దాటాలంటే ప్రతి ఒక్క కుటుంబమూ ఏడాదిలో 300లకు పైగా రోజులపాటు పనిచేయవలసి వుంటుంది. ఇది అసాధ్యమన్న విషయం స్పష్టమే. మొదటిదేమంటే, ఆ స్థాయి వుపాధికి హామీయిచ్చే మార్గాలు అందుబాటులో లేవు. రెండవది ఇంతటి వెట్టిచాకిరి, కఠిన శ్రమలకు చేయడం దాదాపుగా అసాధ్యం. గ్రామ ప్రాంతాలలోని అత్యధిక శ్రామిక కుటుంబాలకు వుపాధి పథకం ద్వారా 100 రోజుల పని లభించినప్పటికీ దారిద్ర్య రేఖను దాటటానికి ఆ ఆదాయం సరిపోదు. మరొక విషయమేమంటే, వేతన రేట్లు ప్రాంతాల వారీగా అసమానతలతో కూడుకొని వున్నాయి. కేరళలో దినసరి వేతనం (ఇక్కడ యిచ్చే వుదాహరణలు నగదు చెల్లింపులతో కూడిన దినసరి వేతనం) ప్రస్తుతం మగవాళ్ళకు రూ.600 నుంచి 650 వరకు వున్నది. వ్యవసాయ అధ్యయనాల బృందం 20 గ్రామాలను సర్వే చేయగా మగవాళ్ళకు యిచ్చే దినసరి వేతనం (2012 డిసెంబరు ధరలను అనుసరించి) గ్వాలియర్ జిల్లాలోని ఘర్సోండి గ్రామంలో రూ.82లు వుండగా, సికార్ జిల్లాలోని (ఈ జిల్లాలోకి శ్రామికులు ఎక్కువగా వస్తుంటారని చెప్తారు) రేవసి గ్రామంలో రూ.195లుగా వున్నది. స్త్రీల విషయానికి వస్తే 2012 వేసవిలో పశ్చిమ చంపారన్ జిల్లాలోని కట్‌కుయన్ గ్రామంలో రోజుకు రూ.30లు యిచ్చారు. మూడవ విషయం ఏమంటే వేతనాలను యివ్వటంలో స్త్రీపురుష భేదాన్ని పాటించటం. కట్‌కుయన్ గ్రామంలో మగవారికి యిచ్చే దినసరి వేతనంలో ఆడవారికిచ్చేది 30 శాతం వుండగా, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా అనంతవరంలో 40 శాతంగా వున్నది. కొన్ని జిల్లాల్లో యీ శాతం 60 నుంచి 80 శాతం వరకు వున్నప్పటికీ, ఎక్కువ జిల్లాల్లో 50 శాతం వరకు వున్నది. సికార్ జిల్లాలోని రేవసి యిందుకు మినహాయింపు, పురుష శ్రామికులు ఎక్కువగా వలస పోవటంతో యిక్కడ స్త్రీపురుషుల వేతనాలు దాదాపు సమంగా వున్నాయి. నాల్గవదేమంటే, వస్తురూపంలో యిచ్చే వేతనాలు (ఉదాహరణకు, ధాన్యం, భోజనం వంటివాటిని వేతనంలో భాగంగా యివ్వటం) మొత్తం వేతనాలలో భారతదేశంలోని పలు ప్రాంతాలలో యిది కన్పిస్తుంది. చాలా ప్రాంతాలలో

వస్తురూపంలో వేతనాల చెల్లింపులు లేవు తగ్గుతూ వస్తున్నాయి లేదా, నామమాత్రంగా మాత్రమే వున్నాయి.

54. గ్రామీణ ప్రాంతాలలో వేతనాలు యిటీవలి కాలంలో పెరిగాయని, ప్రత్యేకించి 2004-05 నుంచి పెరిగాయని గ్రామీణ భారతంలో వేతన రేట్లు (డబ్ల్యుఆర్ఆర్ఐ) అన్న అధికారిక నివేదికలు తెలిపాయి. పదకొండు రకాల వ్యవసాయ కార్యకలాపాల గురించి, ఏడు రకాల వ్యవసాయేతర కార్యకలాపాల గురించి రాష్ట్రస్థాయి నెలసరి వివరాలను యీ నివేదికలు యిస్తాయి. వీటి ప్రకారం 2004-05 నుంచి 2011-12 మధ్య కాలంలో నైపుణ్యంలేని పురుష కార్మికుని వేతనం ఏడాదికి 4 శాతం పెరిగింది. కాగా, 2007-08 నుంచి 2011-12 మధ్య వేతనాల పెరుగుదలలో వేగం వున్నది. ఈ కాలంలో అనిపుణుడైన పురుష కార్మికుని వేతనం పెరుగుదల ఏడాదికి 7.6శాతంగా వున్నది. 2004-05 తరువాత స్త్రీ కార్మికుల వేతన రేట్లు మగవాళ్ళ విషయంలోకన్నా వేగంగా పెరిగాయి. 2004-05 నుంచి 2011-12 మధ్య కాలంలో కలుపుతీతల (యీ పని పూర్తిగా ఆడవాళ్ళే చేస్తారు) కూలిలో వార్షిక పెరుగుదల 6 శాతం వుంది. ఇటీవలి యీ పెరుగుదల (అధికారిక వర్గాల సమాచారాన్ని అనుసరించి) దీర్ఘకాల స్తంభన తరువాతదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. అఖిల భారత స్థాయిలో స్త్రీల వేతన రేట్ల విషయంలో ఎలాంటి మార్పు లేదు, కాగా, మగవాళ్ళ విషయంలో మాత్రం 1999-2000 నుంచి 2004-05 మధ్య మాత్రం స్వల్పంగా మార్పు వున్నది.

### *సంఘ నిర్మాణ సమస్య*

55. ఇంతకుముందే మనం పేర్కొన్నట్లుగా గ్రామీణ ప్రాంతంలో కాయకష్టం చేసే శ్రామికులు రకరకాల పనులు చేస్తున్నారు. కనుక వారిని ప్రధానంగా వ్యవసాయ *రంగంలో* పనిచేసే వేతన కార్మికులుగా మాత్రమే లెక్కించలేము. గ్రామసీమల్లోని శ్రామికులు పట్టణ కార్మికులకు భిన్నంగా వుంటారు. మొట్టమొదటి విషయం ఏమంటే గ్రామాల్లోని శ్రామికులు దాదాపుగా వ్యవసాయ కార్యకలాపాలలో వేర్వేరు స్థాయిల్లో పాల్గొంటారు. వ్యవసాయ అధ్యయనాల సంస్థ యిటీవల జరిపిన సర్వే ప్రకారం గ్రామాలలోని శ్రామికుల్లో 90 శాతం మంది ఏదో ఒక రూపంలో వ్యవసాయ కార్యకలాపాల్లో పాల్గొంటారని వెల్లడైంది. రెండవది గ్రామీణ శ్రామికుల పని వేర్వేరు ప్రాంతాలలో వేర్వేరుగా వుంటుంది. మూడవది ప్రధానంగా గ్రామాల్లో ఆధిపత్యం కలిగిన దోపిడీవర్గమే

గ్రామీణ ప్రాంతంలోని శ్రామికుల యజమానులుగా వుంటారు.

56. ఈ తరహా శ్రామికులు ఏయే సమయాలలో ఏయే పనులు చేస్తున్నారన్న దానితో నిమిత్తం లేకుండా సార్వత్రిక డిమాండ్ల గురించి ఆలోచించటానికి బహుశ యిదే సమయమని భావించాలి. ఇలాంటి డిమాండ్లు వేర్వేరు గ్రామీణ వృత్తుల్లో కనీస వేతనాలకు సంబంధించీ, వేర్వేరు పనుల్లో ఉపాధికి సంబంధించిన నిబంధనలు ముడిపడి వుంటాయి. కచ్చితమైన ఉపాధి దినాల హామీ, సార్వత్రిక వుచిత నిర్బంధ విద్య, సముచిత ఆరోగ్య సంరక్షణ, గృహవసతి, త్రాగునీరు, పరిసరాల పరిశుభ్రత తదితరాల కోసం కూడా డిమాండ్లను ముందుకు తీసుకురావలసి వుంది. వీటిని సాధించటానికి గ్రామీణ శ్రామిక యూనియన్ వీలైన సాధనంగా వుండగలదు. రాష్ట్రానికీ, రాష్ట్రానికీ వేర్వేరుగా వుండే నిర్దిష్ట స్థానిక పరిస్థితులను గమనంలోకి తీసుకుని సంస్థయొక్క నిర్దిష్ట రూపాన్నీ, నిర్మాణాన్నీ తదనుగుణంగా వుంచాలి.

***రైతాంగం***

57. వ్యవసాయ పనులన్నిటిలోనూ లేదా ప్రధానమైన పనుల్లో పాల్గొనే రైతు కుటుంబాలు ఒక వైపున భూస్వామ్య–ధనిక రైతులకూ, మరోవైపున కాయకష్టం చేసే శ్రామికులకూ మధ్య చిన్నతరహా వుత్పత్తిదారులుగా వుంటారు. రైతాంగం, ఒక సామాజిక తరగతిగా, వేర్వేరు చారిత్రక సామాజిక రూపాలలో వునికిని నిలబెట్టుకోవటంలో అద్భుత ప్రతిభను కనపరచినప్పటికీ, ఆధునిక కాలపు రైతాంగం దేశ, విదేశీ గుత్త పెట్టుబడులకు లోబడిపోయింది.

58. రైతాంగాన్ని ఏకజాతి గ్రామీణ బృందంగా ప్రజలు భావిస్తున్నారు. జనం భావించటం (ఆ రకంగా ప్రతీఘాతంగా) మార్క్సిజం మాత్రం రైతాంగాన్ని సజాతీయమైన లేదా ఏకైక వర్గంగా భావించదు. తద్విరుద్ధంగా రైతాంగం విజాతీయమైనదని, సామాజిక–ఆర్థిక వర్గాలుగా విభజితమై వున్నదని భావిస్తుంది. రైతాంగంలోని తారతమ్యాల విశ్లేషణా, రైతాంగంలో వర్గ విభజన ప్రమాణాలూ అనేవి ప్రత్యేకించి మార్క్సిజం ముందుకు తీసుకు వచ్చింది. సామాజిక లేదా రాజకీయ ఆలోచనకు సంబంధించిన మరే విధానమూ సిద్ధాంతంలో ముఖ్య స్థానాన్ని యివ్వటంగానీ, ఆచరణకు మార్గదర్శకంగా వుండటంగానీ జరగలేదు.

59. రైతాంగంలో వర్గాల విభజనకు ప్రధానమైన గీటురాయి యీ దిగువ విధంగా వుంటుంది.

* ఉత్పత్తి సాధనాలపైనా, యితర ఆస్తులపైనా యాజమాన్యమూ, అదుపు.
* ఒకవైపున వ్యవసాయంలోనూ, వ్యవసాయేతర పనుల్లోనూ కుటుంబ సభ్యుల పనిదినాలు, కుటుంబం వెలుపల వున్నవారి పనిదినాల సంఖ్య, మరోవైపున యీ కుటుంబం కూలికి పిలిచిన వారి పనిదినాల సంఖ్య.
* కౌలు దోపిడీ, అంటే, ఒక కుటుంబం స్వీకరించే కౌలు, లేదా, చెల్లించే కౌలు.
* కుటుంబం యొక్క నికర ఆదాయం, ఒక హెక్టార్‌కు లభించే స్థూల ఆదాయాన్నీ, పెట్టుబడినీ వేరుచేయాలి.
* కుటుంబం యొక్క ఆదాయ వనరులు.

60. వ్యవసాయంలో రైతు కుటుంబ సభ్యులు పాల్గొనే స్థాయి, ప్రతి గ్రామంలోని భూవినియోగ స్వభావంపైనా, పంటల తీరుపైనా, అదేవిధంగా ఆర్థిక, సామాజిక హోదాపైనా ఆధారపడి వుంటుంది. ప్రతి గ్రామంలోనూ పంటల పద్ధతీ, సాంకేతిక విధానమూ కలసి శ్రామికుల వినియోగంలో తేడాలను తీసుకు వస్తాయి. అలానే, కుటుంబ శ్రమ, శ్రమ బదుళ్ళు (అవి వుండివుంటే) రకరకాలైన శ్రామికుల వినియోగ సాపేక్షక నిష్పత్తి కూడా వుంటుంది. ప్రత్యేకించి వరి, తదితర పంటలు పండించే మాగాణి భూముల్లో చెప్పుకోదగిన పనులు వుంటాయి. రైతాంగంలోని అన్ని తరగతుల వారు యీ పనుల్లో పాల్గొంటారు. కుల, మతాలు, సంప్రదాయక స్త్రీపురుషులు నిర్వహించెడి పాత్రలు, ప్రత్యేకించి వేర్వేరు కులాల మధ్య పనులు వేరువేరుగా వుంటాయి. మరో విషయం కూడా స్పష్టంగా వుంది, అదేమంటే,

1. వ్యవసాయంలో యాంత్రికత పెరగటంతోపాటు, అంతకంతకూ రకరకాల పనులు దీని పరిధిలోకి వస్తున్నాయి.
2. కుటుంబంలో వృత్తి వైవిధ్యం బాగా పెరుగుతున్నది
3. వ్యవసాయ కార్యకలాపాలు అంతకంతకూ ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయి, లేదా, ప్రత్యేకమైన నైపుణ్యాన్ని ప్రాతిపదికగా చేసుకుంటున్నాయి. శ్రమప్రకారం రైతాంగంలో వర్గాలమధ్య తారతమ్యాలను వేరుచేయడం కష్టంగా వుంటున్నది.

61. ఉత్పత్తి సాధనాలపైనా, ప్రత్యేకించి భూమి, యితర ఉత్పాదక ఆస్తులపైనా ధనిక రైతు కుటుంబాలే అత్యధిక స్థాయిలో యాజమాన్యాన్ని కలిగి వున్నాయి. కాగా, మరోవైపున పేద రైతులు ఏవో చిన్నచిన్న భూకమతాలు మినహా ఎలాంటి ఉత్పాదక ఆస్తులను కలిగిలేరు.

62. ఇదేవిధంగా ధనికుల్లో సాపేక్షకంగా చూసినట్లయితే పెట్టుబడులు అధికంగా వుండటంతోపాటు అదనపు మిగులు ప్రాతిపదికపైన ఆదాయాలలో కూడా వ్యత్యాసాలు వుంటాయి. పేదల ఆదాయం విషయానికివస్తే ప్రతికూల పరిస్థితే కన్పిస్తుంది.

63. మొత్తంమీద చూసినట్లయితే ధనిక రైతుల స్వభావంలో మార్పువచ్చింది. ధనిక రైతుల్లో అధిక కౌళ్ళు ప్రాబల్యం వహించటంతో భూస్వాములకు అప్పుపడ్డారు. ఆ రకంగా పేదరైతులు, వ్యవసాయ కార్మికులు నేతృత్వం వహించే వుద్యమాలకు శక్తివంతుడైన సహచరుడు వెనక్కు తగ్గినట్లయింది. మరో విధంగా చెప్పాలంటే ధనిక రైతులకు, భూస్వాములకూ, బడా పెట్టుబడిదారీ రైతులకూ మధ్య వైరుధ్యాలు 1970ల వరకు వున్న దానికన్నా మరింత మొద్దుబారాయి.

### వర్తమానంలో కౌళ్ళు

64. కౌలుకు సంబంధించిన అధికారిక సమాచారం పూర్తిగా తప్పులతడక. ఎందుకంటే, నమోదుకాని కౌలు కాంట్రాక్టుల సమాచారాన్ని యిది అర్థవంతమైన రీతిలో సేకరించలేదు. అధికారిక సమాచారం ప్రకారం గ్రామప్రాంతాల్లో కేవలం 6.5 శాతం కుటుంబాలు మాత్రమే భూమిని కౌలుకు యిస్తున్నాయి. మరో వైపున ప్రాంతాలవారీగా కౌలు విషయంలో వ్యత్యాసాలు వున్నాయి.

65. వామపక్ష ప్రభుత్వాలున్న రాష్ట్రాలను మినహాయించితే యితరచోట్ల కౌలు ఒప్పందాలను నమోదు చేయటంలేదు, నోటిమాటగా, స్వల్పకాలానికి చెందినవిగా వుంటున్నాయి.

66. దేశవ్యాప్తంగా చూసినట్లయితే కౌలు కాంట్రాక్టుల్లో చాలా తేడాలున్నాయి. పంటల విధానంలోనూ, సాంకేతిక విజ్ఞానంలోనూ మార్పులు రావటంతో కౌలు కాంట్రాక్టు రూపాల్లో కూడా మార్పులు వచ్చాయి. అనేక ప్రాంతాల్లో సరికొత్త కౌలు ఏర్పాట్లు ఉనికిలోకి వచ్చాయి.

67. అత్యధిక ఉత్పాదకత, యాంత్రీకరణ, మొత్తంగా వుత్పాదక శక్తుల అభివృద్ధి అధికంగావున్న కొన్ని గ్రామాల్లో కౌలు దోపిడీ అధికంగానూ, తీవ్రంగానూ వున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా ప్రాంతంలో వరి పండించే గ్రామాలు, లేదా, హర్యానా, రాజస్థాన్‌లలో సిరి పద్ధతుల్లో సాగుచేసే ప్రాంతాలు, లేదా దళితులైన పేదరైతుల్లో తాత్కాలిక కౌలు పద్ధతులు అమలులో వున్న పశ్చిమ

యు.పిలోని బిజ్నోర్ జిల్లాను యిందుకు వుదాహరణగా తీసుకోవచ్చు. హర్యానాలో నిర్దిష్ట రూపాల్లో యాంత్రీకరణను ప్రవేశపెట్టిన తరువాత కౌలు కూడా పెరిగింది. బోరుబావుల నుంచి నీటి సరఫరాతోపాటు ట్రాక్టర్లను భూస్వాములు ప్రవేశపెట్టిన తరువాత కౌళ్ళు పెరిగాయి. కోస్తాంధ్రలో వరిపంటను సాగుచేసే ప్రాంతాల్లో ఉత్పత్తి పెరగటంతో కౌలు కూడా పెరిగింది. నిజానికి, 1974 నుంచి 2005–6 మధ్య పెరిగిన ధాన్యం వుత్పత్తిని పెరిగిన కౌలు పేరుతో భూయజమానులే దాదాపుగా చేజిక్కించుకున్నట్లు గుంటూరు జిల్లాలోని అనంతవరం గ్రామంలో కామ్రేడ్ పి. సుందరయ్య చేసిన అధ్యయనంలో వెల్లడైంది.

68. కొన్ని ప్రాంతాల్లో కౌలు కాంట్రాక్టుల్లో వెట్టి చాకిరి యిమిడి వుంటుంది. ఇప్పటికే పైన సిరి పద్ధతుల్లో పనిచేసే శ్రామికులను పేర్కొన్నాము. అలానే పశ్చిమ యు.పిలోని బిజ్నోర్ జిల్లాను కూడా ప్రస్తావించాము. ఇక్కడ చెరకు వేసిన తరువాత వరిపంట కోసం చిన్నచిన్న భూఖండాలను వ్యవసాయ కార్మికులకు కౌలుకు యిస్తారు.

69. కౌలు మార్కెట్‌లో భూయజమానులుగానూ, కౌలుదారులుగానూ చిన్న, బడా భూస్వాములు పాల్గొన్నప్పటికీ వారు భూమిని పొందే కాంట్రాక్టుల్లో తారతమ్యాలు ఎక్కువగానే వుండేవి. మొత్తంమీద చూసినట్లయితే, దళితులు, భూమిలేని నిరుపేదలు, పేదరైతు కుటుంబాలు ఎక్కువ కౌలుకు, తరచుగా అత్యధిక కౌలుకు భూమిని తీసుకోవలసి వస్తున్నది. ఈ కౌలు కాంట్రాక్టులు ఉపాధితోనూ, రుణ అవకాశంతోనూ ముడిపడి వున్నాయి. మరోవైపున సాపేక్షకంగా చూసినట్లయితే తేలిక షరతులపై ధనికులకు కౌలు భూములు లభిస్తున్నాయి. సాధారణంగా వీరికి ప్రవాసుల, లేదా స్నేహితుల, బంధువుల, పేదరైతుల భూములు కౌలుకు లభిస్తుంటాయి. సొంత ఉత్పత్తి సాధనాలుగానీ, పెట్టుబడులకు అవకాశంగాని లేని కారణంగా సాంకేతిక విధానాన్ని అందుకోగల సామర్థ్యం లేని పేదరైతులు వున్నచోట యీ 'ఎదురు' కౌలు విధానం – అంటే, చిన్న, పేద రైతులు తమ భూమిని ధనిక రైతులకు కౌలుకు యివ్వటం– కన్పిస్తున్నది. ప్రభుత్వ సేవలు తగ్గుతున్నాయి. ఉదాహరణకు, కాలువల ద్వారా సాగునీరందక పోవటంతో గొట్టపు బావులపై ఆధారపడవలసి వస్తున్నది. ఈ కారణంగా పేదరైతులు తమ భూములను ధనిక రైతులకు యివ్వవలసి వస్తున్నది.

**రైతుల ఆదాయాలు**

70. నూతన వాణిజ్య విధానం ఫలితంగా భారతీయ వ్యవసాయ రంగం తలుపులు తెరచుకున్నాయి. మునుపెన్నడూ లేని సరికొత్త పద్ధతిలో ఆహార, ఆహారేతర పంటలకు సంబంధించి అంతర్జాతీయ ధరలు చొచ్చుకువచ్చాయి. చాలా సరకుల విషయంలో ధరలు క్షీణించాయి. ఈ విషయంలో భారత ప్రభుత్వం అత్యంత ప్రధానమైన విధానాలను తీసుకువచ్చింది. ముఖ్యంగా గోధుమలు, గోధుమ వుత్పత్తులు, బియ్యము, అపరాలు, వంటనూనెలు, విత్తనాలు తదితరాలతోసహా పలు వ్యవసాయ సరకుల ఎగుమతి, దిగుమతులపై పరిమాణాత్మక ఆంక్షలను ఎత్తివేసింది. దిగుమతి సుంకాలపై గణనీయంగా కోత విధించింది. వ్యవసాయ సరకుల ఎగుమతులకు నూతన ప్రోత్సాహకాలు, మద్దతు కారణంగా భూమి వినియోగంపైనా, పంటల పద్ధతిపైనా అనివార్య ప్రభావం పడింది. దిగుమతి ఆంక్షలపై నిబంధనల తొలగింపు, అలానే వ్యవసాయ ఎగుమతుల రంగంలోకి ప్రైవేటు రంగానికి ప్రోత్సాహం యివ్వటంతో పరిస్థితి మరింత దిగజారింది.

71. ఉదారవాద దశలో అన్ని రకాల ఎరువులు, విత్తనాలు, సస్యసంరక్షణ రసాయనాలతో సహా వ్యవసాయ పెట్టుబడులన్నిటా దేశీయ, బహుళజాతి సంస్థలు మున్నెన్నడూ ఎరుగని రీతిలో జోక్యం చేసుకుంటున్నాయి.

72. గిట్టుబాటు ధరకు హామీ వుండేలా ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధర, అత్యధిక రాష్ట్రాలలో ఎక్కువ భాగం పంటలకు పేద, మధ్య తరగతి రైతులు పెట్టే పెట్టుబడులకు ఎంతమాత్రం సరితూగేలా లేవు. అంతేకాక, జాతీయ రైతు కమీషన్ ప్రతిపాదించిన స్థాయికి దరిదాపుల్లో కూడా లేవు. ధాన్యసేకరణ యంత్రాంగం బలహీనపడటంతో దేశంలోని అత్యధిక ప్రాంతాలకు చెందిన రైతులు కనీస మద్దతు ధర ద్వారా లభించవలసిన ప్రయోజనాన్ని పొందలేక పోతున్నారు. ఎక్కువ భాగం రైతులు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవలసిన పరిస్థితి ఎదురవుతున్నది. దీనితోపాటే, ప్రభుత్వ సేకరణను కుదించటంతోపాటు, మద్దతు ధర పరిధిలోకి వచ్చే పంటల రకాలను కూడా తగ్గిస్తున్నది.

73. ఈ విధానాల ప్రభావంతో వ్యవసాయాదాయ విషయంలో ప్రాంతాల వారీగా, పంటల వారీగా, తరగతుల వారీగా తారతమ్యాలు చాలా ఎక్కువగా వుంటున్నాయి. ఒకవైపున అత్యధిక రైతు కుటుంబాలు కొద్దిపాటి ఆదాయాన్ని మాత్రమే పొందుతుంటే, మరోవైపున భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులు,

ధనిక రైతుల్లో ఒక భాగం గణనీయమైన ఆదాయాన్ని పొందుతున్నారు.

74. రైతాంగ భవితవ్యం యొక్క సరికొత్త విస్తృతినీ, దానిలో యిమిడివున్న తీవ్ర చిక్కుల్నీ గ్రామాల నుండి లభించిన సమాచారం తెలియ చెప్తున్నది. గ్రామీణ కుటుంబాలలోని ఒక నూతన భాగం (ప్రధానంగా పేదరైతు కుటుంబాలు) నిజానికి పంటద్వారా ప్రతికూల ఆదాయాన్నే పొందుతున్నది. వ్యవసాయ మంత్రిత్వ శాఖ నిర్వహించిన సర్వేలు అందుబాటులోకి వచ్చాయి. అలానే యిటీవలి సర్వేల ప్రకారం వ్యవసాయదారుల్లో ఒక భాగం వ్యవసాయంలో నష్టాన్నే మిగుల్చుకుంటున్నారు.

75. వ్యవసాయాదాయాలలో రైతు కుటుంబాల మధ్య తీవ్రమైన అసమానతలు వుండటమేకాక, వ్యవసాయ ఖర్చుల్లోనూ, లాభాలలోనూ తీవ్రమైన వ్యత్యాసాలు వుంటున్నట్లు కూడా యీ సమాచారం వెల్లడిస్తున్నది. వివిధ వర్గాల మధ్య లాభాలలో కూడా అంతరాలుంటున్నాయి. పేద, మధ్య తరగతి రైతులకన్నా, భూమితోపాటు యితర ఉత్పత్తి సాధనాలను గుప్పెట పెట్టుకున్న భూస్వాములకు, ధనిక రైతులకు సాగు వ్యయం తక్కువగా వుంటున్నది. ధనిక రైతులకు భిన్నంగా పేదరైతులు ఎరువులకు, కౌళ్ళకు, యంత్రాలకు ఎక్కువగా వ్యయం చేయవలసి వస్తున్నది. ఎరువులు తదితరాలను సమర్థవంతంగా వినియోగించటంతోపాటు, మార్కెట్ అందుబాటు అవకాశాలు ఎక్కువగా వుండటంతో భూస్వాములు, పెట్టుబడిదారీ రైతులు, ధనిక రైతులు యితరులకన్నా, అంటే పేద, మధ్య తరగతి రైతులకన్నా ఎక్కువగా లాభిస్తున్నారు.

***<u>రైతాంగ శ్రామికీకరణ</u>***

76. రైతులకు సంబంధించిన వ్యత్యాసాలలో ముఖ్యమైన విషయమేమిటంటే, రైతులు శ్రామికులుగా మారుతున్నారు. మరీ ముఖ్యంగా పేద, మధ్య తరగతి రైతాంగంలో యీ మార్పు కనిపిస్తుంది.

77. రైతులు భూమిని కోల్పోవటమే శ్రామికీకరణకు ప్రధాన కారణం. ప్రభుత్వమూ, గ్రామీణ ధనికులు, కార్పొరేట్ రంగమూ భూమిని స్వాధీనం చేసుకోవటం కూడా రైతులు వ్యవసాయానికి దూరం కావటానికొక కారణంగా వున్నది.

78. శ్రామికీకరణలో మరో కోణం ఏమంటే, రైతాంగంలో చాలామంది తమ రైతాంగ హోదాను నిలబెట్టుకుంటూనే కూలికి వెళుతుండటం.

79. చిన్న, మధ్య తరగతి రైతు కుటుంబాలు పొలంలో చేసే శ్రమ అదే పొలంలో

వేతన శ్రామికులు చేసే శ్రమకన్నా తక్కువగా వుంటున్నట్లు దిగువస్థాయిలో చేసిన అధ్యయనం తెలుపుతున్నది. కాగా, ప్రతి గ్రామంలోనూ అత్యధిక భాగం (తరచుగా ఎక్కువమంది శ్రామికులు) పేద, మధ్య తరగతి రైతు కుటుంబీకులు యితరుల పొలాల్లోనూ, వ్యవసాయేతర పనుల్లోనూ పాల్గొంటున్నారు. కేవలం శ్రమ ప్రాతిపదికపై మధ్యతరగతికి చెందిన రైతులను పేదల నుంచి విడదీయటం యింకెంతో కాలం సాధ్యపడదు.

80. మొత్తంమీద చూసినట్లయితే వ్యవసాయ ఖర్చులు పెరిగిపోయాయి. కాయకష్టం చేయకుండా తరుచుగా అధిక శ్రమ చేయకుండా జీవించడం కష్టమవుతున్నది. పనులు ముమ్మరంగా వుండే సమయంలో కుటుంబ శ్రమ పరిమాణంపైనా, పద్ధతిపైనా యాంత్రీకరణ ప్రభావం చాలా ఎక్కువగా వున్నది. బాగా వెనుకపడిన ప్రాంతాలను మినహాయిస్తే సేద్యంలో ట్రాక్టర్ పాత్ర పెరిగింది. అలానే భూగర్భ జలంపై ఆధారపడిన ప్రాంతాల్లో మోటారు పంపులు పెరిగాయి. దేశంలోని అత్యధిక భాగంలో నూర్పిడి యంత్రాలు పెరిగాయి, గోధుమ పంట పండే ప్రాంతాల్లో కోత యంత్రాలు వ్యాప్తిలోకి వచ్చాయి. దేశంలోని కొన్ని ప్రాంతాలలో (వుదాహరణకు తమిళనాడు) వరినాట్లు కూడా యంత్రాల ద్వారానే సాగుతున్నాయి. వీటివలన దేశంలోని అనేక ప్రాంతాలలో అపరాల సాగులో పెట్టుబడుల తగ్గుదల వున్నది. యాంత్రీకరణ కారణంగా వ్యవసాయ పనులలో గతంలోకన్నా తక్కువ అస్థిరత వుంటున్నది. డిమాండు తక్కువగా వున్నపుడు కుటుంబీకుల శ్రమయే సరిపోతుంది (ఉదాహరణకు, పొలంలో కోతపని వారం రోజులపాటు చేయవచ్చుననుకుంటే కుటుంబీకులే సరిపోతారు, అలాకాకుండా రెండు రోజులలోనే పూర్తి చేయాలనుకుంటే యితరులను పిలుచుకోవాలి) మానవ శ్రమ స్థానంలో యంత్రాలు వచ్చినమాట వాస్తవం. అంతేకాక సంప్రదాయకంగా కాయకష్టం చేసే శ్రామికులు తరచుగా ఆ యంత్రాలను నడిపేవారుగా మారుతున్నారు. ఈ పరిణామం పెట్టుబడుల్లోనూ, వుత్పత్తి ప్రక్రియలోనూ పలు మార్పులు తీసుకువచ్చింది, యీ క్రమంలో రైతులు కూడా భాగస్వాములుగా వున్నారు.

81. ఒక ఏడాదిలో పేదరైతు కుటుంబం చేసే శ్రమను మూడు భాగాలుగా –సేద్యంలో కుటుంబ శ్రమ, వేతనం కోసం చేసే పొలం పని, వేతనం కోసం చేసే వ్యవసాయేతర పని– విభజించినట్లయితే, మొదటిది చాలా తక్కువగా వుంటుంది, చాలా గ్రామాలలో 50 శాతంకన్నా తక్కువగా వుంటుంది.

82. వేతన శ్రమ మార్కెట్ విస్తృతమైంది. గతంలోకన్నా పలు సామాజిక బృందాలు దీనిలో ప్రవేశించాయి. సాపేక్షంగా చూసినట్లయితే అనేక గ్రామాల్లోనూ, మొత్తంగా గ్రామీణ ప్రాంతంలోనూ ప్రధానంగా రైతు కుటుంబాల సభ్యులు వ్యవసాయంలో చేసే వేతన శ్రమ దినాలు పెరిగాయి.

83. ఇక్కడ గమనించవలసిన అంశం ఒకటున్నది. కాయకష్టం చేసే పేద, మధ్య తరగతి రైతు కుటుంబాలు గ్రామంలో 60 శాతం లేదా అంతకన్నా ఎక్కువగా వున్నాయి. పలు గ్రామాల్లో కాయకష్టం చేసే శ్రామికులకూ, పేద రైతు కుటుంబాలకూ మధ్య గీతగీయడం చాలా కష్టంగా వున్నది.

84. మొత్తం శ్రమజీవుల్లో రైతాంగం నిర్వహించే పాత్ర గురించి లెనిన్ చేసిన పరిశీలన ప్రత్యేకించి యీ సందర్భంగా పేర్కొనదగి వున్నది. "సార్వత్రిక వ్యవసాయ విధానంలో యీ శ్రామిక 'రైతుల' ప్రాధాన్యత", గురించి చర్చిస్తూ, ముందుగా చెప్పవలసిన విషయమేమంటే సామాజికార్థిక రంగంలో పెట్టుబడిదారీ పూర్వ వ్యవస్థకూ, పెట్టుబడిదారీ వ్యవస్థకూ మధ్య ఒకానొక చారిత్రక కొనసాగింపుగా (లేదా "బంధుత్వాన్ని") వారు వున్నారని చెప్తాడు. రెండవదేమంటే, జీవనాధారాన్ని సంపాదించుకోవటానికి ఏమాత్రం పనికిరాని, అలానే, మొత్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థలోని నిరుద్యోగ సైన్యానికి కేవలం అనుబంధ వృత్తికి ప్రాతినిథ్యం వహించే గోష్పాదమంత మడిచెక్కలను 'రైతు' శ్రేణులు కలిగి వున్నాయి. మార్క్స్ మాటలను వినియోగించేటట్లయితే యీ సైన్యంలోని అగోచర రూపం అనవలసి వుంటుంది. ఈ నిరుద్యోగ సైన్యం కేవలం పనిదొరకని శ్రామికులతో మాత్రమే నిండివుంటుందనుకోవటం పొరపాటే అవుతుంది. ఎవరైతే తమకున్న కొద్దిపాటి మడిచెక్కలపై ఆధారపడి జీవించలేరో, ఎవరైతే తమ జీవనోపాధి కోసం తమ రెక్కలను నమ్ముకుంటారో ఆ 'రైతులు' లేదా 'చిన్న రైతులు' కూడా యీ సైన్యంలో భాగంగా వుంటారు.

85. గ్రామసీమల్లో మనం చేసే కృషి ప్రధానంగా, తమను దరిద్రులుగా మారుస్తున్న నయా వుదారవాద విధానాలకు వ్యతిరేకంగా పేదలు, మధ్యతరగతి రైతులు చేసే పోరాటానికి తోడ్పడేలా వుండాలి. ఇదేసమయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకునేందుకూ, కొనుగోళ్ళు, అమ్మకాల సమయంలో బేరసారాలాడగల తమ శక్తిని పెంచుకునేందుకు వీలుకల్పించే రైతాంగ సమష్టి ప్రయత్నాలకు వున్న అవకాశాలను అధ్యయన బృంద సభ్యులు కనుగొనవలసిన అవసరం వున్నది.

*గ్రామీణ వ్యవసాయేతర రంగంలో వర్గాలు*

86. సంప్రదాయకంగా చూసినట్లయితే గ్రామంలో లేదా గ్రామీణ జనాభాలో అత్యధికులు పంటలు పండించటంతో ప్రత్యక్ష సంబంధాలను కలిగిలేరు. చేతివృత్తిదారులు, కులవృత్తులు చేసేవారు, అంటే, వడ్రంగులు, తాపీపనివారు, కమ్మరులు, కుమ్మరులు, నేత పనివారు, అలానే సంప్రదాయక సేవలందించే కులాలకు చెందినవారు యీ కోవలోకి వస్తారు. ప్రస్తుత కాలంలో వీరి సంఖ్యతోపాటు, సంప్రదాయక పనులు చేసే సమయం కూడా తగ్గుముఖం పట్టింది.

87. రెండవదేమంటే, పైన పేర్కొన్నవారితోపాటే చిరు వ్యాపారులు, స్వయం వుపాధి కలిగిన వారు వున్నారు. వీరిలో చిన్నచిన్న దుకాణాలను నడుపుకునే వారు, తినుబండారాలు అమ్మేవారు, సైకిళ్ళను యితర వాహనాలను మరమ్మతులు చేసేవారు తదితరులు వున్నారు.

88. మొదటి విషయమేమంటే, గ్రామసీమల్లో ప్రధానమైన నూతన వృత్తులు వున్నాయి. చిన్న, మధ్యతరహా, అధిక వుత్పత్తిదారుల్లో నూతన తరగతులు వున్నాయి: పాడిపశువుల, కోళ్ళ ఫారంల యజమానులు వున్నారు. ఇతరమైన వుత్పత్తి కేంద్రాలు కూడా వున్నాయి. వీటిల్లో యజమానులైనవారే తమ కుటుంబ సభ్యులను, బయటి శ్రామికులను కలుపుకుని పనిచేస్తారు, లేదా పూర్తిగా వేతన శ్రామిక కార్మికులపై ఆధారపడతారు.

89. రెండవదేమంటే, గ్రామాల్లో పెద్ద వర్తకులు, వ్యాపారులు వున్నారు. గ్రామస్థాయి వ్యాపారులలో ఎరువులు తదితరాలను అమ్మేవారు తయారు కావటం విశిష్టమైన అంశం. ప్రస్తుత అభివృద్ధి దశలో ప్రభుత్వ నిధులతో కూడిన వ్యవసాయ సహకారం బలహీనపడటంతో పెద్ద రైతులు చేసే వ్యయాన్ని నిర్ధారించడంలో రసాయన మందులు, సస్యసంరక్షణ మందులు అమ్మే డీలర్లే ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. యంత్రాలను బాడుగకు యివ్వటం ద్వారా 'సేవలందించే వారు' (భూస్వాములతో సహా) కూడా వున్నారు.

90. మూడవదేమంటే, గ్రామంలో వేతనాలు అందుకునే 'మధ్యతరగతి' వున్నది. సాధారణంగా వీరు రాష్ట్ర ప్రభుత్వ వుద్యోగులై వుంటారు – అంటే, ప్రభుత్వ వుద్యోగులు, ఉపాధ్యాయులు తదితరులు– వీరితోపాటు వేతనాలు తీసుకునే ప్రభుత్వేతర రంగానికి చెందిన వుద్యోగులు కూడా వున్నారు. గ్రామీణ పేదలతో గ్రామీణ మధ్యతరగతి సంబంధాల సాన్నిహిత్యం, గ్రామీణాభివృద్ధి వుద్యమం

తొలిదశలో వున్నట్లుగా ప్రస్తుతం లేవని పశ్చిమ బెంగాల్ అనుభవాన్ని ఆధారం చేసుకుని అధ్యయన బృందం సభ్యులు గమనించారు. గ్రామీణ ప్రజల అభిప్రాయాలను సమకాలీన వ్యవసాయేతర మధ్యతరగతి ప్రభావితం చేస్తున్నది. అయితే గతంలోవలె గ్రామీణ పేదల ఆకాంక్షలను పంచుకోవటంగానీ, వారి విముక్తి కోసం పోరాడాలన్న వాంఛగానీ ప్రస్తుతం కరువయ్యాయి. కనీసం దేశంలోని కొన్ని భాగాలలోనైనా గత ధోరణి కనిపించటంలేదు.

91. నాల్గవ విషయం ఏమంటే గ్రామీణ పేదల్లో కొందరు ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్నారు. వారిలో ముఖ్యంగా సమీకృత బాలల వికాస సేవా (ఐసిడిఎస్) పథకాలు, మధ్యాహ్న భోజన పథకం, జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం (ఎన్ఆర్హెచ్ఎం), వుదాహరణకు ఆశా వర్కర్ల వంటివారున్నారు. ఈనాడు, గ్రామాల్లో వీరు మన ప్రజాసంఘాలలో సంఘటితమై, రైతు, గ్రామీణ శ్రామికులతో పోలిస్తే పురోగమన పాత్రనే నిర్వహిస్తున్నారు.

92. ఐదవ అంశం ఏమిటంటే, గ్రామప్రాంతాల్లోనూ, బస్తీల్లోనూ, చిన్న పట్టణాల్లోనూ కొంతమంది గ్రామీణ ధనికులు, అంటే, ఇటీవలి కాలంలో చిన్న, మధ్యతరహా వస్తుతయారీ ద్వారా, వ్యవసాయ వుత్పత్తులు, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం, వ్యాపారాలు, సేవారంగం, అద్దెలు తదితరాల ద్వారా ఆస్తులను, అధికారాన్ని పొందినవారు. ఉదారవాద విధానాలు ప్రవేశించిన తరువాత వీరే ప్రభుత్వ విధానాలు, కాంట్రాక్టులు, రాయితీలద్వారా నేరుగా లబ్ది పొందుతున్నారు. నయా వుదారవాద విధానాలలో భాగంగా సంస్థాగత రుణాలను వెనక్కు తీసుకున్న చర్య వడ్డీ వ్యాపారులను సృష్టించింది. అయితే వీరు సర్వేసర్వత్రా ప్రధానమైన గ్రామీణ దోపిడీదారుల్లో భాగంగా వుండరు.

93. ఈ ఐదు కేటగిరీల గురించి చర్చించిన ఐదు పేరాలలో వ్యవసాయ భూమిపై యాజమాన్యతను లేదా సేద్యపు హక్కులను కలిగివున్న కుటుంబాలను కలిపి వుండవచ్చు లేదా కలపకపోవచ్చు. ఏదియేమైనప్పటికీ, వైయక్తిక లేదా కుటుంబ ఆదాయానికి ప్రధాన వనరు పంటల వుత్పత్తి కాదన్న వాస్తవాన్ని బట్టి వాటి స్వభావాన్ని పేర్కొనటం జరిగింది.

***కులం, తెగ, లింగభేదం, ఇతర సామాజిక వ్యత్యాసాలపై ఆధారపడిన సామాజిక అణచివేత***

94. నిచ్చెనమెట్ల సామాజిక హోదాను ప్రాతిపదికగా చేసుకున్న కుల, తెగ, లింగ, తదితర సామాజిక మినహాయింపులు, వివక్షతలు భారతదేశపు వ్యవసాయ సమస్యలో అంతర్భాగం.

95. ఒకానొక సామాజిక బృందం చేసే బహిష్కరణలు, చూపే వివక్షతలు వేర్వేరు రూపాలలో వుంటుంది. ఈ రకమైన వివక్షత ప్రత్యక్ష హింస, హత్య, లేదా శారీరక హింస అనే రూపాన్ని తీసుకోవచ్చు. రోజువారీ జీవితంలో సామాజిక బృందం చూపే వివక్షతలకు గుర్రైన బాధితుల స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడి జరిగినపుడు వెలివేత, వివక్షతలు అనేవి ప్రత్యక్ష వివక్షతకు దారితీస్తుంది. ఇప్పటికీ, నేరపూరిత, ఆటవిక రూపాలలో కొనసాగుతున్న ప్రత్యక్ష వివక్షతలను మన సంఘాలు, అంటే, తమిళనాడుకు చెందిన తీందమై ఒజిప్పు ఇజక్కమ్ (అస్పృశ్యతా నిర్మూలన వుద్యమం), ఆంధ్రప్రదేశ్‌లోని కులవ్యతిరేక పోరాట సమితి వంటివి నమోదుచేశాయి.

96. ప్రత్యక్ష వివక్షత కొన్ని తరాలను వెలికి, నిర్లక్ష్యానికి గురిచేసింది, తత్ఫలితంగా, విద్య, ఆరోగ్యం, గృహవసతి, పని, అణగారిన బృంద సభ్యులకు సామాజిక హోదా అనేవి అట్టడుగుకు పడిపోయాయి.

97. వివక్షత యొక్క ప్రతిరూపమూ, లేదా సంచిత లేమి యొక్క ప్రతి కోణమూ దాని బాధితుల స్వేచ్ఛకూ, జీవితాలకు సంబంధించి అనేకానేక పర్యవసానాలకు కారణమవుతాయి. ఉదాహరణకు సంపద హక్కుల స్వభావం కేవలం భూమి, యితర ఆస్తుల యాజమాన్యతను నిశ్చయించడమే కాకుండా, ఆదాయాలను, జీవనోపాయాలను, యితరంగా వున్న సామాజిక హోదా, శ్రేయోజీవితాలకు సంబంధించిన అంశాలను ప్రభావితం చేస్తాయి. భూమి అమ్మకాలు, తనఖాలు, సంపద బదలాయింపుల యొక్క గ్రామస్థాయి రూపాలు ఎక్కడకూడా బహిష్కరణలు, వివక్షతల యొక్క మార్కెటేతర రూపాల నుండి పూర్తి స్వేచ్ఛను పొందలేదు. మార్కెట్ వెలుపల నిర్ణయమయ్యే శ్రమవిభజననూ, ఆస్తుల పంపకాన్నీ కులం నిర్ధేశిస్తుంది. నాణ్యమైన నివాసాలను, పరిసర శుభ్రతను కలిగి వుండటం తత్పర్యవసానంగా ఆరోగ్యాన్నీ, పర్యావరణాన్నీ, జీవితాలనూ సురక్షితం చేసుకోవటం ప్రధానమైన అంశం అవుతుంది. మరొక వుదాహరణను తీసుకుందాము, విద్యారంగానికి సంబంధించిన కొరత, నిర్లక్ష్యం వీటితోపాటే స్వేచ్ఛకు ప్రమాదం ఎదురుకావటం అనేవి వేతనాలను, వృత్తిలో స్థానచలనాన్ని, వృత్తి స్థాయినీ ప్రభావితం చేస్తాయి.

98. ఆర్థికపరమైన దోపిడీ, అణచివేతలకు తోడుగా మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం విషయంలోనూ, అలానే సామాజిక, రాజకీయ జీవితంలో సంపూర్ణమూ, సమానమూ, స్వతంత్ర భాగస్వామ్యాన్ని పొందలేకపోతున్నారు. గ్రామీణ

సమాజంలో దుర్భర మౌఢ్యానికీ, లైంగికపరమైన దురవగాహనలకు, హింసకూ గురవుతున్నారు.

99. ఆదివాసీ ప్రజలలో నెలకొని వున్న వ్యవసాయ సంబంధాలు భారతదేశపు వ్యవసాయ సమస్యలో అత్యంత ప్రధానమైన అంశంగా వున్నది.

100. ఆదివాసీ ప్రజలకు సంబంధించి వివరణాత్మకమూ, విశ్లేషణాత్మకమూ అయిన ప్రయోజనార్థం, వ్యవసాయ పల్లపు భూములుండి బహుళ కులాలతో కూడిన గ్రామాలలో విడిగా లేదా బృందాలుగా నివసించే ఆదివాసీ ఆవాసాలకు, తరచుగా 'గిరిజన ప్రాంతాలుగా' గుర్తింపు పొంది అత్యధికంగా (లేదా మొత్తంగా) ఆదివాసీ నివాసాలు కలిగిన గ్రామాలకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించటం సులభమే (విలక్షణమైన ఈశాన్య రాష్ట్రాలను మినహాయించి యితర ప్రాంతాలకు చెందినవి).

101. మొదటి తరహా గ్రామాలకు సంబంధించిన సమాచారం ప్రకారం గ్రామమంతటిలోకి – ఆదాయాలు, విద్య, నివాస సౌకర్యము, వుపాధి తదితర అభివృద్ధి సూచికల రీత్యా – ఆదివాసీలే దుర్భర స్థితిలో వున్నట్లు తెలియ వస్తున్నది. రెండవ తరహా గ్రామాలలోని వారిని అభివృద్ధికి నోచని ప్రత్యేక తరహాకు చెందిన వారిగా గుర్తిస్తున్నారు. సాంకేతిక మార్పులు, ఆర్థిక పురోగతి, మానవాభివృద్ధి, సామాజిక మౌలిక సదుపాయాలు, ప్రజల జీవనాధారాలు, ఆదాయాలు వగైరాలలో యీ స్థితి వ్యక్తమవుతున్నది. ఆదివాసీయేతర గ్రామాలలోకన్నా గుణాత్మకంగా తక్కువ స్థితిలో వీరు వున్నారు. సేద్యం పద్ధతుల రీత్యా కూడా యీ గ్రామాలు విభిన్నంగా వుంటాయి. ఇలాంటి గ్రామాల్లో అత్యంత ప్రాధాన్యం కలిగిన గృహ సంపద తరచుగా వాణిజ్యేతర వస్తువులే అయివుంటాయి. అంటే, వ్యవసాయ భూమి, (దీని యాజమాన్యత తరచుగా అనియతంగా వుంటుంది), గుడిసెలు, పశువులు, పశువుల పాకలు వుంటాయి.

102. ఈనాడు భారతదేశంలో, మరీముఖ్యంగా ఆదివాసీ గ్రామాలలో వ్యవసాయం యిప్పటికీ సాంప్రదాయక వృత్తిగానే నిలచి వున్నది. సర్వసాధారణంగా ఖరీఫ్ కాలానికే సేద్యం పరిమితమవుతున్నది. అతి తక్కువ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం కారణంగా వ్యవసాయ వుత్పత్తీ, వుత్పాదక శక్తీ దిగువ స్థాయిలోకే పరిమితమవుతున్నాయి. ఆదివాసీ గ్రామాలలో సాంకేతిక మార్పులు లేకపోవటంతో వ్యవసాయ పంటలకు, విత్తన వైవిధ్యానికీ అవి నెలవులుగా మారాయి. సాంప్రదాయక పద్ధతుల్లో విత్తనాలను, పంటల రకాలను వారు

కాపాడుకున్నారు. ఈ విషయంలో భారతదేశంలోని వేర్వేరు ప్రాంతాలలో నమోదైంది. ఉదాహరణకు, మధ్యప్రదేశ్‌లోని అనుపూర్ జిల్లా బధర్ అనే ఆదివాసీ గ్రామంలో 42 రకాల పంటలు సాగువుతున్నాయి. వీటిల్లో అపరాలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, నూనె గింజలు వంటివి వున్నాయి. 2008లో వీటిని సాగుచేశారు. ముఖ్యంగా అంతర పంటలుగానూ, పెరటి తోటలుగానూ వీటిని సాగుచేయటం జరిగింది.

103. ఆదివాసీల కుటుంబ సంపాదనలో సేకరణ పద్ధతి యిప్పటికీ కొనసాగుతుండటం విలక్షణమైన విషయం. ఉదాహరణకు గతంలో, అంటే, 2007లో దుంగరియా గ్రామంలో (రాజస్థాన్‌లోని ఉదయపూర్ జిల్లా) సర్వే జరిపినపుడు అక్కడి ఆదివాసీలు ఇప్పపూలు, బీడీ ఆకులు, తేనెలతోపాటు యితరమైన పూలు, పండ్లు, ఔషధ మొక్కలు సేకరించే వారు. అలానే తిత్తిరి పిట్టలు, అడవి కోళ్ళు, కుందేళ్ళు, జింకలు, అడవి పందులు వగైరాలను వేటాడేవారు. వంట చెరకుతోపాటు, గృహనిర్మాణానికి, నాగళ్ళు వగైరా వ్యవసాయ పనిముట్లకు, మంచాలు వగైరా గృహసామాగ్రికి కావలసిన కలపను కూడా సేకరించేవారు. ప్రస్తుతం ప్రధానంగా కలపను (చిన్నచిన్న పరికరాలకు, గృహసామాగ్రికి పనికి వచ్చేది), ఇప్పపూలను సేకరిస్తున్నారు. ఇతర అడవి వుత్పత్తులైన గుగ్గిలం, వెదురు, పండ్లు (కర్జూరాలతో సహా) అడవి గడ్డి, తేనె, ఆముదం వగైరాలను కొద్ది మొత్తాలలో సేకరిస్తున్నారు.

104. ఆదివాసీ ప్రజలలో వచ్చిన మార్పులలోని మరికొన్ని లక్షణాలను పరోక్ష లేదా యితర వనరులపై ఆధారపడి చేసిన యిటీవలి పరిశోధనల ద్వారా తెలుసుకోగలుగుతున్నాము. మొట్టమొదటిది ఆదివాసీలలో శ్రామికీకరణ పెరుగుతున్నది. పెద్దయెత్తున భూములను కోల్పోవటం, తమ శ్రమశక్తిని వేతన కూలీలుగా ఎక్కువగా వినియోగించటం వంటివాటి ద్వారా మనం గుర్తించవచ్చు. నిజానికి భారతదేశపు శ్రామిక శ్రేణులలో ఆదివాసీలు – రైతులుగా, అడవులపైనా, యితర సమష్టి వనరులపైనా ఆధారపడి జీవనాన్ని గడిపేవారుగా, గ్రామీణ శ్రామికులుగా, పట్టణ ప్రాంతాలకు తరలివచ్చిన అనిపుణ శ్రామికులుగా– అత్యంత దుర్భర దారిద్ర్య దుస్థితిలో చిక్కుకొని వున్నారు. రెండవదేమంటే, పెట్టుబడిదారీ విధానం గ్రామీణ గిరిజన ఆర్థిక వ్యవస్థలను మార్చివేసింది. గిరిజన ప్రాంతాలలో వున్న విలక్షణ పరిస్థితి యేమిటంటే, భూకేంద్రీకరణ, సేకరణల ఫలితంగా ప్రయోజనం పొందిన వారు ఆదివాసీలుకాని ఆదివాసీయేతర సామాజిక బృందాలకు చెందినవారు.

105. షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారిలో అత్యధికులు అనియత రంగంలో శారీరక శ్రమ చేస్తున్నప్పటికీ, బహుకొద్ది మాత్రం పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన నియతరంగంలో శారీరకేతర శ్రమ చేస్తున్నారు. ఉదాహరణకు, దుకాణాలలోనూ, సేవారంగం తదితరాలలోనూ వేతన వుద్యోగులుగా పనిచేస్తున్నారు. అనియత రంగంలోని శ్రామికులకన్నా వీరి పరిస్థితి కాస్త మెరుగ్గా వున్నది. వీరి సంఖ్య కొద్దిపాటిగానే వున్నప్పటికీ వీరికున్న సామాజిక ప్రాధాన్యతను తక్కువగా అంచనా వేయగూడదు. వీరుచేసే వుద్యోగాలు యువతకు స్ఫూర్తిదాయకంగా వున్నాయి. అంతేకాక ప్రత్యేకించి యువజనుల దృష్టిలో వీరు మార్గనిర్దేశకులు, భావజాల నిర్మాతలు.

106. సామాజిక వివక్షతలకు వ్యతిరేకంగా మన ప్రజాసంఘాలు, మన పార్టీ తప్పనిసరిగా అగ్రపీఠిన నిలవాలి, అంతేకాక ఎప్పుడైనా, ఎక్కడైనా సామాజిక వివక్షతకు సంబంధించిన చర్యలు లేదా వుదంతాలు వున్నట్లయితే, ప్రజలు మనవైపుకు తిరిగేలా మన సంఘాలు ప్రజలలో తప్పనిసరిగా గుర్తింపు పొందాలి. ఇదే సమయంలో మనం యితర రూపాలలో సాగుతున్న సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా సాగే పోరాటంలో ముందుపీఠిని వుండాలి – వుదాహరణకు, విద్య, ఆరోగ్యం, గృహవసతి సౌకర్యాలకు సంబంధించి అథమస్థాయిలో వుండటం, నిర్దిష్టమైన ప్రదేశాలలోని పనిస్థలాలు, శ్రమవిభజన విషయంలో బలిపశువులుగా మారుతున్న సామాజిక బృందాల కోసం మనం పోరాడాలి.

107. సామూహిక వివక్షతలకు, అణచివేతలకు వ్యతిరేకంగా సాగే మన పోరాటం క్రియాశీలంగానూ, రాజీలేనిదిగానూ వుండాలి. ఇదే సమయంలో శ్రామిక ప్రజలలో ఐక్యతను నెలకొల్పే విషయం మన దృష్టిని దాటిపోగూడదు. నిజానికిది చాలా క్లిష్టమైన కార్యం, ఎందుకంటే శ్రామిక ప్రజల్లో వున్న కులాలే సామాజిక అణచివేతదారుల్లో కూడా వుంటాయన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. మధ్యయుగాల సామాజిక వివక్షా రూపాలతో చీలికలు పేలికలుగా మారిన దేశంలో సామాజిక వివక్షతలపై పోరాడుతూనే, మన పార్టీ మాత్రమే సంబంధిత రాజకీయాల ద్వారా స్పష్టమైన ప్రత్యామ్నాయాన్ని యివ్వగలదు.

**పనికోసం గ్రామీణ భారతం నుంచి వలసలు**

108. పనికోసం గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు పోవటానికి భారతదేశంలో చాలా చరిత్రే వున్నది. అంతేకాక, పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో యీ

వలసలు అంతర్భాగంగా వున్నాయి. మొత్తంమీద చూసినట్లయితే వుదారవాద విధానాలు ప్రవేశించిన నాటి నుండి వలసలు పెరిగిపోయాయి. కార్యకర్తలు, సామాజిక శాస్త్రవేత్తలు పరిశీలనలో యిది వెల్లడైంది. ఇటీవలి సంవత్సరాలలో చోటుచేసుకున్న వలసల్లో ఎక్కువ భాగం తాత్కాలికమైనవే, అంటే, వలసలు వెళ్ళేవారు అక్కడే శాశ్వతంగా వుండిపోవటం లేదు. వలసలకు సంబంధించిన అధికారిక సమాచారం, ముఖ్యంగా 2008లో ఎన్ఎస్ఎస్ సేకరించిన సమాచారం వలసల గురించిన యథార్థ పరిస్థితిని యివ్వటంలేదు. అధికారిక సమాచారంలో వున్న ప్రధానమైన లోపమేమంటే తాత్కాలిక వలసల గురించిన సమాచారం సక్రమంగా లేకపోవటం.

109. మొత్తంమీద చూసినట్లయితే గ్రామాల నుంచి గ్రామాలకు, గ్రామాల నుంచి పట్టణాలకు సాగుతున్న వలసలు పెరుగుతున్నప్పటికీ, ప్రస్తుతం గ్రామీణ–పట్టణ ప్రాంతాలకు వలసలు పెరుగుతున్నాయి (ఇలా చెప్పటంలో వుద్దేశం గ్రామాల నుంచి గ్రామాలకు సాగుతున్న వలసలను తక్కువ చేసి చూపడం ఎంతమాత్రం కానేకాదు).

110. మొత్తంమీద చూసినట్లయితే కొట్టవచ్చినట్లు కనిపించేదేమంటే (సంఖ్యాపరంగా) తూర్పు ఉత్తర ప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల నుంచి వలసలు ఎక్కువగా సాగుతున్నాయి. వీటికితోడు యితర రాష్ట్రాలలో కొన్ని ప్రాంతాల నుంచి కూడా వలసలు సాగుతున్నాయి. 1980ల వరకు వలస వెళ్ళే శ్రామికులకు పశ్చిమ బెంగాల్ గమ్యంగా వుండేది. పంజాబు, హర్యానాలలో వరిసాగు విస్తరించటంతో వాయువ్య, పశ్చిమ భారత ప్రాంతాల నుంచి వలసలు ప్రారంభమయ్యాయి. 1990లలో యీ ధోరణి బాగా కనపడింది. ఇటీవలి సంవత్సరాలలో దక్షిణాది వైపుకు, అంటే కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లకు వలసలు పెరిగాయి.

111. వలస శ్రామికులు ప్రధానంగా రోజువారీ పనిలో కుదురుకుంటున్నారు, దీని తరువాత స్వయం వుపాధి వస్తుంది. ప్రధానంగా నిర్మాణ రంగమూ, గనులు, వస్తుతయారీ, సేవారంగాలు వీరికి పనులను కల్పిస్తున్నాయి. వలసల గురించిన అధికారిక సమాచారం అవకతవకలుగా వున్నది. మరీ ముఖ్యంగా మహిళల విషయంలో యిది కొట్టవచ్చినట్లు కనపడుతుంది. వలస వెళ్ళే స్త్రీ శ్రామికుల విషయానికి వస్తే ప్రధానంగా వారు వలస వెళ్ళటానికి కారణం వివాహం. వివిధ రకాలైన పని వలసలను వేరు చేయటం, పురుష శ్రామికుల

విషయంలోకన్నా చాలా కష్టం. మొత్తంమీద చూసినట్లయితే, పనులు కోసం స్త్రీలు వలసలు పోతున్నట్లు కనిపించినప్పటికీ పురుషులతో పోల్చినపుడు వీరి సంఖ్య తక్కువగానే వుంటుంది. అయితే యిటీవలి సంవత్సరాలలో వీరి సంఖ్య కూడా పెరుగుతున్నది. ప్రధానంగా వీరు నిర్మాణ రంగం, సేవారంగాలలో పనిచేస్తున్నారు. వీరిలో రోజువారీ శ్రామికులు, స్వయం వుపాధి శ్రామికులు ఎక్కువ.

112. ఒంటరి మహిళలు వలస పోవటానికి సామాజిక ఆటంకాలు అలానే వున్నాయి. ముఖ్యంగా ఉత్తర భారతంలో యీ ధోరణి కనపడుతుంది. ఆసక్తికరమైన సమాచారం ఏమిటంటే, పెండ్లి వలసలు ఎక్కువ కావటం. ఇది, స్త్రీ-పురుష నిష్పత్తి తక్కువగా వున్న రాష్ట్రాలలోనూ, వాయువ్య భారత ప్రాంతాలలోనూ ఎక్కువగా కనపడుతుంది. తూర్పు ప్రాంతాల నుంచి కూడా పెండ్లి వలసలు పెరుగుతున్నాయి.

113. రానున్న సంవత్సరాలలో వలసలు మరింతగా పెరగనున్నాయి. ప్రత్యేకించి మౌలిక సదుపాయాల అభివృద్ధి వూపందుకుంటున్న తరుణంలో యిది సంభవిస్తుంది. కనుక శ్రమజీవుల గురించీ వారి జీవితాల గురించీ కచ్చితమైన డిమాండ్లను రూపొందించేటందుకై వలసల గురించీ, దేశంలోని వివిధ ప్రాంతాలలో వలసపోయే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల గురించీ, అలానే వలస కార్మికుల కుటుంబాలు స్వగ్రామాలలో ఎదుర్కొంటున్న సమస్యల గురించీ మన పార్టీ, ప్రజాసంఘాలు విశ్లేషించటం అన్నది చాలా ప్రాధాన్యం కలిగిన విషయం.

## శ్రామిక-రైతు సంఘటన

114. రైతులలోని వ్యత్యాసాలలో వున్న ప్రస్తుత ధోరణులు, శ్రామికీకరణరీత్యా, వీటితోపాటు వలసల పోవటం వల్ల గ్రామీణ శ్రామికులకు, పేద, మధ్యతరగతి రైతులకు నడుమ ఐక్యతావకాశాలకు మార్గాలు తెరచుకున్నాయి. వ్యవసాయ సమస్యకు పరిష్కార సాధనంగా వుపయోగపడే శ్రామిక-రైతు సంఘటనకు యీ తరహా ధోరణులు నూతన అవకాశాలను కలుగచేస్తాయి. రైతుల, గ్రామీణ పేదల వర్గ డిమాండ్ల కోసం సాగే పోరాటాలకు శ్రామికవర్గ ప్రత్యక్ష మద్దతు వుండగలదని శ్రామిక-రైతు సంఘటన వూహిస్తున్నది. రానున్న సంవత్సరాలలో యీ సంఘటన నిర్మాణం సరికొత్తదైన, సృజనాత్మకమైన మార్గంలో సాగాలి. ఉదాహరణకు, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వుపాధి హామీ నుంచి

వ్యవసాయేతర వుపాధి వరకు పోరాటాలను విస్తరించడం; పట్టణాలలోనూ పల్లెల్లోనూ సార్వత్రిక ప్రజాపంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి; గృహసదుపాయం కోసం, పేదలకు త్రాగునీరు, పారిశుద్ధ్యం, గృహవిద్యుత్, సార్వత్రిక విద్యాబోధన, ప్రాథమిక ఆరోగ్యంవంటి డిమాండ్లతో దీనిని నిర్మించవలసి వుంటుంది. అలానే కులానికి, స్త్రీపురుష వ్యత్యాసాలకు, సామాజిక అణచివేతకు సంబంధించిన యితర రూపాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలి.

**5. 1991 అనంతర పరిస్థితి గురించి నిర్దిష్టమైన కొన్ని అంశాలు**

115. 1991 నుండి, అంటే ప్రపంచీకరణ క్రమం వేగాన్ని పుంజుకుని, వుదారవాద విధానాలను ప్రవేశపెట్టిన అనంతరం గ్రామీణ ధనికులకు, బడా బూర్జువాలకు, వారి సామ్రాజ్యవాద పొత్తుదారులకు అనుకూలంగా గ్రామీణ భారతంలో వర్గశక్తుల పొందికలో నేరుగా మార్పుతెచ్చేలా వరుసవారీగా కొన్ని చట్టాలను, నిబంధనలనూ, నియమాలను, వుత్తర్వులను యితర విధానపరమైన చర్యలను అమలులోకి తేవటం జరిగింది. వీటిల్లో భాగంగానే గ్రామీణ భారతంలోని వ్యవసాయ, వ్యవసాయేతర కార్యకలాపాలకు సంబంధించి ద్రవ్య, వుత్పత్తి, నిల్వ, పంపిణీ రంగాలలోకి భారీ పెట్టుబడుల ప్రవేశానికి వీలుగా కొన్ని విధానాలను ప్రభుత్వం చేపట్టింది. దీనివల్ల సామాజిక మౌలిక సదుపాయాలకు సంబంధించిన విభిన్న అంశాలలో యాజమాన్యత, అదుపు, వినియోగ రూపాలు ప్రభావితమవుతాయి.

116. వ్యవసాయ రంగంలో రుణాలు, దేశీయ, విదేశీ వాణిజ్యము, నయా వుదారవాద విధానాలు, చర్యలు, అనేకమైన సరికొత్త ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, అలానే వ్యవసాయం, భూమి వినియోగం, ఆహార భద్రత విషయాలలో కార్పొరేట్ పెట్టుబడులు కీలక పాత్రను పోషిస్తున్నాయి. నయా వుదారవాద శకంలోని ప్రతి ఒక్కదాని గురించి క్లుప్తంగా యీ దిగువన వివరిస్తాము.

117. ఈ పరిణామాలు విద్య, ఆరోగ్యం, పేదరికం, మానవ శ్రేయస్సుకు సంబంధించిన యితర అంశాలలోనూ చిక్కులను కల్గిస్తాయి. ఈ విధానాలు, పథకాలు వాటి ఫలితాలు యివన్నీకూడా ప్రజల రాజకీయ జోక్యాన్నీ, ప్రతిఘటన కోసం సమీకృతం కావలసిన అవసరాన్నీ ముందుకు తెస్తున్నాయి. ఆదాయ లేమినీ, శ్రేయోజీవితానికి గీటురాళ్ళుగా వుండే విద్య, ఆరోగ్యం, గృహ సౌకర్యాలకు సంబంధించిన అంశాన్ని చర్చిస్తాము.

118. గత రెండు దశాబ్దాలు ఆపై నుంచి పర్యావరణ మార్పు అనేది కొత్తగా వునికిలోకి వచ్చింది. వ్యవసాయంలోనూ, కరువు నివారణలోనూ యిది కీలకమైన అంశంగా వుంటున్నది. ఈ విషయాన్ని చివరలో చర్చించుదాము.

*గ్రామీణ రుణం*

119. 1990 దశకం సామాజిక, అభివృద్ధి బ్యాంకింగ్ విధానాల తిరోగమనానికి గుర్తు. వ్యవసాయ రుణాల పెరుగుదలలో తీవ్రమైన పతనం వున్నది. చిన్న, సన్నకారు రైతులకు రుణాలు అందకుండా పోవడంతో గ్రామీణ రుణాలపై వడ్డీ వ్యాపారుల పట్టు పెరిగింది. 2004 నుంచి పరిమితంగా వ్యవసాయ పునరుద్ధరణ చోటుచేసుకున్నది. కాని, యీ పునరుద్ధరణ లబ్దిదారులను చూసినట్లయితే పెద్దయెత్తున అసమానత కొట్టవచ్చినట్లు కనపడుతుంది. పెరిగిన వ్యవసాయ రుణంలో నాలుగింట ఒకవంతు గత పదేళ్ళలో 'పరోక్షంగా' వాణిజ్య, ఎగుమతులు, పెట్టుబడి ప్రోత్సాహక వ్యవసాయం, వాణిజ్య సంస్థలకు చేరుకున్నది. కాగా యిదే సమయంలో వ్యక్తిగతంగా బ్యాంకులు యిచ్చే భారీ రుణాల సంఖ్యలో పెరుగుదల వున్నది. 1990 నుంచి 2011 మధ్య రూ.20,000ల కన్నా తక్కువ వుండే ప్రత్యక్ష వ్యవసాయ రుణాల వాటా 92 శాతం నుంచి 48 శాతానికి తగ్గింది. కాగా యిదే సమయంలో రూ.10లక్షలకన్నా ఎక్కువ మొత్తంలో యిచ్చే రుణాలు 4 శాతం నుంచి 2011 నాటికి 23 శాతానికి పెరిగింది. ఈ భారీ రుణాలు ప్రధానంగా వ్యవసాయ వాణిజ్యం వంటి నూతన కార్యకలాపాలకు ద్రవ్య సహాయం నిమిత్తం యిచ్చినవి. 2011లో మొత్తం వ్యవసాయ రుణంలో 23 శాతం, ప్రత్యక్ష వ్యవసాయ రుణంలో 26 శాతం పట్టణ లేదా నగర ప్రాంతాలలో వున్న బ్యాంకు శాఖల నుంచి వచ్చినవే.

120. 1991 తరువాత దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలలో తీవ్రమైన తగ్గుదల వున్నది. స్వల్పకాలిక వ్యవసాయ రుణ వాటాలో సహజంగానే పెరుగుదల వున్నది. తత్కారణంగా వ్యవసాయంలో స్థిర పెట్టుబడిగా వినియోగించే వ్యవసాయ రుణ వాటా కుదించుకుపోయింది.

121. ప్రాథమిక వ్యవసాయ రుణ సహకార సంఘాల (పిఏసిఎస్) రుణ విధానం పేద రైతులకు అందుబాటులో వుంటుందని తరచుగా భావిస్తారు. కేంద్ర ప్రభుత్వమూ, రిజర్వు బ్యాంక్‌లు చేపట్టిన కేంద్రీకృత చొరవల కారణంగా సహకార సంఘాల రుణాల ద్వారా రైతాంగాన్ని ఆదుకునే రాష్ట్ర ప్రభుత్వాల

శక్తి సన్నగిలింది. యుపిఏ-2 ప్రభుత్వం ప్రకాశ్ బక్షి కమిటి సిఫార్సులను ఆమోదించటం ద్వారా భారతదేశపు ప్రాథమిక వ్యవసాయ రుణ సహకార సంఘాలను వాణిజ్య బ్యాంకులకు అనుబంధ బ్యాంకులుగా మార్చేందుకు పచ్చజెండా వూపింది. ఈ విధానం కారణంగా దేశంలోని 90,000 సహకార సంఘాలు దెబ్బతినే ప్రమాదం ఎదురైంది. అయితే రైతులు, బ్యాంకు వుద్యోగులు, సహకార సంఘాల శ్రామికులు ఐక్య పోరాటానికి దిగటంతో తాత్కాలికంగా యీ నిర్ణయాన్ని నిలిపివేశారు. ఏదియేమైనప్పటికీ సహకార సంఘాలపై యీ కత్తి వేలాడుతూనే వున్నది.

122. ఏదియేమైనప్పటికీ, పరిమితులు, అసమానతలు వున్నప్పటికీ రుణ సౌకర్య పునరుద్ధరణ 2003-04 నుంచి వ్యవసాయ పునరుజ్జీవనానికి దోహదపడింది.

**వాణిజ్య వుదారవాద సమస్యలు**

123. ఒకప్పటి సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపాలలో సోషలిజానికి ఎదురు దెబ్బలు తగిలిన తరువాత అమెరికన్ సామ్రాజ్యవాద నేతృత్వంలో ఏకధ్రువ ప్రపంచాన్ని వర్ధమాన దేశాలు ఎదుర్కొంటున్న తరుణంలో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) వునికిలోకి వచ్చింది. వ్యవసాయం, సేవారంగం, మేధోసంపద, వివాద సర్దుబాట్ల విధానాలు వంటివాటికి సంబంధించి అత్యంత చిక్కయిన ఒప్పందాలను వర్ధమాన దేశాలపై బలవంతంగా రుద్దారు. ఈ క్రమంలో వాటి సార్వభౌమత్వం తీవ్రంగా కుదించుకుపోయింది. కాగా యిదే సమయంలో సామ్రాజ్యవాద దేశాలు తమకు అనువైన రీతిలో వాణిజ్యాన్ని చేసుకునే అవకాశాన్ని వుంచుకున్నాయి. గత రెండు దశాబ్దాల కాలంలో ప్రపంచ వాణిజ్య సంస్థ బలాబలాల పొందికలో మార్పు వచ్చింది, అయినప్పటికీ సామ్రాజ్యవాద దేశాలే ఆధిపత్య స్థానంలో వున్నాయి. నయా వుదారవాద విధానాలను చేపట్టిన భారతదేశం సామ్రాజ్యవాదానికి పూర్తిగా లొంగిపోయింది. అయితే యిటీవలి కాలంలో కొంత తిరుగుబాటు కనిపిస్తున్నది. చైనా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా తదితర వర్ధమాన దేశాలతో జతకట్టిన తరువాత యీ మార్పు కనపడుతున్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ షరతుల కారణంగా భారతదేశపు వ్యవసాయార్థిక వ్యవస్థ, రైతుల ఆదాయాలు బాగా దెబ్బతిన్నాయి. వస్తువుల, సేవల దిగుమతి ఎగుమతుల వాటా 1991లో 14 శాతం నుండి 50 శాతానికి చేరువైంది. డబ్ల్యుటిఓ ప్రభావం చాలా తీవ్రంగా వున్నదని దీనివలన తెలియ వస్తున్నది.

124. 1990ల నుంచి దాదాపుగా అన్ని పంటల దిగుబడులపైన ఎగుమతుల నియంత్రణలను భారత ప్రభుత్వం క్రమక్రమంగా తొలగించింది. అలానే 2000 నుంచి గోధుమలు, గోధుమ వుత్పత్తులు, బియ్యము, పప్పు ధాన్యములు, నూనె గింజలువంటి సరకుల దిగుమతిపై పరిమాణాత్మక ఆంక్షలను ప్రభుత్వం తొలగించింది. అత్యధిక వ్యవసాయ దిగుమతులపై టారిఫ్‌లను గణనీయంగా తగ్గించటం జరిగింది. అతి తక్కువ టారిఫ్‌లకు భారతదేశం డబ్ల్యుటిఓలో అంగీకరించింది. 1990-91 నుండి 2011-12 మధ్య భారతదేశపు వ్యవసాయ ఎగుమతులు 13 శాతం వార్షిక రేటు చొప్పున పెరిగింది. కాగా వ్యవసాయ దిగుమతులు 21 శాతం పెరిగాయి. వాణిజ్య సరళీకరణ అనంతరం దేశీయ, ప్రపంచ ధరల మధ్య అనుసంధానం పెరగటంతో అంతర్జాతీయ ధరవరల్లోని (గుత్త మార్కెట్ వాతావరణం రూపొందింది) ఎగుడు దిగుడులు భారతీయ వ్యవసాయ రంగంలోకి దిగుమతి అయ్యాయి.

125. ఒకవైపున సామ్రాజ్యవాద దేశాలు ప్రయోజనమని భావించినపుడు డబ్ల్యుటిఓను పక్కన పెట్టాయి. సింగపూర్ అంశాలుగా పేరొందిన వాణిజ్య సరళీకరణా, ప్రభుత్వ సేకరణ, పోటీ విధానము, పెట్టుబడులకు రక్షణ వంటివాటిని ముందుకు తీసుకురావటానికి తొలుత 2001లో దోహాలో ప్రయత్నించాయి. 2013 నాటి బాలి సమావేశంలో వాణిజ్య సరళీకరణ అజెండాను ముందుకు తీసుకురావటానికి ప్రయత్నించాయి. అంతిమంగా సంపన్న దేశాలు ఆహార భద్రతను, సార్వభౌమత్వ విషయాలను వాణిజ్య సరళీకరణ విధానాలకు జోడించాయి. భారతదేశం తాత్కాలికంగా మాత్రమే తన ప్రభుత్వ నిల్వల కార్యక్రమాన్ని రక్షించుకోగలిగింది. ఈ ఒప్పందాల నుంచి బయట పడవలసిన భారతదేశం అమెరికా ఒత్తిడి కారణంగా తాత్కాలిక వాయిదాకు అంగీకరించింది. సామ్రాజ్యవాదం విషయంలో మన పాలక వర్గాల వూగిసలాటకు బాలి సమావేశాలు మరో రుజువుగా వున్నాయి. పోరాడుతున్నట్లు కన్పించినప్పటికీ భారతదేశ ప్రయోజనాలనూ, పేదదేశాల ప్రయోజనాలను ఫణంగాపెట్టి రాజీమార్గాన్ని అనుసరించింది.

126. వ్యవసాయ రంగంలో అసమాన ఒప్పందాలను మన పార్టీ వ్యతిరేకించింది. ఈ ఒప్పందాలు పేదదేశాల ప్రజల ప్రయోజనాలను ఫణంగా పెట్టి సామ్రాజ్యవాద ప్రయోజనాలను కాపాడతాయని పేర్కొన్నది.

127. శ్రీలంకతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందమూ, దానితోపాటే

భారత–ఆసియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు రబ్బరు, కాఫీ, తేయాకు, మిరియాలు, కొబ్బరివంటి వాణిజ్య పంటల సాగుదారులపై దుష్ప్రభావాన్ని చూపుతాయి. భారత్, ఐరోపా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతోపాటే యిలాంటివే మరో 56 ఒప్పందాలు వివిధ దేశాలతో కుదిరాయి. వీటిలో అమెరికా, జపాన్, ఇజ్రయెల్ కూడా వున్నాయి. అత్యధిక సబ్సిడీలున్న దేశాలతో మన రైతాంగం ప్రత్యక్ష పోటీని ఎదుర్కొనవలసి వచ్చింది. ఆయా దేశాల నుంచి పెద్దయెత్తున దిగుమతులు వచ్చిపడటంతో కోట్లాది రైతులతోపాటు, పాల వుత్పత్తిదారుల, మత్స్యకారుల జీవనం ప్రమాదంలో పడింది. రాష్ట్ర ప్రభుత్వాలనుగానీ, పార్లమెంటునుగానీ సంప్రదించకుండానే కేంద్ర ప్రభుత్వం యీ ఒప్పందాలను చేసుకున్నది. ప్రమాదకరమైన యీ విధానాలకు, చర్యలకు వ్యతిరేకంగా గ్రామీణ ప్రజలలో ప్రచారం చేయవలసిన అవసరం వున్నది.

**కార్పొరేట్ పెట్టుబడులు, వ్యవసాయము, రాజ్యము**

128. భూముల స్వాధీనానికీ, అదేవిధంగా భారతదేశపు ఖనిజ సంపదలనూ, యితర సహజ వనరులను దోచుకోవటానికిగాను స్వదేశీ, విదేశీ బడా పెట్టుబడిదారులకు నయా వుదారవాద విధానాలు తోడ్పడుతున్నాయి. ప్రత్యేక ఆర్థిక మండలాల (సెజ్) కోసం వ్యవసాయ భూములను, అటవీ భూములను స్వాధీనం చేసుకుని వాటిని బదలాయించటం, గనుల తవ్వకం, పరిశ్రమలు, పట్టణీకరణ వంటివి చోటుచేసుకుంటున్నాయి. సెజ్ చట్టాలు బడా పెట్టుబడులకు పన్ను రాయితీలను యిస్తూ, కార్మికులకు హక్కులను నిరాకరిస్తున్నాయి. సట్టా వ్యాపారం కోసం వాణిజ్య సంస్థలు భూమి స్వాధీనానికి అవకాశాన్ని యిస్తున్నాయి. సరైన నష్టపరిహారాన్నిగాని లేదా పునరావాస సౌకర్యాలనుగాని అందుకోకుండానే అనేకమంది ప్రజలు భూములను కోల్పోతున్నారు. న్యాయమైన పరిహారానికి హక్కు, భూమి స్వాధీన చట్టంలో పారదర్శకత అనేవి భూసేకరణకు వుపయోగపడుతున్నాయిగాని న్యాయమైన పరిహారానికిగానీ, సమర్థవంతమైన పునరావాసానికిగానీ వీలు కల్పించటం లేదు. ప్రస్తుత ప్రభుత్వం భూమి స్వాధీనం కోసం కార్పొరేట్‌లకు మరిన్ని సౌకర్యాలను కల్పిస్తూ భూములను కోల్పోయిన వారికున్న కొద్దిపాటి చట్టబద్ధమైన హక్కులను కూడా హరిస్తున్నది.

129. భూముల స్వాధీనానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రకమైన స్వాధీనాలు ముందుగా తెలిపేటట్లు,

అంగీకారం తీసుకునేటట్లు, అలానే న్యాయమైన నష్టపరిహారం, పునరావాస, పునరుజ్జీవనాలకు వీలుండేలా, అలానే హేతుబద్ధమైన భూవినియోగ విధానం పరిధిలో జరిగేలా అవకాశం వున్నచోట మనం జోక్యం చేసుకోవాలి.

130. భూపరిమితి చట్టాలను నీరుగార్చడంతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి విదేశీ, స్వదేశీ బడా పెట్టుబడులు ప్రవేశించటం వలన, సామాజిక అవసరాలతో నిమిత్తం లేకుండా భూమి వినియోగంలోనూ, పంటల విధానంలోనూ గణనీయమైన మార్పులు వచ్చాయి. భూమి వినియోగ విధానం నిష్పక్షపాతంగానూ, పర్యావరణపరంగా తగినదిగానూ, దేశ ఆహారభద్రతనూ వుండేటట్లయితే దానిని గరిష్ట లాభాలు, కార్పొరేట్ ప్రయోజనాలు అన్న తర్కం పరిధిలోకి తీసుకు రాగూడదు.

131. భారతదేశ వ్యవసాయ రంగంలో దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు జోక్యం చేసుకుని ప్రత్యక్ష కార్పొరేట్ వ్యవసాయానికి బదులు కాంట్రాక్టు వ్యవసాయం చేస్తున్నాయి. నికర పంటసాగు భూమిలో కాంట్రాక్టు వ్యవసాయం యీనాడు కొద్దిపాటిగానే వున్నప్పటికీ కొన్ని ప్రాంతాలలో, అంటే పశ్చిమ బెంగాల్, పంజాబుల్లో బంగాళా దుంప, మధ్యప్రదేశ్‌లో సోయాచిక్కుళ్ళు సాగుచేస్తున్నారు. కాంట్రాక్టు వ్యవసాయంలో రైతులు ప్రవేశించేలా తగినంత మద్దతును, రక్షణను యివ్వాలన్నదే మన పంథాగా వుండాలి. ఈ విషయంలో రైతుల బేరసారాల శక్తి పెరిగేలా గ్రామీణ ప్రాంతాల్లోని మన ప్రజాసంఘాలు కృషిచేయాలి.

132. గిడ్డంగులు, మార్కెటింగ్ వంటివాటిని కూడా స్వాధీనం చేసుకుని నేరుగా జోక్యం చేసుకోవాలని కార్పొరేట్ రంగం చూస్తున్నది. భారత ఆహార సంస్థ ఆధీనంలో వున్న సౌకర్యాలను స్వాధీనం చేసుకొని, ప్రభుత్వ ఆధీనంలో కాకుండా తన కిందకు తెచ్చుకోవాలని చూస్తున్నది.

133. గ్రామీణ రంగంలోకి వాణిజ్య సంస్థలు ప్రవేశించినపుడు, అవి భూస్వామ్య, పెట్టుబడి రైతు వర్గాలకు మాత్రమే వుపయోగపడే సాధనాలుగా మారతాయి.

### *ఆహార భద్రత*

134. గ్రామీణ, పట్టణ ప్రాంతాల రెండింటా భారతీయ జనాభాలోని గణనీయ భాగానికి ఆహార భద్రత కీలకాంశంగా మారింది. మూడు విధాలుగా దీనిని విశ్లేషిస్తారు: అవి లభ్యత, అందుబాటు, స్వీకరణ. ఆహార లభ్యత అనేది దిగువ స్థాయిలో వుత్పత్తి, నిల్వ, నికర దిగుమతులపై ఆధారపడి వుంటుంది.

దిగువ స్థాయిలో ప్రధానంగా రవాణా సదుపాయాలు, మార్కెట్‌లపై ఆధారపడి వుంటుంది. ఆహార అందుబాటు అనేది ప్రధానంగా కొనుగోలు శక్తికి సంబంధించినది. ఆ రకంగా అది వుత్పాదక ఆస్తితోటీ, జీవికకున్న అవకాశాలతోటీ ముడిపడి వుంటుంది. కుటుంబ పరిధిలోనూ, అదేవిధంగా విస్తృత సమాజంలోనూ అందుబాటు అనేది స్త్రీపురుష అసమానత్వాన్ని బట్టి కూడా నిర్ధారిస్తారు. స్వీకరణ ప్రధానంగా, తీసుకున్న ఆహారాన్ని శరీరం వినియోగించుకునేలా పారిశుధ్యము, సురక్షిత త్రాగునీరు అందుబాటులో వుండటంపై ఆధారపడి వుంటుంది.

135. ప్రత్యేకించి 1997–2004 మధ్య పైన పేర్కొన్న మూడు అంశాలతో కూడిన ఆహార భద్రతపై నయా వుదారవాద విధానాలు తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి. 1994–95 మధ్య, అలానే 2004–05 మధ్య ఆహార ధాన్యాల లభ్యతను చూసినట్లయితే ఆహార ధాన్యాల వుత్పత్తి పెరుగుదల ఏడాదికి 0.7శాతం వుండగా, జనాభా పెరుగుదల వార్షిక రేటు 1.6 శాతానికి తక్కువ కాకుండా వున్నది. ప్రజాపంపిణీ వ్యవస్థ ధరల పెరుగుదలలో తీవ్రత, వుపాధి పెరుగుదలలో మందకొడితనం, ఆరోగ్యం, విద్య ఖర్చులు పెరగటం, ఇంధనం తదితర ప్రాథమికావసరాల విషయంలో సబ్సిడీలలో కోతవల్ల కొనుగోలు శక్తిపై ఆధారపడిన ప్రజల ఆహార అందుబాటు కూడా యీ కాలంలో తీవ్రంగా దెబ్బతిన్నది. ఇకపోతే చివరగా చెప్పవలసిందేమంటే, ద్రవ్యలోటును అదుపు చేయటానికిగాను వ్యయం తగ్గింపుపై దృష్టి పెట్టటం వలన ప్రభుత్వ పెట్టుబడులలో కోతవుంటున్నది. ఆహార స్వీకరణ మెరుగుదలకు సహాయపడే సురక్షిత త్రాగునీరు, పారిశుధ్య సౌకర్యాలు అంతకంతకూ అందకుండా పోతున్నాయి.

136. 2004–05 నుండి ఆహార భద్రత విషయంలో కొంత మార్పు వచ్చింది. అనావృష్టి సంవత్సరమైన 2009–10ని మినహాయిస్తే యీ కాలంలో ఆహార ధాన్యాల వుత్పత్తి, దిగుబడులు పెరిగాయి. 2011–12లో 25.90 కోట్ల టన్నులుగా వున్న ఆహార ధాన్యాల దిగుబడి 2013–13లో 25 కోట్ల టన్నులకు తగ్గుదల వున్నప్పటికీ, 2013–14లో 26.30 కోట్ల టన్నుల దిగుబడులు వుండగలవని అంచనా వేయటం జరిగింది. మొత్తంమీద చూసినట్లయితే భారతదేశంలో 2006–07 నుంచి ఆహార ధాన్యాల లభ్యతలో పెరుగుదల వున్నది. 1994–95 నుండి 2004–05 మధ్య రోజువారీ ఆహార ధాన్యాల

తలసరి లభ్యత పడిపోగా, 2005లో 422.4 గ్రాముల నుంచి 2011 నాటికి 462.9 గ్రాములకు పెరిగింది. అంతకుముందు రోజుకు 504 గ్రాములకన్నా యిది తక్కువ అయినప్పటికీ ఒక మాదిరి పెరుగుదల వున్నదని చెప్పాలి.

137. ఆహార భద్రత అందుబాటులో సైతం కొంత మెరుగుదల వున్నది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎన్ఆర్ఇజిఏ) ఆమోదాన్ని పొందటం, ఎన్ఆర్ఇజిఎస్ క్రింద దానిని అమలు, 2003–04, 2007–08లో ఆర్థిక వ్యవస్థ సత్వర పెరుగుదలలో కీలక పాత్రను నిర్వహించాయి.

138. మూడు విడతలుగా (1992–93, 1998–99, 2005–06) జరిగిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం ఐదేళ్ళు లేదా అంతకన్నా తక్కువ వయసున్న పిల్లల్లోనూ, 13 నుంచి 49 ఏళ్ల మధ్య వయసున్న స్త్రీలలోనూ పౌష్టికాహార స్వీకరణలో చెప్పుకోదగిన పెరుగుదల లేదని తెలియ వస్తున్నది. పిల్లల్లో రక్తహీనత, వయసుకు తగినట్లుగా బరువు లేకపోవడం వుండగా, స్త్రీలలో రక్తహీనతతోపాటు, నిరంతరం బలహీనత వుంటున్నది. అయితే 2005–06 తరువాత యిలాంటి సమాచారం లభ్యం కాలేదు. అధికారికంగా రెండు సూచికలు లభిస్తున్నాయి. సురక్షిత త్రాగునీరు, మరుగుదొడ్లు అనేవే యీ సూచికలు. 2001–2011 మధ్య యీ సూచికలకు సంబంధించి లభిస్తున్న అధికారిక సమాచారం సంతృప్తిని కలిగించేది కాదు. భారతీయులలో అత్యధికులకు పౌష్టికాహారం సంతృప్తిగా అందటం లేదు.

139. నయా వుదారవాద సంస్కరణల కింద జరిగిన ఆర్థిక పురోగతి ఆహార, పౌష్టికాహార భద్రతను చెప్పుకోదగిన విధంగా మెరుగుపరచలేకపోయింది. ఆహార భద్రత కోసం వామపక్ష రాజకీయ శక్తులు, తదితరులు తెచ్చిన ఒత్తిడితో ప్రభుత్వ వ్యయము, ప్రభుత్వ జోక్యము వలన యీ మాత్రమైనా పెరుగుదల వున్నది. మనకు అందుబాటులో వున్న సమాచారం ప్రకారం పిల్లలు, స్త్రీలు, దళితులు, ఆదివాసీలు, ముస్లింలు ఎక్కువగా పౌష్టికాహార లేమితో బాధపడుతున్నట్లు తెలుస్తున్నది. పౌష్టికాహార భద్రతపై ప్రచారాందోళన కొనసాగించాలి. సామాజిక, స్త్రీపురుష కోణాన్ని కూడా కలుపుకు రావాలి.

### *ప్రభుత్వ పథకాలు*

140. ప్రజాందోళనల కారణంగా ఒత్తిడికి లొంగిన ప్రభుత్వం జాతీయ గ్రామీణ వుపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం వంటివాటిని తీసుకువచ్చింది. మధ్యాహ్న భోజన పథకం, ఐసిడిఎస్ వంటివాటిని ప్రభుత్వం విస్తరించిందంటే

అందుకు కూడా ప్రజాందోళనలే కారణం. హక్కుల సముపార్జనకు, మరింత రాజకీయ పురోగమనానికీ వీలుగా పైవుదాహరణలన్నిటా ప్రజా సమీకరణకు అవకాశాలు నిలచే వున్నాయి. ఇదేవిధంగా, వ్యవసాయానికి సంబంధించిన రాష్ట్రీయ కృషివికాస్ యోజన, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ, జాతీయ గ్రామీణ జీవన సంస్థ, జాతీయ ఆహార భద్రతా సంస్థ, వీటితోపాటే యింకావున్న రకరకాల పథకాలు, కార్యక్రమాలన్నీ పోరాటాలకు అవకాశాలను కల్పిస్తున్నాయి, అలా చేయగలిగినపుడు రైతాంగానికీ, గ్రామీణ శ్రామికులకూ ప్రయోజనాలు సిద్ధించగలవు. మనం సమర్థవంతంగా జోక్యం చేసుకోగలిగితే రాజకీయ సమీకరణకు యివి ప్రధానమైన సాధనాలుగా మారగలవు.

***సహకార సంఘాలు, యితర చొరవలు***

141. నయా వుదారవాద విధానాలకు వ్యతిరేకంగా చిన్న, మధ్యతరహా రైతులు పోరాడేలా వారికి ప్రోత్సాహాన్నిచ్చి, అధికారాన్ని అందుకునేలా తోడ్పాటునివ్వాలి. ఈ అంశాన్ని దృష్టిలో వుంచుకుని వుత్పత్తి, విలువ ఆధారిత, మార్కెటింగ్ రంగాలలో ప్రత్యేక సహాయక బృందాలను, రైతు సహకార సంఘాలను స్థాపించి, సానుకూల పరిస్థితులు ఎక్కడున్నాయో పరిశీలించాలి. శాస్త్రీయ పరిజ్ఞానాన్ని యిచ్చిపుచ్చుకోవటం ద్వారా వ్యవసాయోత్పత్తులను పెంచుకునేలా రైతాంగానికి సూచనలివ్వాలి.

***పేదరికం***

142. ఆదాయ లేమిని అంచనా వేయడానికిగాను భారత ప్రభుత్వం ఆదాయాలకు బదులు వినియోగ వ్యయాన్ని లెక్కిస్తున్నది. ఆ విధంగా భారతదేశంలో పేదరికాన్ని కుదించిన గీటురాళ్ళను ఆధారం చేసుకుని అంచనా వేస్తున్నారు. మొత్తంమీద గౌరవప్రదమైన జీవితానికి కావలసిన కనీస సూచికలనుగానీ, వుత్పత్తి, వుపాధుల్లో సంభవిస్తున్న ఒడిదుడుకులనుగానీ గమనంలోకి తీసుకోకుండానే యీ అంచనాలను వేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో పేదరిక అంచనాల లక్ష్యాన్నే విస్మరిస్తున్నారు. దీర్ఘకాలిక పేదరికాన్ని అవగాహన చేసుకుని, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల కేటాయింపు, 'అర్హత కలిగిన లబ్దిదారులను' ఎంపిక చేయటం వంటివాటిని విస్మరిస్తున్నారు. పేదరికాన్ని లెక్కించటానికి వినియోగించిన ఆదాయ గీటురాళ్ళనే సబ్సిడీ ఆహార ధాన్యాలకు, గృహవసతి, సబ్సిడీపై యిచ్చే గృహ విద్యుత్‌కు లేదా సూక్ష్మ రుణాలకు వుపయోగిస్తున్నారు. దారిద్ర్య రేఖ వుద్దేశ్యమే మరుగునపడుతున్నది,

దీనిని ప్రమాణంగా తీసుకుని జనాభాలో అత్యధికులను సంక్షేమ కార్యక్రమాలకు దూరం చేస్తున్నారు. అధికారికంగా పేదల సంఖ్యను తగ్గించటానికై దారిద్ర్యరేఖను మార్చుతున్నారు. మన అభిప్రాయం ప్రకారం అధికారిక దారిద్ర్య రేఖ అనేది దుర్భర దారిద్ర్యాన్ని సూచించేది, అంతేగాని సంక్షేమ కార్యక్రమాలకు లబ్దిదారులను గుర్తించటానికీ లేదా తొలగించటానికి దీనిని గీటురాయిగా తీసుకోవటం మనకు ఎంతమాత్రం సమ్మతికాదు.

143. నయా వుదారవాద కాలంలో ఆదాయ దారిద్ర్యం నికరంగా తగ్గిన జాడలేమీ లేవు. ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయమేమంటే, గత రెండు దశాబ్దాలలో జిడిపీ పెరుగుదల రేటు ఎక్కువగా వుండగా, గ్రామీణ పేదరికం తగ్గుదల చాలా మందకొడిగా వున్నది. పైగా గ్రామీణ ప్రాంతంలో అసమానతలను వుదారవాద విధానాలు ఎక్కువ చేస్తున్నాయి. 'ద్రవ్య పొదుపు' పేరుతో పేదల అనుకూల విధానాలను కుదిస్తున్నారు.

144. ఒకదాని తరువాత మరో గ్రామంలో క్షేత్రస్థాయిలో ఎఫ్ఏఎస్ (వ్యవసాయ అధ్యయనాల సంస్థ) జరిపిన సర్వేల ప్రకారం గ్రామీణ జనాభాలో గణనీయమైన భాగం కాయకష్టం చేసే శ్రామికుల, పేదరైతుల ఇండ్లే ఎక్కువగా వున్నాయి. వీరంతా దుర్భర దుస్థితిలో నివసిస్తున్నారు. ఏ నాగరిక సమాజంతో పోల్చి చూసినా వీరిని అత్యంత నిరుపేదలుగానే లెక్కించవలసి వుంటుంది.

***విద్య***

145. గ్రామీణ భారతంలోని సామాజిక-ఆర్థిక వెనుకబాటుతనం కొనసాగుతూ భారతీయ జనాభాలో అత్యధిక భాగాన్ని విద్యకు, శాస్త్ర విజ్ఞానానికి దూరం చేస్తున్నది. జాతీయ స్థాయిలో సార్వత్రిక ఉచిత నిర్బంధ పాఠశాల విద్యను ప్రవేశపెట్టటంలో చోటుచేసుకున్న వైఫల్యం స్వాతంత్ర్యానంతర దేశంలో ఘోర వైఫల్యంగానే పరిగణించాలి. అభివృద్ధి నిరోధకత్వమూ, మూఢ విశ్వాసాలు తరచుగా దుర్మార్గ రూపంలో వ్యక్తం అవుతూ గ్రామీణ జనాభాలో అనేకమందిని అతలాకుతలం చేస్తున్నాయి. మొత్తంమీద చూసినట్లయితే ప్రజల అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రత్యేకించి స్త్రీలు సామాజిక అణచివేతకు బలిపశువులుగా మారుతున్నారు.

146. నయా వుదారవాద సంస్కరణలు విద్యను బాలవాడల నుండి అన్ని స్థాయిల్లోనూ ప్రైవేటీకరించి, వ్యాపారమయం చేశాయి. విద్యారంగంలో కేంద్ర, రాష్ట్రాల వుమ్మడి వ్యయం జిడిపీలో 6శాతానికి పెంచుతామన్న యుపిఏ ప్రభుత్వ

వాగ్దానం యింతవరకు నెరవేరలేదు. కనీసం 4 శాతానికి కూడా చేరలేదు. ఆర్థిక కేటాయింపులను గానీ, చట్టపరమైన తదనంతర చర్యలనుగానీ కేంద్ర ప్రభుత్వం చేపట్టకపోవటంతో విద్యాహక్కు ప్రహసనంగా మారిపోయింది.

147. ఆర్థికాభివృద్ధి వలన అక్షరాస్యత రేటులో కొంతమేరకు ప్రగతి కన్పించింది. పాఠశాలలో చేరిక, హాజరు పెరిగాయి. అయితే నెమ్మదిగానే పెరుగుతున్నది. నిరక్షరాస్యతను ఒక పద్ధతి ప్రకారం తగ్గించి చూపుతున్న జనాభా లెక్కల ప్రకారం 2011లో 27.3 కోట్లమంది భారతీయులు నిరక్షరాస్యులుగా వున్నారు. ధనికులకు–పేదలకు; హిందూ అగ్రకులాలకు–దళిత ఆదివాసీ, ముస్లింలకూ మధ్యా; పురుషులకూ–స్త్రీలకూ మధ్యా; పట్టణ–గ్రామీణ ప్రాంతాలకు మధ్యా విద్యా విషయమై పూడ్చలేని అగాథాలే వున్నాయి. గ్రామాల్లో ఎఫ్ఏఎస్ నిర్వహించిన సర్వే ప్రకారం అత్యధిక కుటుంబాలకు చెందినవారు విద్యకు దూరమవుతున్నారు. స్త్రీలలో సగంమంది లేదా అంతకన్నా ఎక్కువమంది వానాకాలపు చదువులతోనే ఆపివేశారు. ఒక్క గ్రామాన్ని మినహాయిస్తే (14 గ్రామాల సమాచారం సేకరించారు) మిగిలిన వాటిల్లో 6–14 ఏళ్ళ వయసు మధ్య వారిలో సార్వత్రిక హాజరు లేదు. ఎనిమిదేళ్ళు వచ్చేవరకు ఉచిత నిర్బంధ విద్య అన్న రాజ్యాంగ హామీ నెరవేరలేదు. సార్వత్రిక అక్షరాస్యతగానీ, సార్వత్రిక హాజరుగానీ అనుకున్న లక్ష్యాలకు సమీపానికి కూడా రాలేదు. సంపన్న (ప్రధానంగా దళితేతర, ఆదివాసీయేతర, వెనుకబాటుతనం లేని హిందూ అగ్ర కులాలు) కుటుంబాలు మాత్రం యిందుకు మినహాయింపు.

148. అందుబాటులో వున్న సర్వేల సమాచారం ప్రకారం కొన్నేళ్ళపాటు పాఠశాల విద్యను అభ్యసించిన వారిలో అత్యధికులు నిరుపేదలు. గత రెండు దశాబ్దాల కాలంలో జిడిపీ పెరుగుదల రేటు చాలా ఎక్కువగా వుంది. కాని అవిద్యను తగ్గించటానికి యిది దారితీయలేదు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో దోపిడీకి, సామాజిక అణచివేతకూ, స్త్రీలకూ విద్య అందటం లేదు. గ్రామీణ ప్రాంతాలలో మనం పనిచేసేటపుడు శ్రామికులలో నిరక్షరాస్యతను పారద్రోలటానికి కృషి చేయాలి.

149. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు తగ్గిపోతున్నట్లు తమిళనాడు వంటి రాష్ట్రాల నుంచి వచ్చిన సమాచారం తెలుపుతున్నది. అనిశ్చితమైన నాణ్యత, అత్యధిక ఫీజులు వుండే ప్రైవేటు పాఠశాలలకే తల్లిదండ్రులు తమ పిల్లలను పంపుతున్నారు. నాణ్యమైన విద్యను అందించేటందుకుగాను మౌలిక

సదుపాయాలను బలోపేతం చేయటంలోనూ, శిక్షణ పొందిన వుపాధ్యాయులను తగినంతమందిని నియమించటంలో ప్రభుత్వం విఫలమైంది. 'ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయండి, నాణ్యమైన విద్యకు హామీ యివ్వండి', అన్న నినాదాన్ని మనం ముందుకు తీసుకువెళ్ళాలి.

150. మొరటైన వాణిజ్యీకరణకు, నిరంకుశ కేంద్రీకరణకు, అంతులేని అవినీతికి బలిపశువులుగా మారిన వాటిలో వున్నత విద్య ఒకటి. భారత వైద్యమండలి, అఖిల భారత సాంకేతిక విద్యామండలి గుట్టు బహిర్గతమైంది, ఉన్నత స్థాయిలో నియమరాహిత్యానికి, అవినీతికి ఆలవాలమైన ప్రైవేటు విద్యా సంస్థలు అత్యధిక ఫీజులను వసూలు చేస్తూ, విద్యార్థుల, ఉపాధ్యాయుల, సిబ్బంది ప్రజాస్వామ్య హక్కులను హరిస్తూ అతి పేలవమైన విద్యను అందిస్తున్నాయి. దీని ప్రభావం గ్రామీణ కుటుంబాలపై పడుతున్నది. పార్టీ యీ సమస్యను చేపట్టాలి.

151. గ్రామీణ భారతంలో విద్య అందుబాటులో లేకుండా పోతున్నప్పటికీ విద్యారంగానికి చాలినంతగా నిధులను పెంచటానికి ప్రభుత్వం సుముఖంగా లేదు. పాఠశాల విద్యకు సైతం విపరీతమైన ఖర్చు అవుతున్నది. అటు ప్రభుత్వ పాఠశాలలు, యిటు నియమ నిబంధనలను పట్టించుకోని ప్రైవేటు పాఠశాలలు నాణ్యతలేని విద్యనే అందిస్తున్నాయి. కనుక గ్రామీణ ప్రాంతంలోని పార్టీ, ప్రజా సంఘాలు విద్యా సమస్యను తీసుకుని అత్యుత్తమ విద్యావ్యవస్థ కోసం జనాభాలో ఆర్థికంగా కుంగిపోయిన, సామాజికంగా అణగిపోయిన తరగతులను సమీకరించాలి.

**ఆరోగ్యం**

152. కాలక్రమంలో ఆరోగ్య సూచికలలో మెరుగుదల కన్పించింది. జీవన ప్రమాణాలు, శిశుమరణాలు, ప్రసూతి మరణాలు తగ్గాయి. అయితే యీ సూచికలు రాష్ట్ర వ్యాప్తంగా ఒకటిగా లేకుండా రకరకాలుగా వున్నాయి. నివాసము (గ్రామీణ-పట్టణ ప్రాంతాలు), లింగభేదము యీ తేడాలకు కారణాలుగా వున్నాయి. సామాజిక బృందాలలో కూడా వ్యత్యాసాలు వున్నాయి. అయితే యీ తేడాపాడాలకు సంబంధించి సమాచారం అందుబాటులోకి రాలేదు.

153. నయా వుదారవాద సంస్కరణల కాలంలో ప్రభుత్వ రంగంలోని ఆరోగ్య సదుపాయాలు, సేవలు కొద్దిపాటిగా విస్తరించాయి. అయితే అవసరాలతో పోల్చుకుంటే యీ విస్తరణ ఎందుకూ చాలదు. వనరుల సమీకరణకు

అవకాశాలు వున్నప్పటికీ బూర్జువా–భూస్వామ్య ప్రభుత్వం వీటిని వుపయోగించుకోవటం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వుమ్మడి వ్యయం జిడిపీలో 1 శాతం నుంచి 3 శాతం వరకు పెంచుతామని యుపిఏ–1 చేసిన వాగ్దానం యిప్పటి వరకు నెరవేరలేదు. నయా వుదారవాద సంస్కరణల దశలో ఆరోగ్య వ్యయం బాగా పెరిగినప్పటికీ యీ పరిస్థితే కొనసాగుతున్నది.

154. నయా వుదారవాద కాలంలో ఆరోగ్య సూచికల్లోనూ, అదేవిధంగా ప్రభుత్వ రంగంలోని ఆరోగ్య మౌలిక సదుపాయాలలోనూ, సౌకర్యాలలోనూ చోటుచేసుకున్న కొద్దిపాటి మెరుగుదల నయా వుదారవాద సంస్కరణల కారణంగా ఆరోగ్య రంగానికి సంభవించిన చెడుగులను దాయలేదు. కీలకమైన ఒక పరిణామం ఏమంటే ఆరోగ్య వ్యయం అమితంగా పెరగటం. ప్రత్యేకించి గ్రామీణ పేదలు దీనివల్ల బాగా దెబ్బతింటున్నారు. వీరి ఆదాయాల మొత్తంలో వైద్య ఖర్చులకే ఎక్కువ భాగం పోతున్నది. పైగా వీరికి బీమా సౌకర్యం పరిమితంగానే వున్నది. అధికారిక సమాచారం ప్రకారమే, గ్రామీణ కుటుంబాలకు చెందినవారు వైద్యం నిమిత్తం సొంతంగా ఖర్చుచేస్తున్నారు. 2005లో 61 శాతం కాగా, 2012 నాటికి యిది 79 శాతానికి పెరిగింది. 2000–2012 మధ్య గ్రామీణ కుటుంబాల వైద్య ఖర్చులు అట్టడుగునున్న 20శాతం నిరుపేదలతో 51 శాతం నుంచి 73 శాతానికి పెరిగాయి. మరీ నిరుపేదలుగా వున్నవారికి 20 శాతం, ఎస్.సి కుటుంబాలకు 58 శాతం నుంచి 76 శాతానికి, ముస్లిం కుటుంబాలకు 67శాతం నుంచి 83 శాతానికి పెరిగాయి. గ్రామీణ కుటుంబ సభ్యుల తలసరి వైద్య ఖర్చు విపరీతంగా పెరిగిపోయింది. 2000ల సంవత్సరంతో పోల్చుకుంటే 2012 నాటికి 60 పెరిగింది. అంతకంతకు పెరుగుతున్న వైద్యఖర్చుల కారణంగా కాయకష్టం చేసేవారు, వృత్తి పనివారు తమ ఆదాయాలలో ఎక్కువ భాగాన్ని ఆరోగ్యం కోసం వెచ్చించ వలసివస్తున్నది. జనసమీకరణ సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలోను, పట్టణ పేదలలోను పనిచేసే పార్టీ శాఖలు, ప్రజాసంఘాలు దీనిని గుర్తుంచుకోవాలి.

155. ఆరోగ్య విధానంలో వ్యాధి నిరోధక అంశం మరింతగా పక్కకు పోయింది. త్రాగునీరు, పారిశుద్ధ్యము, పౌష్టికాహారం విషయంలో కొద్దిపాటి పురోగతి వున్నప్పటికీ యిప్పటికీ యివి అరకొరగానే వున్నాయి. ఆరోగ్య సంరక్షణకు సంబంధించి కులము, లింగభేదము, గ్రామీణ–పట్టణ ప్రాంతాలు, ప్రాంతీయ

అసమానతలను దృష్టిలో వుంచుకుని తగిన చర్యలను చేపట్టాలి. ప్రాథమిక, వ్యాధి నిరోధక, ఆరోగ్య సంరక్షణ చర్యలు తీసుకునేలా ప్రచారాందోళనలను నిర్వహించాలి.

***గృహ సదుపాయాలు***

156. 1948 నాటి సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన యిలా చెప్తున్నది: 'ఆరోగ్య సంరక్షణకు, తాను, తన కుటుంబమూ క్షేమంగా జీవించటానికి అవసరమైన జీవన ప్రమాణాలకు ప్రతి ఒక్కరికీ హక్కు వున్నది'. గృహవసతికి సంబంధించి చూసినట్లయితే గ్రామీణ భారతంలో యీనాడు పైన పేర్కొన్న హక్కు తీవ్ర వుల్లంఘన జరుగుతున్నది. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామీణ ప్రాంతంలో 6.5 కోట్ల గృహాలు కచ్చా ఇళ్ళేనని (తాటాకు కప్పు వున్నవి), 7.9 కోట్లు మట్టిగోడలతోనే, 10.6 కోట్ల ఇళ్ళలో లోపలి నేలంతా కేవలం మట్టితో అలికినవేనని తెలుస్తున్నది. దళిత, ఆదివాసీ, ముస్లింల ఇళ్ళు యితర సామాజిక తరగతుల వారికన్నా దారుణంగా వున్నాయి. దాదాపు 9.5 కోట్లకు పైగా ఇళ్ళు ఒకదానిపై ఒకటున్నట్లుగా వున్నాయి.

157. ఇల్లంటే కేవలం పైన ఒక కప్పు, చుట్టూ నాలుగు గోడలు మాత్రమే కాదు. మరుగుదొడ్డి, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం వుండాలి. ఆరు రాష్ట్రాలలో 15 గ్రామాలలో సర్వే చేసి యీ క్రింది సౌకర్యాలు ఎన్ని ఇళ్ళలో వున్నాయో అంచనా వేసింది : పక్కా పై కప్పు, గోడలు, లోపలి గచ్చు, రెండు గదులు, లోపల లేదా బయటి వైపున నీటి వనరు, విద్యుత్ సౌకర్యము, మరుగుదొడ్డి వుండాలి. సర్వే చేసిన వాటిలో 94 శాతం దళితుల ఇళ్ళు, 96 శాతం ముస్లింల ఇళ్ళు, 100 శాతం ఆదివాసీల ఇళ్ళు పైన చెప్పుకున్న సౌకర్యాలు లేకుండానే వున్నాయి. ఇతర తరగతుల వారి విషయానికి వస్తే 78 శాతం ఇళ్ళకు పై సౌకర్యాలు లేవు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆరోగ్యానికీ, సంక్షేమానికీ తగిన సౌకర్యాలు వున్న ఇల్లు ఎంతైనా అవసరం. నయా వుదారవాదం చెప్పుకుంటున్నట్లుగా 'అత్యధిక' జిడిపీని సాధించుకున్న రెండు దశాబ్దాల అనంతరం కూడా యిదీ పరిస్థితి. గ్రామీణ ప్రాంతాలలో ఇంటి వసతి, సౌకర్యాలు అనేవి రాజకీయ కార్యక్రమంలో ప్రధానాంశంగా వుండాలి.

***వాతావరణ మార్పులు, వ్యవసాయము, గ్రామీణ విపత్తు నివారణ***

158. వాతావరణంలో మార్పుల బెడదతో వ్యవసాయానికి సంబంధించి కొత్తగా ఆందోళన ప్రారంభమైంది. మొత్తంమీద చూసినట్లయితే

వ్యవసాయోత్పత్తులపైనా, ప్రత్యేకించి రైతుల, వ్యవసాయ కార్మికుల జీవితాలపైనా తీవ్రమైన దుష్ప్రభావం పడనున్నది. వాతావరణంలో వచ్చే మార్పులు వాతావరణంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపనున్నాయి. ఈ విషయం ప్రపంచంలో కొన్నిచోట్ల శాస్త్రీయంగా రుజువైంది.

159. వాతావరణంలో మార్పులు వ్యవసాయ వుత్పత్తులపై ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక ప్రభావాలను చూపుతాయి. తేమశాతం, చీడపీడలు, కలుపు మొక్కలు, పౌష్టిక గుణాల లభ్యత వంటివన్నీ ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. రెండు సెంటీగ్రేడ్ డిగ్రీల వుష్ణోగ్రతలు పెరిగితే గోధుమ హెక్టారుకు 0.75 టన్నుల దిగుబడి తగ్గుతుంది. ఇతర పంటల విషయంలో కూడా యిలానే జరుగుతుంది. మన దేశంలో సగటు వుష్ణోగ్రతలు అంతకంతకు పెరుగుతున్నాయి. 0.8 సెంటీగ్రేడ్ నుండి 1.2 సెంటీగ్రేడ్ వరకు యీ పెరుగుదల వుంటున్నది. రుతుపవనాల కదలికలో కూడా యీ తేడా వుంటుంది.

160. వాతావరణంలో వచ్చిన మార్పులు భారతదేశంలోని వ్యవసాయోత్పత్తిపై ఏమైనా ప్రభావాన్ని చూపాయా? లేదన్నదే యీ ప్రశ్నకు వచ్చే సమాధానం. అయితే, కొంతమేరకు ప్రభావాన్ని చూపిన ఘటనలు కొన్ని వున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లో ఆపిల్ దిగుబడుల్లో తేడాలు వచ్చాయి. అదేవిధంగా వుష్ణోగ్రతలు పెరగటంతో పశ్చిమ బెంగాల్‌లో చెరువుల్లో సాగుచేసే ఒకరకం చేప గ్రుడ్లు పెట్టే సమయం నెలరోజుల పాటు పెరిగింది. దీనివల్ల వుత్పాదకతలో మార్పులు వచ్చాయి. వేసవి కాలంలో మరింతగా వుష్ణోగ్రతలు పెరగటం వలన ఏవైనా సమస్యలు వచ్చే అవకాశం వున్నది. 1995 తరువాత పంజాబు, హర్యానా, ఉత్తర ప్రదేశ్‌లలో సాగుచేసే రబీ, గోధుమ పంట దిగుబడుల్లో మార్పు వచ్చింది.

161. వ్యవసాయార్థిక వ్యవస్థలో ప్రస్తుతమున్న వుత్పత్తి సంబంధాలలో వాతావరణ పరమైన మార్పులు కారణంగా భూస్వాములు, ధనిక రైతులకన్నా చిన్న రైతులు ఎక్కువగా దెబ్బతింటారు. ప్రకృతి విపత్తులు, ఆర్థిక చిక్కులపుడు కూడా యిదే పరిస్థితి ఎదురవుతుంది. రైతాంగంపై వాతావరణంలో కలిగే మార్పుల ప్రభావ తీవ్రతను మనం గుర్తించి, ఈ సమస్యకు వ్యవసాయక సంబంధాలలో మార్పులు, రైతులకు తగినంత ప్రభుత్వ సాయములనే పరిష్కారంగా చూపాలి.

162. స్థిర వ్యవసాయాన్ని చిన్నతరహా వ్యవసాయంతో పోల్చకూడదు. చిన్నతరహా వుత్పత్తులను మరింత సమర్థవంతమైనదనిగానీ లేదా వాతావరణపరంగా

మరింత స్థిరమైనదనిగానీ అతిశయంగా చెప్పకూడదు. స్థిర వ్యవసాయం గురించిన ఏ దృక్పథమైనా రైతుల వుత్పత్తులకు ఆర్థికంగా ప్రయోజనాన్ని కల్పించేదిగానూ, వాతావరణాన్ని తట్టుకునేదిగానూ వుండాలి. ఇదే సమయంలో వుత్పత్తి సంబంధాలలో మార్పులు, పెట్టుబడుల పెంపుద్వారా వ్యవసాయంలో వుత్పాదక శక్తుల పెరుగుదల అవసరాన్ని గుర్తించాలి. స్థిర వ్యవసాయాన్ని గురించిన యీ అవగాహన గాడ్గిల్, కస్తూరిరంగన్ కమిటీలు లేవనెత్తిన విషయాలను అర్థం చేసుకోవడానికి మార్గదర్శకంగా వుంటుంది.

163. గతంలో కూడా ఆపదలు, విపత్తులు సంభవించాయి. అయితే, వాస్తవమేమంటే వాతావరణంలో వచ్చిన మార్పులు తీవ్రమైన దుస్సంఘటనలు సంభవించే అవకాశాలను పెంచటంతోపాటు గ్రామీణ విపత్తుల నిర్వహణ అవసరాన్ని మరింతగా పెంచాయి. ఈ తరహా విపత్తుల (ప్రకృతిపరంగా లేదా మానవ తప్పిదాలవల్ల సంభవించేవి) ప్రభావం వ్యవసాయోత్పత్తులపైనా, ప్రస్తుతం వునికిలోవున్న ఆర్థిక-సామాజిక క్రమంపై ఆధారపడిన వివిధ తరగతులకు చెందిన గ్రామీణ ప్రజానీకంపైనా గణనీయంగా పడుతుంది. భారతదేశంలో ఒక్క వరదల కారణంగానే యేటా సగటున 3.243 కోట్లమంది (కేంద్ర జల కమిషన్ అందచేసిన సమాచారాన్ని -1953-2011- ఆధారం చేసుకుని) ప్రజలు దెబ్బతింటున్నారు. అలానే, సగటున 72.25 లక్షల హెక్టార్ల భూమి దెబ్బతిన్నది. ఇందులో 3.7 లక్షల హెక్టార్ల పంటభూమి ప్రతియేటా దెబ్బతింటున్నది. 2005లో అయితే కోటీ 20 లక్షల హెక్టార్ల పంటభూమి వరదల్లో చిక్కుకున్నది. వివిధ సూచికల ప్రకారం దెబ్బతిన్న మొత్తం ప్రాంతం, దెబ్బతిన్న ప్రజల సంఖ్య, ప్రాణాలు కోల్పోయిన పశువుల సంఖ్య, ధ్వంసమైన ఇళ్ళు 1970ల చివరలో ఎక్కువగా వున్నాయి. దీనంతటి ప్రకారం సాపేక్షకంగా చూసినట్లయితే ప్రాణ నష్టంకన్నా పంటనష్టం ఎక్కువగా వున్నది.

164. ప్రకృతి విపత్తులు సంభవించినపుడు వుపశమన చర్యలను తీసుకోవటంలోనూ, నష్టపోయిన వ్యవసాయ వుత్పత్తులకు పరిహారాన్ని చెల్లించటంలోనూ భారతదేశం చాలా వెనుకబడి వున్నది. వ్యవసాయానికి యిచ్చే నష్టపరిహారం చాలినంతగా వుండటం లేదు. పైగా యీ పరిహారం కౌలుదారులకు అందటం లేదు. పనులు కోల్పోయిన శ్రామికులకు కూడా నష్టపరిహారం అందటం లేదు. పేద, మధ్యతరగతి రైతులు, గ్రామీణ శ్రామికులు ప్రకృతి విపత్తులకు రకరకాలుగా గురవుతున్నారు.

165. నదులు లేదా సముద్రం పొంగి వుప్పెన వచ్చినపుడు గ్రామీణ కుటుంబాలు అనేక యిబ్బందులను ఎదుర్కొంటున్నట్లు నేషనల్ శాంపిల్ సర్వేలో వెల్లడైంది. వరదలకు గ్రామీణ ప్రాంతంలో ఇళ్ళు నేలమట్టం అవటం ఎక్కువగా సంభవిస్తున్నది. తలసరి ఆదాయం తక్కువగా వున్నవారే వుప్పెనకు ఎక్కువగా గురవుతున్నారు.

166. విపత్తులు సంభవించినపుడు సహాయక చర్యలను చేపట్టటం, పునరావాసానికి తగినన్ని వనరులను సమకూర్చుకోవటం, విపత్తుల ప్రమాదాన్ని తగ్గించే చర్యలను చేపట్టటం వంటివన్నీ గ్రామీణ జనాలకు చాలా ముఖ్యమైనవి. ఈ సందర్భంగా గమనించవలసిన ముఖ్య విషయం ఒకటున్నది. అదేమంటే, విపత్తులు సంభవించినపుడు పల్లె ప్రజలు తాము పోగొట్టుకునే వాటన్నిటికీ వాతావరణమే కారణం కాదు. పల్లెల్లో వున్న సామాజికార్థిక నిర్మాణమే పేదలపై ప్రభావాన్ని చూపుతున్నది.

167. విపత్తులు సంభవించినపుడు మనం ప్రజలతో వుండి చేయగలిగిన సహాయాన్ని చేయగలగాలి. విపత్తులు సంభవించడానికీ, పేదలపై వాటి ప్రభావానికీ, విపత్తుల నివారణకు, విపత్తులు సంభవించినపుడు నయా వుదారవాద విధానాల ద్వారా చేపట్టే వుపశమన చర్యలు అరకొరగా వుండటం, నిజమైన పర్యావరణ చిక్కులు వంటివాటన్నిటికీ మధ్యగల సంబంధాలను ప్రజలకు వివరించాలి.

## 7. సింహావలోకనం–ముగింపు

168. ఈ నివేదిక ప్రధానంగా భారతదేశంలోని ప్రధాన వ్యవసాయ వర్గాల యొక్క సామాజికార్థిక లక్షణాలలో వచ్చిన మార్పులను, ప్రత్యేకించి 1991లో పెట్టుబడి సరళీకరణ విధానాలనూ, ప్రపంచీకరణ విధానాలను ప్రవేశపెట్టిన అనంతరం చోటుచేసుకున్న పరిణామాలను వివరించటానికీ, విశ్లేషించడానికి యీ నివేదికలో ప్రయత్నించాము.

169. ముందుగా మేము నయా వుదారవాద విధానాలను ప్రవేశపెట్టిన అనంతరం కల్గిన ప్రధాన మార్పులను అవలోకనం చేస్తాము (పేరా–4).

### ఉత్పాదక శక్తులు

170. తరువాత యీ నివేదిక గ్రామసీమల్లోని వుత్పాదక శక్తుల అభివృద్ధిలో వచ్చిన యిటీవలి మార్పులను చర్చించింది (6నుంచి10 వరకుగల పేరాలు). ఇందులో ప్రధానమైన అంశమేమిటంటే (నివేదిక అంతటా కూడా కన్పించేది)

వ్యవసాయ సంక్షోభం అనేది వర్గాలు, పంటలు, ప్రాంతాలు, కాలాల మధ్య వేర్వేరుగా వుంటుందని వివరించటం. ఇది అందరికన్నా ఎక్కువగా అసంఖ్యాక పేదలను, పేద, మధ్యతరగతి రైతులను, కాయకష్టం చేసే శ్రామికులను ఎక్కువగా దెబ్బతీస్తుంది. వివరంగా చెప్పాలంటే, 1991 నుంచి 1997 వరకు వున్న దశ సరళీకరణ యొక్క తొలిదశను తెలియచేస్తుంది. ఈ దశలోనే నూతన విధానాలు ప్రవేశించాయి. సరళీకరణ విధానాలు ప్రవేశించిన తరువాత, అంటే 1997 నుండి 2004 వరకు ఆర్థిక వ్యవస్థకూ, ప్రజలకు దుర్దినాలని చెప్పాలి. అంతకుముందు చోటుచేసుకున్న విధానపరమైన మార్పులు, పంటలు నష్టపోవటంతోనూ, అంతర్జాతీయంగా సరకుల ధరలు పతనం కావటంతోనూ కలసి అంతకు మునుపెన్నడూ ఎరుగని సంక్షోభాన్ని గ్రామసీమల్లో సృష్టించాయి (విడ్డూరమేమిటంటే యీ సంవత్సరాలనే "భారత్ ప్రకాశిస్తున్నది" అంటూ బిజెపీ వర్ణించింది). 2004 తరువాత వ్యవసాయ సూచికలు కొంత పుంజుకున్నాయి. వామపక్షాల ఒత్తిడితో తీసుకువచ్చిన విధానాల కారణంగా ఆర్థిక వ్యవస్థ కూడా ప్రభావితమైంది. అయితే, 2004 తరువాత సంభవించిన అభివృద్ధి అసమానమైనది, గ్రామసీమల్లోనూ యితరంగానూ వ్యత్యాసాలను పెంచింది.

### *వ్యవసాయక తరగతులు*

171. గ్రామీణ భారతదేశంలో ప్రస్తుతం వ్యవసాయ సంబంధాలలో ప్రాచీన సంస్థలు సామాజిక నిర్మాణాలతో పాటు, పెట్టుబడిదారీ అభివృద్ధి స్వభావం విస్తృతంగాను లోతుగానూ కనిపిస్తున్నది. ఈ ప్రపంచీకరణ యుగంలో కూడా భారతదేశంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలు ఒకే రకంగా అభివృద్ధి చెందలేదు. భూమి, ఇతర వ్యవసాయ ఆస్తుల కేంద్రీకరణ పెరిగింది; వ్యవసాయేతర ఆదాయం కూడా పెరిగింది. పల్లెల్లోని పెత్తందారీవర్గంలో గ్రామీణ ధనికులు భూస్వాములు, బడా పెట్టుబడిదారీ రైతులు, కాంట్రాక్టర్లు, పెద్ద వ్యాపారులు మిలాఖత్ అయి ఉన్నారు.

172. అందువలన వర్గపోరాటాన్ని, వ్యవసాయోద్యమాన్ని వృద్ధి చేసుకోవాలంటే భూస్వాములు, గ్రామీణ ధనికుల సంబంధాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని ఆధారం చేసుకుని నిర్మించుకోవాలి. భూస్వాముల, బడా పెట్టుబడి రైతుల బలం వారికి భూమిపై ఉన్న నియంత్రణే; అయితే వారు నియంత్రిస్తున్నది భూమిని మాత్రమేకాదు. వారు వడ్డీ వ్యాపారం, ధాన్యం మిల్లులు, పశుపోషణ

వ్యాపారాలు, ఆహారధాన్యాల స్పెక్యులేషన్, వ్యవసాయ పరికరాల పైన, ఉత్పత్తి రంగం పైన, రియల్ ఎస్టేటుపైన, నిర్మాణరంగంపైన, సినిమా థియేటర్స్ పైన పెట్రోల్ పంపుల పైన, రవాణా రంగం పైన, వ్యవసాయ పరికరాలు అద్దెకివ్వడం పైన, విద్యాసంస్థలపైనా అదుపు కలిగి ఉన్నారు.

173. రైతాంగం కేంద్రీకరించబడుతూండడం, దీనివలన పేద, మధ్యతరగతి రైతాంగం వ్యవసాయ వ్యవసాయేతర రంగాలలో కూలికి పనిచేసే కొత్త తరగతులు తయారవుతుండడం ఒక ముఖ్య లక్షణంగా కనిపిస్తున్నది. వ్యవసాయ వ్యవసాయేతర రంగాలలో కూలికి పనిచేసే తరగతులు గ్రామాలలో అధిక సంఖ్యలో ఉన్నారు. గ్రామాలలో గ్రామీణ ధనికులతో పోరాటమే ఇప్పుడు మన ప్రధాన కర్తవ్యము. ఇందుకు వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, మధ్య తరగతి రైతులు, వ్యవసాయేతర పనులు చేసే కూలీలు, చేతివృత్తులవారు, ఇతర గ్రామీణ పేదలు ఐక్యం అవ్వాల్సిన అవసరం ఉన్నది.

**నూతన పరిస్థితులలో భూమి, వ్యవసాయ సమస్యలు**

174. భూస్వామ్య విధానాన్ని రద్దు చేయాలనీ, భూస్వాముల భూములను వ్యవసాయ కూలీలకు, భూమిలేని పేద రైతులకు పంచిపెట్టాలన్న పిలుపు ఒక వ్యూహాత్మక లక్ష్యం. దీనిని జనతా ప్రజాతంత్ర విప్లవం పూర్తయినప్పుడు మాత్రమే సాధించగలం. ఇప్పటివరకు ప్రభుత్వ మిగులు భూములు, సీలింగ్ పరిమితికి మించి ఉన్న భూములు, బంజరు భూములు, అడివిభూములుగా మినహాయింపు పొందిన భూములను పంచమని మాత్రమే భూ పోరాటాలు జరుగుతున్నాయి. కానీ ఇప్పుడు భూ సమస్య కొత్త రూపాన్ని సంతరించుకుంది.

175. నూతన ఆర్థిక విధానాల అమలుతో బూర్జువా పార్టీల రాష్ట్ర ప్రభుత్వాలు భూ సంస్కరణల చట్టాన్ని వెనక్కు మళ్లించాయి లేదా నీరుగార్చాయి. భూ ఆక్రమణలు, కార్పొరేట్ల భూ ఆక్రమణలు చర్యలకు రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు పలకడం ఈ సమస్యను అత్యంత ప్రమాదకర స్థాయికి చేర్చాయి. కార్పొరేట్ల, రియల్ ఎస్టేట్ వ్యాపార తిమింగలాల నుండి భూములను రక్షించడమే ఈనాడు పెద్ద సమస్యగా ఉన్నది. భూసేకరణ ముఖ్యంగా గిరిజన భూముల సేకరణకు వ్యతిరేకంగా పోరాటాలు ఈమధ్యనే ముందుకు వచ్చాయి. గ్రామీణ పేదలకు ఇళ్ల పట్టాల కోసం జరిగే పోరాటాలు ఇప్పటి భూపోరాటాల మరో పార్శ్వం.

176. అంటే పేదతరగతులను – వ్యవసాయ కూలీలు, కష్టజీవులు, పేద రైతులు మనతో కలిసి రావాలంటే భూ సమస్యే కీలకమయిన సమస్య. అయితే

అధ్యయన బృందం పరిశీలించిన వాస్తవాలను చూసినట్లయితే భూస్వాములకు,పెట్టుబడిదారీ రైతులకు తమ ఆర్థిక కార్యకలాపాలనుండి వచ్చిన ఆదాయంలో భూమినుండి వచ్చిన ఆదాయం ఒక్కటే ప్రధానమయిన ఆదాయ వనరు కాదు. ఒక్కొక్కసారి ముఖ్యమయిన వనరు కూడా కాదు. పేద రైతులు గ్రామీణ పేదలను దోపిడీ చేసే ఈ భూస్వామ్య- పెట్టుబడిదారీ రైతాంగ వర్గానికి, పేద రైతులు, గ్రామీణ పేదలకు మధ్యనున్న వైరుధ్యం వారి వ్యవసాయ వ్యవసాయేతర కార్యకలాపాలలోనే వ్యక్తమవుతూవుంటుంది. అందువలన అణచి వేయబడుతున్న ఈ తరగతుల సమస్యలన్నీ తీసుకుని ఒక శక్తివంతమయిన ఐక్య ఉద్యమాన్ని నిర్మించాలి.

177. కేవలం రైతులకు మాత్రమే సంబంధించిన గిట్టుబాటు ధరలకు, రుణ మాఫీకి సంబంధించిన ఉద్యమాలను కొనసాగిస్తూనే మన ఉద్యమ దిశను వ్యవసాయ కార్మికులు పేద రైతులు, మధ్యతరగతి రైతులు, ఇతర కష్టజీవుల దిశకు మరల్చాలి. మన డిమాండ్లకు, భూస్వామ్య పెట్టుబడిదారీ రైతుల, వారి సంబంధీకుల డిమాండ్లకు మధ్య స్పష్టమయిన వ్యత్యాసం ఉండాలి. వ్యవసాయ కార్మిక వేదిక, రైతు వేదిక ఈ అవగాహనను సరిగా ప్రతిబింబం చేయగలగాలి. మనం రుణ మాఫీ, పరపతి సౌకర్యాలు, వ్యవసాయ పనిముట్లకు సబ్సిడీలు మొదలయిన డిమాండ్లను పెట్టేటప్పుడు అవి ముఖ్యంగా పేద, మధ్య తరగతి రైతులకు, వ్యవసాయ కూలీలకు, కాయకష్టం చేసుకునే వారికీ లాభం చేకూర్చేవిగా ఉండాలి. మనం భూస్వామ్య, పెట్టుబడిదారీ రైతుల డిమాండ్ల నుండి మన డిమాండ్లను విడగొట్టుకోవడమే కాక అందుకు వ్యతిరేకమయిన డిమాండ్లను పెట్టాలి.

178. కౌలుకి ఇచ్చే భూములు పెరిగాయి. కౌలు కాంట్రాక్టులు వైవిధ్యంగాను, సంక్లిష్టంగానూ ఉండడమే కాక ఎంతో దోపిడీ స్వభావం కలిగి ఉన్నాయి. సాధారణంగా పేద రైతుకుటుంబాలు, భూమిలేని పేద దళితులు ఎక్కువ కౌలుకి భూమిని పొందుతుంటారు. ఒక్క ఆంధ్రప్రదేశ్ మినహాయిస్తే మరెక్కడా మనం ఈ విషయంలో జోక్యం చేసుకోలేదు. కిసాన్ వేదిక, వ్యవసాయ కార్మికుల వేదిక జోక్యం చేసుకుని వారి ప్రయోజనాలు కాపాడాలి. కౌలు విధానంలోని వైవిధ్యాల దృష్ట్యా ఆయా నిర్దిష్ట ప్రాంతానికి, ఆ ఉద్యమానికి అవసరమయిన పిలుపులు ఆ ప్రాంతాలలో ఇవ్వాలి.

179. భూస్వామ్య పెట్టుబడిదారీ రైతులు, వారి మిత్రబృందం దోపిడీని రకరకాల

పద్ధతులలో కొనసాగిస్తారు– వేతనాలు తక్కువగా ఇచ్చి, వడ్డీ ఎక్కువగా వసూలు చేసి, ట్రాక్టర్లు, కోత యంత్రాలు ఇతర వ్యవసాయ పనిముట్ల అద్దెలు పెంచి, ఆహార ఉత్పత్తులు నిల్వ చేసుకునే గోదాముల అద్దెలు పెంచి, వ్యాపారాలలోను ఇతరత్రా వారికీ ప్రజలలో మంచి పలుకుబడి ఉంటుంది; గ్రామీణ ప్రాంతంలో అన్ని ప్రభుత్వ స్కీములను పేదలకు ఇచ్చే ఇళ్లతో సహా అన్నీ ఆక్రమించుకుంటారు; పేదలకోసం పెట్టిన ఈ స్కీముల నిధులు వారివైపు మళ్లించుకుంటారు. భూస్వాములకు గ్రామీణ ధనికులకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్మించడం ద్వారా ఈ సమస్యలనన్నిటిని తీసుకోవాలి.

180. గ్రామీణ ప్రాంతంలోని పోరాటాలలో ఒక ముఖ్యమయిన అంశం వివక్షత, సామాజిక అణచివేత. వ్యవసాయ సంఘాలన్నీ చదువుకోసం, ప్రజారోగ్యం కోసం, ఇంటి కోసం, శ్రమ జీవులలో బాధిత సామాజిక సమూహాలను ఒక ప్రాంతానికే పరిమితం చేయడానికి వ్యతిరేకంగా పనిచేయాలి. సామాజిక వివక్షత, అణచివేతలను గురించి ప్రతి ప్రాంతంలోని నిర్దిష్ట పరిస్థితులను అధ్యయనం చేసి నిర్దిష్టమయిన వ్యూహాలను రచించుకుని వర్గ పోరాటంలో వాటిని మమేకం చేయాలి.

181. గ్రామీణ ప్రాంతాల నుండి వలసలు రానురాను అధికం అవుతున్నాయి. దేశంలోని వేరు వేరు ప్రాంతాలలో వలసకార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి, గ్రామాలలోని వారి కుటుంబాల పరిస్థితుల గురించి నిర్దిష్టంగా అధ్యయనం చేయాలి; అప్పుడే పని ప్రదేశంలోను, జీవనానికి సంబంధించిన డిమాండ్లను రూపొందించగలం. వలస కార్మికుల సమస్యల సంక్లిష్టత దృష్ట్యా పార్టీ ప్రత్యక్షంగా కలగజేసుకుని వర్గ ప్రజా సంఘ నిర్మాణానికి అవసరమయిన సరైన దిశానిర్దేశం చేయాలి.

182. చిన్న మధ్య తరగతి రైతులు ఆర్థిక రక్షణకు అవసరమయిన సహాయాన్ని సహకార సంఘాలు అందించగలవు. గ్రామాలలో ఉత్పత్తులుచేసే క్రమంలోను, తయారీలోనూ, విలువను పెంచుకునే సమయంలోను, అమ్ముకునేటప్పుడు, రుణాల వెసులుబాటు కల్పించడంలోనూ సహకార సంఘాలు, స్వయం సహకార బృందాలు సహాయపడగలవు. కేరళలో ఒక విస్తృతజాలం సహాయంతో రైతులకు రుణ సదుపాయాన్ని, మార్కెట్ సదుపాయాన్ని అందించగలుగుతున్నాము. రైతులకు ప్రయోజనం కల్పించే రకరకాల ప్రభుత్వ స్కీములలో మన జోక్యంతో రైతులు గ్రామీణపేదలు లాభపడవచ్చు. ఈ

స్కీములలో కొన్ని మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం, ప్రజాపంపిణీ వ్యవస్థ, ఐ.సి.డి.ఎస్, మధ్యాహ్న భోజన పథకం, వన హక్కుల చట్టం, రాష్ట్రీయగ్రామీణ వికాస్ యోజన, జాతీయ గ్రామీణ ఉపాధి మిషన్ వగైరా. మనం గనక సమర్థవంతంగా జోక్యం చేసుకోగలిగితే గ్రామీణ పేదలను పెద్ద ఎత్తున సమీకరించగలుగుతాము; గ్రామీణ పేదలు పొందవలసిన ప్రయోజనాలు పక్కదారి మళ్లకుండా వారే పొందేట్టు చూడగలుగుతాము; గ్రామీణ ధనికుల వైపు మరలకుండా కాపాడగలుగుతాము.

183. చివరిగా గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయేతర పనులనే ఎక్కువగా చేసే వ్యవసాయ కూలీలను గ్రామీణ శ్రామికులను సంఘటితం చేయవలసిన కర్తవ్యం ఉంది.

184. అధ్యయన బృందం సూచించినట్టు గ్రామాలలో వ్యవసాయేతర పనులు చేసే గ్రామీణ కార్మికులు అనేకులున్నారు. వ్యవసాయ కార్మికులు కూడా జీవనోపాధికోసం, బతుకు తెరువు కోసం అనేక వ్యవసాయేతర పనులు చేస్తున్నారు. వ్యవసాయ కార్మికులు ఇంకా చాలామంది సంఘటితం కాలేదన్న వాస్తవాన్ని గనక చూసినట్లయితే, దేశంలోని కేవలం 15 రాష్ట్రాల్లోనే వ్యవసాయ కార్మిక సంఘం ఉన్నదన్న వాస్తవాన్ని పరిగణలోనికి తీసుకున్నట్లయితే వ్యవసాయ కార్మికుల సంఘాన్ని నిర్మించి విస్తృతపరచాల్సిన అవసరాన్ని గమనిస్తాం.

185. గ్రామీణ కష్టజీవులకు సంబంధించినంతవరకు, వీరు గ్రామాలలో పెరుగుతున్న కార్మిక వర్గం. వారిని సంఘటితం చేయాలి, అదేసమయంలో వేరు వేరు సంఘాలుగా నిర్మించాలి. నిర్మాణం, ఇటుక పని, రవాణా రంగాలలో ఉన్న గ్రామీణ కార్మికులను ఆయా కార్మిక సంఘాలలో సంఘటితం చేయవచ్చు. వలస కార్మికులను కూడా గ్రామీణ కార్మిక సంఘాలలో సంఘటితం చేయవచ్చు. చేనేత కార్మికులను సంఘటితం చేసిన అనుభవం కేరళ, ఆంధ్ర ప్రదేశ్ (ఉమ్మడి)లకు ఉంది. వేరు వేరు రంగాలలోని కష్టజీవులను వేరువేరుగా సంఘటితం చేయాలి. వారి మధ్య గ్రామీణ కార్మిక ఫెడరేషన్ ద్వారా ఒక సమన్వయము ఉండాలి. పరిస్థితి రాష్ట్రానికి రాష్ట్రానికి మారుతుంది; ఈ ఫెడరేషన్ ఏ రూపంలో ఉండాలన్నది ఎలాంటి ఫెడరేషన్ ఉండాలన్నది ఆ గ్రామీణ సంఘాలు రాష్ట్ర స్థాయిలో నిర్ణయించుకోవచ్చు. భూస్వాములకు గ్రామీణ ధనికులకు వ్యతిరేకంగా పోరాడేందుకు వ్యవసాయ కార్మిక సంఘం,

గ్రామీణ కార్మిక సంఘం, రైతు సంఘం సమన్వయంతో కలిసి పనిచేయాలి.

**వర్గ నిర్మాణం**

186. అటుపిమ్మట మనం భారతీయ పల్లెపట్టుల్లోని అత్యంత ప్రధానమైన సామాజిక-ఆర్థిక లక్షణాల గురించి ప్రత్యేకంగా చర్చించవలసి వున్నది.

187. గ్రామసీమల్లో పెట్టుబడిదారీ అభివృద్ధి అసమంగా వున్నది -పెట్టుబడిదారీ విధానం యొక్క అసమ అభివృద్ధి నిజానికి ప్రపంచీకరణ దశలో మరింత తీవ్రరూపం దాల్చింది- వ్యవసాయ సంబంధాలు పాతకాలపు వ్యవస్థలు, సాంఘిక రూపాలతో వర్తమానంలోకి అడుగుపెట్టాయి. మొత్తంమీద కొట్టవచ్చినట్లు కనిపించే లక్షణమేమిటంటే, గ్రామీణ భారతంలో పెట్టుబడిదారీ విధానం విస్తరించి తీవ్రతను సంతరించుకోవటం.

**భూస్వాములు-బడా పెట్టుబడిదారీ రైతులు**

188. గ్రామీణ ప్రాంతంలో భూస్వాములు, బడా పెట్టుబడిదారీ రైతులు రాజ్యాధికారానికి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లుగా మనం గుర్తించాము. ప్రధానంగా యీ వర్గంలో రెండు విభాగాలు వున్నాయి. భూమితోపాటు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో తమ స్థానాన్ని వారసత్వంగా పొందినవారు మొదటి రకానికి చెందినవారు (అంటే, చారిత్రకంగా భూస్వామ్య కుటుంబాల నుంచి వచ్చినవారు). స్వాతంత్ర్యానంతర పెట్టుబడిదారీ అభివృద్ధి కారణంగా ప్రయోజనాన్ని పొందినవారు రెండవ తరహాకు చెందినవారు. వీరి ప్రస్తుత పరిస్థితి గ్రామీణ భారతంలో వుత్పత్తి శక్తుల అభివృద్ధి నుంచి జనించింది. ఈ రెండు తరగతుల వారు -పెట్టుబడిదారీ భూస్వాములు, బడా పెట్టుబడిదారీ రైతులు- గ్రామీణ ప్రాంతంలో ఒకే వర్గంగా సమ్మిళితం అయ్యే క్రమంలో వున్నారు. భారతదేశపు గ్రామాల్లో అత్యుత్తమమైన భూమి వీరి స్వాధీనంలో వున్నది. భూమిపై వీరికున్న యాజమాన్యం కారణంగానే యీ వర్గానికి అధికారం చిక్కింది. కాగా యీనాడు వారికి పశుపోషణ, చిన్న-మధ్యతరహా వస్తూత్పత్తి, వడ్డీ వ్యాపారం, వాణిజ్యం, సేవారంగం, ప్రైవేటు విద్య-వైద్య సౌకర్యాలు, నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ తదితర కార్యకలాపాల ద్వారా వీరివద్ద సంపద పోగుపడుతున్నది. ప్రభుత్వ సంస్థలు ప్రధానంగా వీరికే వుపయోగపడుతున్నాయి. బూర్జువా రాజకీయ పార్టీలలో వీరే ఆధిపత్య స్థానంలో వున్నారు. గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ సంపన్నులతో వీరికి సన్నిహిత సంబంధాలు వున్నాయి (15 నుంచి 27 పేరాలు).

189. వాస్తవానికి భూస్వామ్య, పెట్టుబడిదారీ రైతు వర్గానికి భూమి ఎంతోకాలం సర్వస్వంగానూ లేదా ప్రముఖమైనదిగానూ, ఆదాయ వనరుగానూ, ఆర్థిక కార్యకలాపంగానూ వుండటం లేదు. మన వుద్యమాలకు యిదొక ప్రధానాంశం. ప్రత్యేకించి భూస్వాముల భూమిని స్వాధీనం చేసుకుని పంపిణీ చేసేలా పోరాటాన్ని సాగించాలి. ఈ తరహా వర్గశత్రువుతో ఎలా పోరాడాలా అన్న విషయమై తాజాగా ఆలోచన చేయవలసిన అవసరం వుందని నివేదిక చెప్తున్నది. విస్తృత ఆర్థిక కార్యకలాపాలపైనా, గ్రామాల్లోనూ ఆ పరిసరాల్లోనూ వున్న వ్యవస్థలపైనా భూస్వాములకు, బడా పెట్టుబడిదారి రైతులకు పూర్తిస్థాయి అదుపు వుండటం వలనే (గ్రామ ప్రాతిపదికపై సాగే దోపిడీ ద్వారా మాత్రమేకాదు) వారికి పెత్తనమూ, ఆధిపత్యమూ లభించాయి. ఈ పరిస్థితిలో కేవలం భూ విషయంగా మాత్రమే యీ వర్గంతో పోరాడలేము. భూమి సమస్య కేంద్రకమన్న విషయాన్నీ సమగ్ర భూసంస్కరణల ప్రాధాన్యాన్నీ గుర్తిస్తూనే, మిగులు భూములను, గుర్తించి, ఆక్రమించి, పంపిణీ చేయాలన్న డిమాండు ప్రస్తుత సమయంలో అనేక ప్రాంతాలలో వెనువెంటనే వాస్తవ రూపం దాల్చేది కాదన్న విషయాన్ని గుర్తించాలి (పేరాలు 28–30).

**కష్టజీవులు**

190. వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలలో పనిచేసే వేతన శ్రామికులు గ్రామీణ శ్రామికులలో అత్యధికులుగా వుంటారు. ఇందుకు సంబంధించి నివేదికలోని ప్రధానమైన పాయింట్లు యీ విధంగా వున్నాయి. మొదటి విషయం ఏమంటే, వ్యవసాయంలోని వేతన శ్రామికులు, వ్యవసాయేతర రంగంలోని వేతన శ్రామికులు యింకెంత మాత్రం గ్రామీణ శ్రామికులలో రెండు భిన్నమైన తరగతులుగా లేరు. వ్యవసాయ రంగానికి చెందిన వేతన శ్రామికులు వ్యవసాయేతర పనులకు కూడా వెళ్తున్నారు, పట్టణ ప్రాంతాలకు వలస పోతున్నారు (పేరాలు 32–35). పాక్షికంగా వ్యవసాయ, గ్రామీణ లక్షణాలను నిలుపుకున్న గ్రామీణ శ్రామికులు పట్టణ కార్మికులకు భిన్నంగా వుంటారు (పేరా–54). రెండవదేమంటే గ్రామీణ భారతంలో వేతనాలు తక్కువగా వున్నాయి. పైగా యివి ప్రాంతీయంగా వేర్వేరుగానూ, స్త్రీపురుషుల మధ్య తేడాగానూ వున్నాయి (పేరాలు–52,53). మూడవ విషయం ఏమంటే గ్రామీణ శ్రామికులకు సగటు పనిదినాలు తక్కువగా వుంటున్నాయి, స్త్రీల విషయంలో మరింత తక్కువగా వుంటున్నాయి (41–51). తక్కువ వేతనాలు, తక్కువ

పనిదినాలు కలసి పేదరికాన్ని ఎక్కువ చేస్తున్నాయి.

191. గ్రామీణ శ్రామిక సంఘాన్ని స్థాపించే విషయమై తీవ్రంగా ఆలోచించ వలసిందిగా మేము పార్టీకి సలహా యిచ్చాము. ఇలాంటి యూనియన్ గ్రామసీమల్లోని అన్ని వృత్తుల వారినీ కలుపుకు రావాలి. దానితోపాటే, వేతనాలు, ఉపాధి, కులము, లింగము, తదితర సామాజిక వెలి, అణచివేతకు సంబంధించిన రూపాలతోపాటు, జీవన భృతి, జీవన ప్రమాణాలు వగైరా అంశాలను చేపట్టాలి. ఈ పోరాటాలు ప్రభుత్వంతోనూ, అలానే గ్రామీణ ప్రాంతాలలో దాని ప్రతినిధులైన భూస్వాములతోనూ, బడా పెట్టుబడిదారీ రైతులతోనూ యితరంగా వున్న గ్రామ సంపన్నులతోనూ ఘర్షణ పడేలా చేస్తాయి (పేరా:54–55)

***రైతాంగం***

192. రైతులు ఏకవర్గంగా లేరు. ఏ ప్రాతిపదికపై రైతులను విభజించాలో యీ నివేదిక చర్చించింది (పేరాలు:57–61). రైతుల్లో అంతర్గతంగా వున్న నిర్దిష్టమైన లక్షణాలు మన వుద్యమానికి ఆటంకంగా వున్నాయి. మొట్టమొదటి విషయం ఏమిటంటే, ఎక్కువ భాగం రైతు కుటుంబాల ఆదాయం వ్యవసాయేతర మార్గాల నుంచి, కొద్దిపాటి స్వయం వుపాధి, వేతన వుద్యోగాలు, వేతన శ్రమల నుంచి వచ్చినది. రెండవదేమంటే, యంత్రాల రాకతో వ్యవసాయ పనులలో మార్పులు వచ్చాయి. మన దేశంలోని ఎక్కువ భాగంలో ప్రధానంగా ఆహార పంటలు సాగుచేసే ప్రాంతాలలో వ్యవసాయంలో కుటుంబ శ్రమ తగ్గిపోయింది.

193. మూడవది, వ్యవసాయ సంక్షోభంలోని సరికొత్త, ప్రగాఢమైన అంశం రైతు ఆదాయాల్లో సంక్షోభం. ఇది నేరుగా పంట వుత్పత్తి నుంచి వచ్చినది. ఉదారవాద దశ అనంతర కాలంలో పేద, మధ్య తరగతి రైతుల్లో గణనీయమైన భాగం వ్యవసాయంలో నష్టాలను ఎదుర్కొన్నట్లుగా మన దగ్గరున్న గ్రామ సమాచారం తెలియచేస్తున్నది. పెట్టుబడిదారీ తరహా వుత్పత్తి పూర్వరంగంలో "సంక్షోభం" అన్న పదాన్ని మార్క్స వినియోగించాడు. నయా వుదారవాద దశలోని వ్యవసాయ సంక్షోభం పునరుత్పత్తి క్రమంలో ఆటంకాన్ని కల్గిస్తున్నట్లు గ్రామస్థాయి అధ్యయనం తెలుపుతున్నది (69–74).

194. పేద, మధ్యతరగతి రైతులు చిన్నతరహా వుత్పత్తుల కారణంగా అనూచానంగా ప్రతికూలతలను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని పెట్టుబడి ఖర్చులను తగ్గించి, పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించటంతోపాటు

పేదరైతులకు వ్యవసాయ సేవలను అందించి, ధాన్యం నిల్వలకు, మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించినపుడు మాత్రమే రైతులకు నిర్ణయాత్మకమైన ఆదాయం వుంటుంది.

195. నాల్గవది రైతుల్లో వ్యత్యాసాలు, ఇటీవలి సంవత్సరాలలో చాలా వేగంగా సాగుతున్న శ్రామికీకరణ ప్రక్రియలో యీ మార్పు ప్రతిబింబిస్తున్నది (పేరాలు 75–84). సేద్యపు కార్యక్రమాలు కుదించుకుపోయిన ప్రత్యక్ష ఫలితంగా శ్రామికీకరణ చోటుచేసుకున్నది, అంటే, వ్యవసాయ కార్మికులు, పేద, మధ్యతరగతి రైతులు భూమికి దూరమవుతున్నారన్న మాట. గ్రామీణ ప్రాంతంలో భూమిలేని స్థితి పెరుగుదల శ్రామికీకరణలో ప్రతిబింబిస్తున్నది. శ్రామికీకరణ వేతన కార్మికుల మార్కెట్ విస్తరణకు దారితీస్తున్నది. నూతన తరగతులు పేద, మధ్య తరగతికి చెందిన రైతులు గ్రామీణ పట్టణ ప్రాంతాలలోని వ్యవసాయ, వ్యవసాయేతర పనుల కోసం వేతన శ్రామికులలో కలుస్తున్నారు.

196. ప్రస్తుత సమయంలో కౌలుసరి కొత్తదైన సంక్లిష్ట రూపాన్ని సంతరించుకుంటున్నది (పేరా:63–68)

**మూకుమ్మడి పేదరికం**

197. కొంతమందిపట్ల వివక్షత, అణచివేత, దోపిడీలు భారతదేశంలోని వ్యవసాయ సమస్యలో అంతర్భాగం. అణచివేతను పునాదిగా కలిగిన కుల వివక్షత, అంటరానితనమూ, తెగ, లింగంల ప్రాతిపదికపై చూపే వివక్షతలను నాశనం చేయకుండా వ్యవసాయ సమస్య పరిష్కారం కాబోదు. గ్రామీణ ప్రాంతంలో కులవివక్ష, యితర అణచివేతలు లేకుండా సామాజికార్థిక వ్యవస్థ స్వతంత్రంగా నిలవజాలదు. (పేరా 93–106)

198. మనపోరాటం వివక్షతలకు, పేదరికానికి వ్యతిరేకంగా క్రియాశీలంగా, రాజీలేని పోరు సాగిస్తుంది. మనం శ్రామికులలో ఐక్యతను స్థాపించాలి. మధ్యయుగాల నాటి సామాజిక రూపాలు, సామాజిక వ్యత్యాసాలు వున్న దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే స్పష్టమైన ప్రత్యామ్నాయాన్ని చూపగలదు. ఇదే సమయంలో సామాజిక వివక్షతలకు వ్యతిరేకంగా పోరాడుతుంది (పేరా:105–106).

**వలసలు**

199. వివిధ రకాలైన పనులు చేసే గ్రామీణ శ్రామికులు వలసలు పోవటం

గురించి నివేదిక సవివరంగా పేర్కొన్నది (పేరాలు:107-112). రానున్న కాలంలో వలసలు మరింతగా పెరగనున్నాయి. మరీ మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగం పుంజుకున్నపుడు పెరుగుదల ఎక్కువగా వుండనున్నది. డిమాండ్లను రూపొందించటానికి, శ్రామికులకు, వారి జీవితాలకు సంబంధించిన విషయాలను గ్రహించటానికిగాను వలసల తీవ్రతనూ, దాని దిశనూ, దేశంలోని వివిధ ప్రాంతాలలో వలస శ్రామికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవటానికీ, వివిధ ప్రాంతాలలోని వారి స్వగ్రామంలో నివసిస్తున్న వలస కార్మికుల కుటుంబాల పరిస్థితిని, నిర్దిష్టంగా విశ్లేషించడానికీ పార్టీ, ప్రజాసంఘాలు కృషి చేయాలి. ఇది చాలా ప్రధానమైన అంశం.

***శ్రామిక-రైతుపొత్తు***

200. తగ్గిన పంట ఆదాయాలకు తోడు పెద్దయెత్తున శ్రామికీకరణ కలసి గ్రామీణ ప్రాంతంలో శ్రామిక-రైతు పొత్తుకు నూతన ద్వారాలు తెరిచాయి (పేరా:113)

***ఉదారవాద అనంతర కాలంలో యితర అంశాలు***

201. సంపన్నులకు అనుకూలంగా, అదేవిధంగా బడా బూర్జువాలకూ, వారి సామ్రాజ్యవాద మిత్రులకూ అనుకూలంగా వుండేలా గ్రామీణ భారతంలోని వర్గపొందికను మార్చేలా 1991 నుంచి వరుసవారీగా శాసనాలు, నిబంధనలు, నియమాలు, ఉత్తర్వులు, యితర విధాన చర్యలు ప్రభుత్వ ఆమోదాన్ని పొందాయి. విధానపరమైన యీ నిర్ణయాలు పలు ఆర్థిక, సామాజిక విషయాలకు అన్వయిస్తాయి. ఉదాహరణకు రుణాలకు, వ్యవసాయ రంగంలో దేశీయ, అంతర్జాతీయ వాణిజ్యము, వ్యవసాయంలో కార్పొరేట్ పెట్టుబడులు, భూమి వినియోగం, ఆహార భద్రత వంటి విషయాలకు యివి వర్తిస్తాయి. విద్య, ఆరోగ్యం, పేదరికం యితరమైన మానవ శ్రేయస్సుకు అవసరమైన విషయాలను పై పరిణామాలను ప్రభావితం చేస్తాయి.

ఈ నివేదికలో పైవాటిల్లో కొన్ని విషయాలు చర్చకు వచ్చాయి. గ్రామీణ రుణం (పేరా:118-121), వాణిజ్య సరళీకరణ (122-126), కార్పొరేట్ పెట్టుబడులు, వ్యవసాయం, ప్రభుత్వం (127-132), ఆహార భద్రత (133-138), ప్రభుత్వ పథకాలు (139), సహకార సంఘాలు, యితర చొరవలు (140), ఆదాయము-పేదరికము (141-143), విద్య (144-150), ఆరోగ్యం (151-154), గృహవసతి (155-156), వాతావరణ మార్పులు, వ్యవసాయము, గ్రామీణ విపత్తుల నిర్వహణ (157-166)

202. గ్రామీణ భారతంలో మన పార్టీ భవిష్యత్ అభివృద్ధి, పురోగమనం, ప్రగతి కోసం పోరాటం సాగాలి. గ్రామసీమల్లో వస్తుగత పరిస్థితుల గురించి అవగాహన వుండాలి. ఈ రకమైన అవగాహన తిరిగి వుత్పాదక శక్తుల గురించిన నిర్దిష్టమైన, వస్తుగత అధ్యయనంపై ఆధారపడాలి. గ్రామీణ సామాజికార్థిక వర్గాలు, ఇతర సామాజిక బృందాలు, వుత్పత్తి సంబంధాలలో మార్పులు వగైరాల గురించి అధ్యయనం చేయాలి. ఈ దిశలో యీ నివేదిక ఒక చిన్ని అడుగు మాత్రమే.

**అధ్యయన బృంద సభ్యులు**

*వి.కె. రామచంద్రన్ (కన్వీనర్)*
*వెంకటేశ్ ఆత్రేయ*
*అశోక్ ధావలే*
*విజూ కృష్ణన్*
*సూర్యకాంత్ మిశ్రా*
*ఎ. విజయరాఘవన్.*


**ప్రతులు : 2000**
**ప్రచురణ కాలం : జనవరి, 2018**
***వెల : ₹ 30/-***

132435

**ప్రచురణ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ**

***27-13-3, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, ఆకుల వారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ నెం. 0866 2577202, 9490098042***